కీర్తనలు

# హరి సేవకే వేంకటేశ మకుటం - 1,2



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని గీతా దీక్ష వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) గీతా దీక్ష వారి వెబ్ సైట్: http://geetadeeksha.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో గీతా దీక్ష వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Helpline: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## గీతా దీక్ష వారి వెబ్ సైట్:

## http://www.geetadeeksha.com



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు









# హరి సేవకే వేంకటేశ మకుటం

సంపుటం - 1,2

## అన్నమయ్య, పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య సంకీర్తనలకు

# భావ పరిమళం


రచన

అమరవాది సుబ్రహ్మాణ్య దీక్షితులు

M.Tech.



## సతీ సమేత అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు


Address :

Flat No.5; Plot 61,

Siddardha Apartments,

Siddardha Nagar,


Hyderabad - 500 038, A.P, India

E-Mail : deekshitulu_a@yhaoo.com

Mobile : 9393021360

Website: http://www.geetadeeksha.com/

(సంపుటి - I)



# హరి సేవకే వేంకటేశ మకుటం

ఇది


అన్నమయ్య, పెదతిరుమలయ్య, చిన తిరుమలయ్య
సంకీర్తనలకు అమరవాది భావపరిమళం





శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



# హరి సేవకే వేంకటేశ మకుటం

## అన్నమయ్య, పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య సంకీర్తనలకు

# భావ పరిమళం

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

# హరి సేవకే వేంకటేశ మకుటం

(సంపుటి - I)

మొదటి ప్రచురణ

**ఏప్రిల్ 2014**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ ః

**కె.వి.ఆర్.**

98495 79345





## అంకితము

**మా తండ్రి, తాత, ముత్తాతలు, భార్యాసమేతులుగా**

**శ్రీపతి పాదపద్మాలు పొందెదరు గాక**



సీ॥ ప్రపితామహుడు నాకు పరగె మృత్యుంజయ
సోమయాజులుగారు చొక్కెముక్తి
దివికి సుబ్రహ్మణ్య దీక్షితులుంగారు
మా తాత వడిజేరె మహిని వీడి
చదివించు గతిలేక సంతబేహారియై
రామకృష్ణుడు తండ్రి లక్షలెన్నె
ఎంటెక్కు చదివియు ఇంకొక వ్యాపారి-
గామారి గడియించి కంటికీర్తి

ఆ.వె॥ రోగమొచ్చి బ్రతుకు రోతయై కుందితిన్
వేంకటేశుడేలె పెన్నిధాయె
కవితవ్రాయ నేర్పె ఘనమైన యీకృతి
అంకితమ్ము పెద్దలందరికిని.

# హరి సేవకే వేంకటేశ మకుటం

(సంపుటి - I)

అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య సంకీర్తనలకు

భావ పరిమళం

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అదెవంటశాలలో | 17/316 (పె.శృ) | 46 |
| 2. | ఆదిమలక్ష్మియతనికి | 17/510 (పె.శృ) | 45 |
| 3. | ఇంతిచెలువంబెంచయితరులకు | 23/347 | 18 |
| 4. | ఇంది యెంతగబ్బియో యెంచకువయ్యా | 22/227 | 4 |
| 5. | ఇట్టి గుణవంతురాలు | 17/257 (పె.శృ) | 43 |
| 6. | ఇదియెంత గర్వియని యెంచేవు గనక | 22/229 | 6 |
| 7. | ఇదివో నీవొళ్ళమేలు | 17/166 (పె.శృ) | 47 |
| 8. | ఇన్నాళ్ళవలెగాదు యిప్పుడు | 22/503 | 4 |
| 9. | ఇన్నియునుండగదమకేమి | 17/431 (పె.శృ) | 39 |
| 10. | ఏడనుండి వచ్చినాడే యీడకు | 23/92 | 21 |
| 11. | ఏమని తలతమ్మ | 17/463 (పె.శృ) | 49 |
| 12. | ఏమిమందు గద్దెయింతులాల | 10/108 (చి.శృ) | 22 |
| 13. | ఏమిటి దక్కువనాకు | 17/361 (పె.శృ) | 52 |
| 14. | ఏమివిన్నవించేము ఇంకా నీకు | 23/523 | 8 |
| 15. | ఏమిసేసేవో చూతము యెవ్వరు | 22/536 | 2 |
| 16. | కపటాలువద్దు గాకకాంతల | 23/507 | 10 |
| 17. | కాంతాళించాడినమాట గాదు | 10/71 (చి.శృ) | 25 |
| 18. | కాంతుడుమరునియాజ్ఞ | 10/68 (చి.శృ) | 29 |
| 19. | కానీవోయీ అందుకేమి కడపరాయ | 23/326 | 13 |
| 20. | కొమ్మలు పదారువేల గోవిందరాజు | 23/131 | 15 |
| 21. | కొలదులు మీరినగోవిందా | 23/183 | 19 |
| 22. | గక్కన చెక్కు నొక్కేవు కమ్మటి నువ్వు | 23/545 | 7 |
| 23. | గుట్టు మాతో జేసేవు | 17/360 (పె.శృ) | 40 |
| 24. | గొల్లదాననింతేనేను | 23/252 | 14 |
| 25. | ఘనుడవు చింతకుంట కంభమురాయ | 23/209 | 11 |
| 26. | చిక్కని సింగారరాయ | 17/533 (పె.శృ) | 38 |
| 27. | చిత్తమె చిమ్మిరేగితే సిగ్గేమి | 10/66 (చి.శృ) | 36 |
| 28. | చిత్తమెఅగక పతిసేవలేమి | 22/505 | 3 |
| 29. | చుల్లరివెట్టు జేతల చొక్కనాథుడ | 10/20 (చి.శృ) | 32 |
| 30. | చూతముగా నేడు నీ సుగుడతనము | 23/513 | 9 |
| 31. | చెప్పరే మీరైన బుద్ధిచెలులాల | 10/58 (చి.శృ) | 34 |
| 32. | చేకొని నీసేవలెల్లా జేసె | 23/489 | 17 |
| 33. | చేతులెత్తి మొక్కరమ్మ | 17/529 (పె.శృ) | 53 |
| 34. | తగవోబలిమో నీతలపు | 10/38 (చి.శృ) | 35 |
| 35. | నాలితనాలేటికోయి నారసింహుడా | 10/18 (చి.శృ) | 30 |
| 36. | నిన్నుజూచివెంగేలు | 17/461 (పె.శృ) | 48 |
| 37. | నీవెక్కుడో యాపెనీకంటె యెక్కుడో | 10/107 (చి.శృ) | 26 |
| 38. | నేడు నీచేతలెల్లా నీవెరగవా | 10/25 (చి.శృ) | 37 |
| 39. | పట్టినదే చలము | 17/359 (పె.శృ) | 51 |
| 40. | పాలుదాగె వెన్నదినె బాలుల | 10/87 (చి.శృ) | 23 |
| 41. | బంగారుమేడలోన పరమాత్ముడు | 23/330 | 12 |
| 42. | బాలుడ సేసేటిపనులా | 10/81 (చి.శృ) | 27 |
| 43. | బెల్లపుమాటల చెల్లపిళ్ళరాయ | 10/80 (చి.శృ) | 24 |
| 44. | మాకేమి మీకెట్లున్నా | 17/196 (పె.శృ) | 44 |
| 45. | మాటకుమాటేయాడి | 10/69 (చి.శృ) | 28 |
| 46. | మాయామానుషమహిమ | 17/470 (పె.శృ) | 50 |
| 47. | మేలుమేలు యిద్దరైమేకులు | 17/315 (పె.శృ) | 42 |
| 48. | వద్దు వద్దు నాతో వెచ్చీవేవని | 10/23 (చి.శృ) | 33 |
| 49. | వనితల జాడలు వద్దంటే మానరు | 23/113 | 16 |
| 50. | వెన్నవట్టుకొన నేయి వెదకనేలా | 23/69 | 20 |
| 51. | వెల్లివిరు లాయెనో | 17/194 (పె.శృ) | 41 |
| 52. | వేగమే రాగదవయ్యా వెలది | 22/467 | 5 |
| 53. | వేవేల చేతలవాడు వీడెవీడె | 10/29 (చి.శృ) | 31 |




హరి సేవకే వేంకటేశమకుటం

## ప్రార్థన

కం॥ శ్రీకరుడు వేంకటేశుడు
చేకొనితరియింపజేయు చిదుముడి బ్రతుకుల్
మీకిపుడు దీనిజెప్పుట
నాకబ్బిన భాగ్యమనుచు నమ్మెద సుండీ!!

ఉ॥ చేకొని వేంకటేశ్వరుని సేవగకైతలు చెప్పినారహో!!
ఆకడతాళ్ళపాక కవులైన మహాత్ములు అన్నమయ్యకున్
సోకగు పుత్రపౌత్రులతిసొంపుగ ఆమకుటంబుతోడనే
శ్రీకరువేంకటేశ్వరుని సేవతరించిరి మాకు భాగ్యమై.

ఆ.వె॥ భావపరిమళంబు పరిఢవిల్లుచునుండ
తాళ్ళపాక కవులు తలలువూప
నేటివారి కొరకు నీటుగ జెప్పెద
చదివి దీనిమెచ్చ సంతసింతు.

తే.గీ॥ మొదట శృంగార కవితలు ముగ్గురున్ను
చెప్పినవి ఎన్నుకొంటిని చెలువమొప్ప
ఆర్తితీరక అధ్యాత్మ కీర్తనముల
జెప్పితరియింతు వేంకటశిఖరవాస!

చం॥ సరసుడు వీడు శ్రీవిభుడు జన్మల భాగ్యప్రదాత తానెయౌ
తిరుమల చేరియొక్కపరిదీవెనలందుము మంచిదారిరా
పరిమితమైన జీవితము బాధ్యత తీరదు చావుదాక,నా
తెరవును మీరు చేకొనుడుదేనికి శంకలు నమ్ముడీహరిన్.





సీ॥ హరిసేవకే వేంకటాధిపు మకుటమ్ము
చేబూనికైతలు చెప్పినారు
అన్నమయ్య, అతనికాప్తుడౌ మనుమండు,
సుతుడు అదేబాట జొచ్చినారు
తాళ్ళపాక కవులు తరియించుటే కాదు,
మనబోంట్లకును ముక్తి మార్గమదిరి
కొడుకులన్నను తండ్రి కోర్కె దీర్చెడివారె
కొరివిబెట్టుటకేమి కొయ్యచాలు

ఆ.వె॥ అచ్చతెనుగు కవిత అవగతమగుటకు
నేటితరమువారి నేర్పు మితము
భావపరిమళంబు భక్తితో జెప్పితిన్
దిక్కునాకు నీవె తిరుమలేశ!

తరళము :
తరతరాలుగ శ్రీనివాసుని తాతతండ్రులు మన్మడున్
కొలుచుటే అపురూపమందురు కార్యదీక్షగ కైతలన్
విలువతగ్గక కీర్తనంబులు వేంకటామకుటంబుతో
చెలువమెప్పగ చెప్పిరందుకె చేరి బొందిరి మోక్షమున్.

కం॥ హరిసేవకె యీ దేహము
హరిజేరని జన్మయేల అది వ్యర్థమురా
హరిజెప్పని చదువెందుకు?
హరిగొల్వని చేతులేల హత్యలకొరకా?

మ॥ ఇదియే చక్కటి బాటరా కొలువనై ఈశున్ జగన్మోహనున్
పదిలంబైనది పెద్దలెందరొ ఇదే బాటంది వైకుంఠమున్
ముదమొప్పన్ గడియించిరయ్య వినుడీ ముద్దార నాకున్ హరే
అదిగో ఈ మకుటంబెరక్షయనుచున్ అందింతు మీకీ కృతిన్.

# తొలిపలుకు

శ్రీవేంకటేశ్వర అనే మకుటంతో 32000 కీర్తనలు చెప్పిన ఘనుడు తాళ్ళపాక అన్నమాచార్యులవారు. రమారమి 75 సంవత్సరాలు ఆ యజ్ఞం నిర్వహించారాయన. ఆయన కీర్తన వినని శ్రీహరిభక్తుడు వుండడు. మన దురదృష్టంకొద్దీ 20 వేల కీర్తనలు లభ్యంకాలేదు.

ఆయన తదనంతరం వారి సుపుత్రుడు పెదతిరుమలాచార్యులవారు తండ్రిమాట ప్రకారం అదే మకుటంతో తానూ అనేక కీర్తనలు చెప్పారు. అంతేకాదు తాతగారివద్దనే పెరిగి ఆయన వారసత్వంగా సాహిత్య పరిమళం అందుకొన్న ఒక సుపుత్రుని కన్నాడు. ఆయనే చినతిరుమలాచార్యులవారు. ఆయనా తాతగారివలె కీర్తనలు చెప్పి తిరుమలేశుని సేవించారు. కొడుకుల కవితా శైలి పరంపరగా సాగింది. ఇదివరలో అన్నమయ్య – అనుయాయులు అనే పేరుతో అన్నమయ్య భక్తి కీర్తనలు, పెదతిరుమలయ్యవి శృంగార కీర్తనలు, చినతిరుమలయ్యవి వైరాగ్య కీర్తనలను పరిచయం చేసే భాగ్యం ఆ తిరుమలేశుడు నాకు కల్పించాడు. దానిని టి.టి.డి. వారు ముద్రిస్తున్నారంటే, నా జన్మ చరితార్థమైనదని భావిస్తున్నాను.

నేడు అదే స్ఫూర్తితో వారి ముగ్గురి శృంగార కీర్తనలకు భావపరిమళం అందిద్దామనే తలంపు ఆ స్వామే నాకు





కలిగించాడు. దాని ఫలితమే ఈ నా ప్రయత్నం. ఇదే కోవలో భక్తి, వైరాగ్య కీర్తనలు చెప్పాలని నా ఆకాంక్ష. ఆపైన శ్రీనివాసుని దయ నా ప్రాప్తము.

నా భావన యేమంటే ముగ్గురిలోనూ పెదతిరుమలయ్య కవిత కొంచెం అధిక శ్రమపడునట్లు చేస్తుంది. అన్నమయ్య కవిత అలవోకగా వుంటుంది. కాకపోతే మనబోటి నవీన యుగమువారికి అన్నమయ్య కవిత కష్టమే. నాచేత తిరుమలనాథుడు చెప్పించిన దీనినాస్వాదించండి. నేను వాడిన భాష తేలికపాటిదే అవటంవల్ల మీకు నచ్చుతుందని ఆశిస్తాను.

పెదతిరుమలయ్య భార్య తిరుమలాంబ. ఈయన భగవద్గీతను తెలుగు వచనముగా చెప్పాడట. హరివంశాన్ని ద్విపద కావ్యంగా రచించాడట. రెండవది నేడు లభ్యమగుటలేదు. ఆయన "సంకీర్తనా లక్షణము" అనే గ్రంథమునకు వాఖ్య రచించినట్లు చినతిరుమలాచార్యులవారు పేర్కొనినాడు. ఈయనకు అనేక బిరుదులున్నాయట. వేదాంతాచార్య, కవితార్కిక కేసరివంటివి సుప్రసిద్ధములు.

ఆ దంపతుల సుపుత్రుడే చినతిరుమలాచార్యులవారు. ఈయనకు అష్టభాషా చక్రవర్తి అని బిరుదున్నది. తన తాతగారు అన్నమాచార్యుల శిక్షణలో పెరిగిన చిన తిరుమలయ్య తాతగారి కీర్తనలు జీర్ణించుకొని పెద్దవాడైనాడు. సంగీత సాహిత్యాలు

రెండిటిలోనూ దిట్ట. ఈయన నేటి గుంటూరు సమీపమునగల మంగళగిరి నరసింహస్వామిని దరించినట్లు ఒక శాసనముద్వారా తెలియవచ్చుచున్నది. ఈయన కీర్తనలద్వారా నేటి చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలోకూడా విశిష్టాద్వైతమత ప్రచారానికై దర్శించి పెక్కు అర్చావతారములను చినతిరుమలయ్య దర్శించి కీర్తనలు చెప్పినాడు. అలమేలుమంగాపురంలోని పెక్కు జీర్ణమైన ఆలయములను పునరుద్ధరించినాడు.

"హరి సేవకే వేంకటేశ మకుటం" అనే ఈ నా రచనలో మొదటి రెండవ సంపుటములలో శృంగార కీర్తనలు మూడు నాలుగు సంపుటములలో వైరాగ్య కీర్తనలు ఐదు, ఆరవ సంపుటములలో భక్తి కీర్తనలు చెప్పాలని నా ఆకాంక్ష. ఆపైన తిరుమలేశుని దయ నా ప్రాప్తము. తాత తండ్రి మనుమడి కవితా ఒరవడి పాఠకుల మన్నన అందుకొనేట్లు ఏడుకొండలయ్య దీవెనలకు ఆశపడుతున్నాను. లేకున్న ఇంత బృహత్ ప్రయత్నం నెరవేరేనా?

తండ్రుల దీక్షను తనయులు కొనసాగించటము ఈ నవీన కాలంలో తండ్రుల మాటవినే పుత్రరత్నాలే, రత్నాలవలె అల్పసంఖ్యలో వున్నారు. ఇక తండ్రి దీక్ష తమకేం పని అనుకోవడంలో ఆశ్చర్యమేముంది? కాని పెద తిరుమలయ్య వంటి కొడుకులు, చినతిరుమలయ్యవంటి మనుమలువున్న అన్నమయ్యలు నేటియుగంలో కానరారు. అందుకే నాఈ




హరి సేవకే వేంకటేశమకుటం

భగవత్సేవకు ఈ పేరు సరిపోతుందని భావిస్తాను.

ఇందులో 50 కీర్తనల సంపుటమునొకదానిని ఆడియో సి.డి.గా వెలువరించాలని నా ఆకాంక్ష. నా మిత్రులు విన్నకోట మురళీకృష్ణగారి సహకారంతో నా కోరిక తీరుతుందని నా ఆశ.

నా ఇతర రచనలన్నీ భగవద్సేవాభాగమే. అవన్నీ Google Site లో geetadeeksha.com లో లభ్యమవుతాయి

**తిరుమల తిరుపతి దేవస్థానములవారికి సదా కృతజ్ఞుడను**











సంఖ్య : 227   సంపుటము : 22   పుట: 152   రాగం : దేసాళం

**1 ఇది యెంతగబ్బియని యెంచకువయ్యా**
**కదిసి పట్టపుదేవిఁగా నన్ను నేలితివి** ॥పల్లవి॥

**పొందుగలవారికి పొరపొచ్చములు లేవు**
**మందెమేళమెఁ (మెం?)తైనా సమ్మతులేకాని**
**చెంది యేకతాన నుంటే సిగ్గులు పనికిరావు**
**సందడింపుఁదమకము చవిరేఁచుఁగాని** ॥ఇది॥

**వాడికైనవారికి వాసివంతు లెక్కడివి**
**జోడై యెంతపెనఁగినా సొంప(పు?)లౌఁగాని**
**కూడిమాడి వుండితేను కొంకుగొసరులు రావు**
**వీడనిమోవి తీపులు వేడుకలౌఁగాని** ॥ఇది॥

**సతమైనవారికి చలములు నిగుడవు**
**మితిమీరఁ గూడినాను మేలేయౌఁగాని**
**ఇతవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను**
**తతి నీనాకూటమి తారుకాణౌఁగాని** ॥ఇది॥ **227**

**భావ పరిమళం :**

“గబ్బి” అంటే గర్విష్ఠి అని అర్థం. అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో దేవి తిరుమలేశునితో ఇది యెంత గబ్బి అని నన్నెంచకయ్యా! నన్ను చేకొని పట్టపురాణిగా నన్ను నేలితివి కదా! అది చాలదానాకు. ఆలుమగలు పొందులనుభవించువారైతే వారిమధ్య ఏ పొరపొచ్చములూ వుండవు. వారు యెంత పరిహాసాలాడుకొన్నా అంగీకారములే వుంటాయి. అట్టి వారికి ఏకాంతం దొరికితే పనికి మాలిన సిగ్గును విడనాడాలి. సంరంభము కలిగించు తమకములు ఆతృతను పెంచుతూనే వుంటాయి. ఆలూమగలు ఒకరికొకరు అలవాటైతే వారిమధ్య ఎవరుగొప్ప ఎవరు తక్కువ అనే పంతములుండవు. వారు జోడైయున్నప్పుడు ఎన్ని చిట్టిపొట్టి పోట్లాటలు వచ్చినా సొంపుగానేవుంటుంది. వారు కలిసిమెలసి వుంటే సంకోచములుండవు. వీడని మధురాధరములు ఆస్వాదములేకాని వేరొకటి అక్కరలేదు. స్వంతమైన వారు మచ్చరముల జూపరాదు. వారి కూటములు మితిమీరినా వారికి మేలే. హితుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నేను అలమేల్మంగను. మన ఇరువురి కూటములు అందరికీ తార్కాణములవుతాయి.

★ **కూడిమాడి** – కలిసిమెలిసి ★ **కొంకుగొసరు** – సంకోచము





సంఖ్య : 536   సంపుటము : 22   పుట: 358   రాగం : సాళంగం

**2 ఏమిసేసెవో చూతము యెవ్వరు బలువో మీలో**
**నామొగము చూచి నీవు నవ్వులు నవ్వేవు** ॥పల్లవి॥

**ముంచి ముంచి తేనెగారేమోవినే మాటలాడి**
**పంచనుండేయాపె నిన్ను భ్రమయించెఁగా**
**కొంచెముగా నవ్వి పెద్దకొప్పు నీకు జూపిచూపి**
**వంచనతో నీకు మొక్కి వలపించెఁగా** ॥ఏమి॥

**పట్టెఁడేసిగుబ్బలపై పయ్యదించుక జారించి**
**బెట్టుగా సరసాలాడి బెల్లించెఁగా**
**గుట్టుతోఁ దప్పకచూచి గోరుసోఁక విడెమిచ్చి**
**చుట్టపుఁదనాల నిన్నుఁ జొక్కించెఁగా** ॥ఏమి॥

**చెయ్యరా సన్నలుసేసి సేసలు నీపైఁ జల్లి**
**తియ్యఁదనాలఁ దెప్పలఁ దేలించెఁగా**
**ఇయ్యెడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ**
**నెయ్యాన నన్నేలితివి నీ కప్పణ ఇచ్చెఁగా** ॥ఏమి॥ **536**

**భావ పరిమళం :**

అన్నమయ్య కూడా స్వామి వలపుకత్తె. స్వామికి చేరువయైన కొత్త వలపుకత్తె ఇంకొకతె దేవికంట్లో పడ్డది. ఇక జరుగబోయే సంకులసమరం తలచుకొని అన్నమయ్య తెగసంబరపడుతున్నారు. స్వామీ! ఇదివరకు మనం నీదేవి కళ్ళబడినప్పుడు తెల్లబోయిన నా మొగము చూచి నవ్వులొలికించావు కదా! ఇప్పుడు నీవు యేమిసేసేవో చూతము. తేనెలూరు మాటలతో నీవద్దనున్న కొంగ్రొత్త చెలియ నీ చెంతనే వుండి నిన్ను భ్రమపెట్టింది. ఈ కొత్త తళుకులాడి అతిపెద్దదైన తన కొప్పు నీకు గర్వంగా చూపిద్దామని వంచనతో నీ పాదాభివందనం చేస్తోంది. ఇంకొక సమయంలో తన పట్టెడు కుచగిరులపైనుంచి పమిట చెంగు కావాలని జార్చి నీతో సరసములాడి బెల్లించినది. తన గోరును నీకు తాకించేటట్లు, నీకు తాంబూలమిచ్చి తనకూ నీకూగల బంధుత్వం గుర్తుచేసి నిన్ను పరవశింపజేసినది ‘ప్రభూ!’ నీకు సైగలు చేసి రహస్యంగా నీపై తలంబ్రాలు పోసింది. నిన్ను తియ్యని మధురానుభూతులలో నింపింది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ నీదేవేరి అలమేల్మంగ తానే నీకు అర్పణయైనది. నాపైనుండే స్నేహభావంతో నన్నేలితివి. అంతేనయ్యా!

★ **బెల్లించి** – ఉబ్బించి ★ **చెయ్యార** – చేతులార

సంఖ్య : 505 సంపుటము : 22 పుట: 337 రాగం : భైరవి

**3 చిత్త మెఱఁగక పతిసేవ లేమిసేయుమనే-**
**వత్తుక యాతని నన్నీ నడిగి రావే** ॥పల్లవి॥

**చెప్పరానిమాఁటలకుఁ జెవులొగ్గఁబోతేను**
**కుప్పవడి తమకమే గుబ్బతిలును**
**ముప్పిరినవ్వులు సారె మూటగట్టఁబోతేను**
**చిప్పిలుఁజెమటలే చిందఁజొచ్చును** ॥చిత్త॥

**పిలువనిపేరటము పెండ్లికిఁ బోతేను**
**నిలువున నివ్వెరగులే నిండఁజొచ్చును**
**బలిమి చుట్టరికాలు పచారించఁబోతెను**
**వులివచ్చి వలపులే వుమ్మగిలును** ॥చిత్త॥

**వొక్కమాఁటె సరసాన వొడిగట్టఁబోతేను**
**మొక్కలముతోఁ బోఁకముడి వీడును**
**యిక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె**
**కక్కసించి కూడితే కాయే పండవును** ॥చిత్త॥ **505**

**భావ పరిమళం :**

ఇది కనుపించినంత సులభంకాని శృంగార కీర్తన. అన్నమయ్య వాడిన అచ్చతెనుగు పదముల వల్ల భావపరిచయం మరీ గడ్డుబారింది. పతికి సేవ చేయవలె. కాని ఆయన మనసెరిగి మసలుకోవటం, ఇంకా ముఖ్యం. ఆతని నడిగి నీవే ఈమాట నిజం అవునో కాదో తెలుసుకోవే. దేవీ! ఇరుగుపొరుగువారి ద్వారా చెప్పకూడని విషయాలు వింటే కుప్పగా కూడిన తమకములే అతిశయించును. ఆయనతో అతిఛలోక్తులాడరాదు. నవ్వులు అధికమైతే చివరకు చెమటలు కక్కవలసివుంటుంది. చెలీ! పిలువని పేరంటమునకుగాని పెండ్లికిగాని పోతే నీకు, మిక్కిలి దుఃఖమే మిగులుతుంది. బలవంతాన ఇరుగుపొరుగుతో చుట్టరికాలు 'పుట్టించు'కొంటే వాళ్ళగొడవ అధికమై, మీ భార్యాభర్తలమధ్యనున్న నులివెచ్చని వలపు నీరుగారిపోతుంది. దేవీ! సరసోక్తులు లేకుండా మూర్ఖంగా మొగవాడు నీ చీరెపోకముడి వూడదీస్తే బాగుంటుందా? కానీ ఇంతలోనే శ్రీవేంకటేశ్వరుడు ఇక్కడే నాతో కూడినాడు. సంకటపరచి కూడితే కాయే పండు అయిందనుకోక తప్పదమ్మా!

★ **గుబ్బతిలును**-అతిశయించును ★ **తమకంతో**-ఉత్సాహంతో ★ **నివ్వెరగు**-మిక్కిలి దుఃఖము ★ **వులిపచ్చి**-నులివెచ్చని ★ **మొక్కలము**-మూర్ఖముగా ★ **కక్కసించి**-సంకటపరచి





సంఖ్య : 503 సంపుటము : 22 పుట: 336 రాగం : సాళంగం

**4 ఇన్నాళ్లవలెఁ గాదు యిప్పుడు నీభావము**
**చిన్నారిపొన్నారినోరఁ జెప్పవయ్యా సుద్దులు** ॥పల్లవి॥

**యింతి యెవ్వతైనా వచ్చి యీడ నీకు నిచ్చెనో**
**వింతవుంగరము నీవేల నున్నది**
**చెంతనుండి యాపె నీకు సేవలేమైనాఁ జేసెనో**
**కాంతుఁడ నీపచ్చడానఁ గడుపస పున్నది** ॥ఇన్నా॥

**యెంచరానిచుట్టము నీకెవ్వతైనా యిచ్చెనో**
**మించులపుంజాలదండ మెడ నున్నది**
**కంచముపొత్తు గలసి కాఁపురాలు సేసెనో**
**మించునీచెక్కుల నంటి మెరసీఁ గాటుకలు** ॥ఇన్నా॥

**వన్నెలాఁడి యెవ్వతైనా వాడికై నీకిచ్చెనో**
**చెన్నగుబాహుపురి నీచేత నున్నది**
**ఇన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు**
**యెన్న నాసొమ్ములే కావా యెఱిఁగితి నేను** ॥ఇన్నా॥ **503**

**భావ పరిమళం :**

దేవి తిరుమలేశునిలో వచ్చిన మార్పులు బాగా గమనించి స్త్రీ సహజమైన ఈసుతో ఎలా దెప్పుతున్నదో వివరిస్తున్నారు అన్నమయ్య. ఇందిరారమణా! నీవు వెలిబుచ్చుతున్న భావము ఇన్నాళ్ళవంటిదికాదు. ఆ వివరమంతా చిన్నారి పొన్నారి నీ నోటి గుండా నీవే చెప్పవయ్యా! స్వామీ! నీవేలికి తొడిగివున్న ఒక వింతవుంగరం కనుపిస్తోంది నాకు. నీవెక్కడికీ వెళ్ళకపోయినా అదెవత్తో వచ్చి నీకు ఇక్కడే ఇచ్చిందేమో. నీ బట్టలకు అంత పసుపు అంటుకొనివున్నది ఎవ్వతైనా నీకు మరీచెంతనే వుండిసేవ చేసినదా యేమయ్యా? స్వామీ! నీకు చెప్పలేని 'బంధువు' యెవ్వతైనా వచ్చి ప్రేమ ఎక్కువై తన మెడలోనున్న "కంటె" నీమెళ్ళో వున్నది? లేదా, నీతో ఒకే కంచంలో తినటం అలవాటైనా కామిని నీతో కాపురం వెలగబెట్టిందా యేమి? తమరి చెక్కిళ్ళమీద కాటుక మెఱసిపోతున్నది. ప్రభూ! వన్నెలాడి యెవ్వతైనా నీకు బాగా 'అలవాటై' అందమైన తన చేతనున్న బాహుపురి నీ చేతికికలంకరించిందా? ఓ శ్రీవేంకటేశ్వరా! చమత్కారానికన్నాను. ఇవి నా ఆభరణాలే, నేనే నీకు తగిలించాను.

★ **పచ్చడము**-వస్త్రము ★ **పుంజాలదండ**-కంటె ★ **బాహుపురి**-ఒక చేతి ఆభరణం

సంఖ్య : 497 సంపుటము : 22 పుట: 332 రాగం : రామక్రియ

**5 వేగమే రాఁగదవయ్య వెలఁదిఁ జూతువుగాని**
**జాగులేల సేసేవు సరసుఁడవు నీవు** ॥పల్లవి॥

**తలపోఁతలనె కొంతతడవు పొద్దులువుచ్చు**
**చెలికత్తెలతో కొంతసేపు పొద్దులువుచ్చు**
**చిలుకలకుఁ జదువుచెప్పి కొంతపొద్దువుచ్చు**
**వెలసి నిన్నుఁబాసినవిరహాన మగువ** ॥వేగ॥

**నీమీఁదిపాటలు వాడి నెమ్మిఁ కొంతపొద్దువుచ్చు**
**దీమసాన సిగ్గులనే తేరి కొంతపొద్దువుచ్చు**
**ఆముకొన్న ఆసలనే అటు కొంతపొద్దువుచ్చు**
**వేమరు నిన్నుఁబాసినవిరహానఁ దరుణి** ॥వేగ॥

**యెదురుచూపులనే ఇంటఁ గొంతపొద్దువుచ్చు**
**కదిసేటికోరికలఁ గడుఁ గొంతపొద్దువుచ్చు**
**ఇదివో శ్రీవేంకటేశ ఇంతలో వచ్చి కూడితి**
**వెదకీఁ జల్లారినవిరహాన వనిత** ॥వేగ॥

**భావ పరిమళం :**

అన్నమయ్య శ్రీదేవి చెలికత్తెయై తిరుమలేశుని వేడుకొంటున్నారు. ఈ వెలది విరహాగ్నిలో రగిలిపోతున్నది. కడు దీనయైన ఈమెను చూతువుగాని రావయ్యా! నీవు సరసుడవుకదా! ఆలశ్యము యెందుకు చేస్తావు. నీవు లేనప్పుడు ఈమెకు సమయమే గడువదు. అయినా యెలాగో కొంతసేపు నీగురించి ఆలోచనలతో గడుపుతుంది. చెలికత్తెలతో కొంతసేపు గడుపుతుంది. తన చిలుకకు చదువుచెప్పుచు కొంతసేపు గడుపుతుంది. నిన్ను బాసిన (వీడిన) నీరమణి విరహము వర్ణింపలేనిదయ్యా! తదనంతరం నీమీద ప్రణయగీతము లాలపించి కొంత పొద్దుపుచ్చుతుంది. పెద్దలెవరైన చూడవస్తే మర్యాదకొద్ది సిగ్గుపడుతూ వారితో గడుపుతుంది. మధురమైన రేయి కొరకు అధికమైన ఆశలతో కొంత పొద్దుపుచ్చుతుంది. నిన్ను బాసిన ప్రతిసారి ఈ తరుణి విరహము ఇలాగే వుంటుంది. ఇంట్లో నీకై ఎదురు చూపులు చూస్తూ కొంతసేపు గడుపుతుంది. రాబోయే రేయిలో నిన్ను ఏమి కోరవలెనా అని ఆలోచిస్తూ కొంతసేపు గడుపుతుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంతలో నీవేవచ్చి కూడితివి. ఇట్లామె విరహము చల్లారినది.

★ **ఆముకొన్న**– అధికమైన ★ **వేమరు** – అనేకపర్యాయములు





సంఖ్య : 229 సంపుటము : 22 పుట: 153 రాగం : దేశాక్షి

**6 ఇది యెంతగర్వియని యెంచేవుగనక నన్ను**
**పెదవులతుదలనే పిలిచితిఁజుమ్మీ** ॥పల్లవి॥

**కన్నుల మొక్కితిఁజుమ్మీ గక్కన నీకు నేను**
**కిన్నెర వాయించుకొంటా కెంగేలను**
**సన్నలుచేసితిఁజుమ్మీ సముకాననే యప్పుడు**
**చిన్ని చిన్న నగవులసిగ్గుతోడను** ॥ఇది॥

**అంది చోటిచ్చితిఁజుమ్మీ అండనే నీకు నేను**
**గందము వూసుకొంటా గద్దెమీఁదను**
**విందులూఁ జెప్పితిఁజుమ్మీ వేడుకతోడ నిలిచి**
**మందలించి చెలికత్తెమాఁటుననే వుండి** ॥ఇది॥

**యెదురుకొంటిఁజుమ్మీ ఇంపులచూపుల నీకు**
**ముదమున నాతురుము ముడుచుకొంటా**
**ఇదివో శ్రీవేంకటేశ యే నలమేలుమంగను**
**కదిసితి విటు నన్ను కడు సంతోసించితి** ॥ఇది॥ **229**

**భావ పరిమళం :**

దేవి మితభాషి. తనని వేడుకోనివారిని తలతిప్పియైన చూడదు. శ్రీవేంకటేశుని దేవేరినని ఆమెకు గర్వమున్నా అది ఎన్నడూ శృతి మించదు. ఈ కీర్తనలో ఆమె స్వామితో ఏమంటున్నదో అన్నమయ్య బాణీలో వినండి. స్వామీ! నేను నిన్ను యెలుగెత్తి పిలుస్తానని నన్ను గర్విష్టిగా అంచనావేస్తున్నావు. అందుకే నేను నిన్ను నా పెదవుల చివరనుంచి వాటిని కదల్చకనే పిలిచాను సుమా! నేను కన్నులతోనే నీకు మ్రొక్కెదనని నీకు తెలియదా! నేను కిన్నెర వాయిస్తున్నప్పుడు తొందరలో చేతిసైగతో పిలిచానేమో. అదీ తప్పేనా స్వామీ! నీ సుముఖాన చిన్నచిన్న నవ్వులతో సిగ్గులొలికిస్తూ వుంటాను. ఎందుకంటే అప్పుడు నా మనస్సు ప్రశాంతంగా వుంటుంది. స్వామీ! నీవు నావద్దకు వచ్చినప్పుడు నేను ఎదురువెళ్ళి ఆహ్వానించి కూర్చోబెట్టి చందన తాంబూలాదులిస్తే... నీవు గంధము పూసికొనుచు అక్కడేవున్న సింహాసనంపై కూర్చుంటే నేను విందు పురమాయిస్తుంటాను. చెలికత్తె మాటునవుండి ఇది వేడుకగా చూస్తుంటే గట్టిగా మందలించాను అంతమాత్రాన గర్విష్టినా? ఇవ్వాళ నాశిఖ తురుము ముడుచుకొంటుంటే నీవు వచ్చావు. నా ఇంపైన చూపులతో నిన్ను స్వాగతించాను. ఓ శ్రీవేంకటేఏశ్వరా! నేను నీ దేవేరి అలమేల్మంగను నీవు నన్ను కూడినావు, నాకింతకంటే సంతోషమేముంటుంది?

★ **కదిసితివి** – దగ్గరైతివి ★ **సన్నలు** – సైగలు

సంఖ్య : 545   సంపుటము : 23   పుట: 364   రాగం : భైరవి

**7 గక్కన చెక్కునొక్కేవు కమ్మటి నీవు**
**కిక్కిరిసినవేడుకఁ గృపఁ జూడవయ్యా ॥పల్లవి॥**

**నేరుపరిసతినైతే నీతో మాటాడుటగాక**
**వూరకుండేముద్దరాల నోపుదునా**
**గారవించి యింతయేల కదిసి వెడ్డువెట్టేవు**
**మారీతి నీవెఱఁగవా మన్నించవయ్యా ॥గక్క॥**

**చన్నులు గొప్పలైతే సరివెనఁగుదుఁగాక**
**చిన్నదాన నే నింతేసికిఁ గలనా**
**యిన్నిటా సారెకునేల యిచ్చకముసేసేవు**
**కన్నులెదుట నుందాన కరుణించవయ్యా ॥గక్క॥**

**మిక్కిలి ప్రౌఢనైతే మేలములాడుదుఁగాక**
**యిక్కువ సిగ్గరికత్తె నింతసేసేనా**
**వొక్కటైతివి శ్రీవేంకటోత్తమ యేల దూరేవు**
**తక్కులఁబెట్టక యిట్టె దయఁజూడరాదా ॥గక్క॥ 545**

**భావ పరిమళం :**

మధురమూర్తివైన నువ్వు నా చెక్కిలిని నొక్కి నన్ను సంతోషపెట్టావు. సమృద్ధమైన వేడుకలు దయచేయుమయ్యా అంటున్నది దేవి. అన్నమయ్య చెప్పిన అతి సరళ శృంగార కీర్తన ఇది. నీతో మాట్లాడితే నేర్పరి సతినైపోతానా? వూరకుండిపోతే ముగ్ధనా? నాకు గౌరవం ఇచ్చినట్లేఇచ్చి మోసం చేస్తావు. మా రీతినీకు ముందే తెలియును గనుక నీవే మన్నించాలి. మరి వనితలము కదా! మావి ఘనస్తనములైతే సరసముగా పెనగియుండే దాననుకానా? చిన్నదానను కదా! నాకు ఘనస్తనములు నప్పవయ్యా! ఇన్ని విషయములు తెలిసిన నాతో ఇక ఇచ్చకాలెందుకయ్యా? కన్నులెదుటేనున్న నన్ను కరుణించుట నీకనీస కర్తవ్యం స్వామీ! ఓ తిరుమలేశా! నేనేగనుక ప్రౌఢ వనితనైతే నీతో పరిహాసములాడివుండేదానను. నీతో ఇంతసేసినా, ఇంత సంభాషించినా నేనింకా సిగ్గులొలికే సిగ్గరికత్తెనే స్వామీ! నేను గడుసుదాననుకాదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నాతో వొక్కటైనావు కదా! మరి నన్ను అట్లే ఆనందంలో వుంచక ఏల నిందిస్తావయ్యా? నన్ను చిక్కుల్లోబెట్టక కరుణించవయ్యా!

★ **వెడ్డువెట్టేవు** – మోసంచేస్తావు ★ **మేలము** – పరిహాసము
★ **తక్కులుబెట్టు** – చిక్కులలోపెట్టు ★ **కిక్కిరిసి** – సమృద్ధమైన





సంఖ్య : 523   సంపుటము : 23   పుట: 351   రాగం : లలిత

**8 ఏమి విన్నవించేము ఇంకా నీకు**
**కామునిఁ గన్నతండ్రివి కరుణించవయ్యా ॥పల్లవి॥**

**వేమరుఁ దరుణిమీఁద వెల్లావిరి సేసేవు**
**కామునిగరిడిలోనికాఁతాళము**
**గోమున నీసుద్దులకు గొల్లెత లెట్టోరిచిరో**
**గామిడివిద్యలకెల్లా ఘనుఁడవుగావా ॥ఏమి॥**

**పొనుఁగక వొకమాఁటే పోగులుగాఁ బోసేవు**
**వనితమీఁదటను జవ్వనమదము**
**యెనసి పదారువేల నెంతయెలఇంచితివో**
**నినుపైనయాసోదము నీసొమ్మేకాదా ॥ఏమి॥**

**బత్తితోడ సేసలుగా పడఁతిపైఁ జల్లేవు**
**చిత్తములోపలఁ బులిసినగజరు**
**యిత్తల శ్రీవేంకటేశ యింతి నిన్నెట్టు కూడెనో**
**వుత్తముఁడ నీపనుల కొక్కఁడవే నీవు ॥ఏమి॥ 525**

**భావ పరిమళం :**

ప్రభూ! ఇంకా నీకు వివరంగా విన్నవించవలసిన పనియేమున్నదయ్యా? నీవు మన్మథునివంటి అందగాడికి తండ్రివి. ఈ తరుణిని కరుణించవయ్యా! అంటున్నారు దేవి చెలికత్తెయైన అన్నమయ్య. ఈ కీర్తనలో వాడిన అచ్చతెలుగు మాటలకి ప్రత్యేక నిఘంటువులు కావలసిందే. స్వామీ! అలనాడు గోపికలదగ్గర, నీవు రండగొండితనంలో ఘనుడవని తెలిసిపోయింది కదా! కానీ ఈనాడు నీవు అదే చేస్తున్నావు. ఈ తరుణిమీద మదన వ్యాయామశాలలో నీవు సామునేర్చిన వస్తాదువని, నిరూపణలు అక్కరలేదుకదా! స్వామీ! ఈ వనిత మీద నీ యౌవన మదము ప్రదర్శించుట న్యాయమా? వెనుదీయక ఒకమాటే, పోగులుగా బోసేవు (రాసిబోసేవు) అయినా ఇది నీకు కొత్తకాదు కదా! ఆనాడు పదియారువేలమంది రాచకన్నెలను యెంత ప్రోత్సహించి అందరూ నిన్ను ఒకమారు పెళ్ళాడేట్లు చేసినావు. నినుపైన (అధికమైన) కోరికలు నీ సొమ్మేకద్యా? స్వామీ! శాస్త్రోక్తంగా ఈ పడతిపై తలంబ్రాలు పోసేవు. అప్పుడు నీ మనస్సు గర్వపు ఉదుటుతో, ఉప్పొంగినది కాబోలు. ఓ శ్రీవేంకటేశ్వరా! యీ ఇంతిని ఇట్టేకూడితివి. నీవు పురుషోత్తముడవు నీ పనులకు నీవొక్కడవే తగినవాడవు.

★ **కాతాళము** – కోపము ★ **గామిడి** – గయ్యాళి ★ **పొనుగక** – వెనుదీయక
★ **ఆసోదములు** – కోరికలు ★ **పులిసినగజర** – గర్వపు ఉదుటు

సంఖ్య : 513   సంపుటము : 23   పుట: 343   రాగం : పాడి

**9 చూతముగా నేఁడు నీసుగుడతనములెల్లా**
**యేతులకు నెంచితే వూరెల్లా గొల్లెతలే** ॥పల్లవి॥

**వంతుల కింతులు నీపై వలపులు చల్లేరు**
**యెంతని మోచేవయ్య ఇప్పుడు నీవు**
**దొంతులువెట్టే రప్పటి దొడ్డదొడ్డకుచముల**
**అంతటి కీవురమెట్టు ఆనుకొనీనో** ॥చూత॥

**మోవులెత్తుకొ నిందరు మోవితేనె లొసఁగేరు**
**యేమి సేసేవయ్య నీవు యీఁతామోఁతలు**
**వాములు వేసేరు నీపై వడిగా రేపల్లెవారు**
**వోముచు నీతురుమెట్టు వోరుచుకొనీనో** ॥చూత॥

**సొలసి కన్నుఁగలువ చూపులనుఁ బూజించేరు**
**కొలఁదెట్టు పెట్టేవయ్య కుప్పలాయను**
**అలమి నిన్నుఁ గూడి అందరముఁ బిలిచేము**
**వెలయ శ్రీవేంకటేశ వీను లెట్టు వొందీనో** ॥చూత॥ **513**

**భావ పరిమళం :**

అన్నమయ్య స్వామిని దెప్పిపొడుస్తున్నారు. నీవు దేవదేవుడవని మేము ఆరాధిస్తుంటే ఆనాటి రేపల్లెవారుమాత్రం నిన్నొక గొల్లపిల్లవాడిలాగా భావించి నిన్ను ఎన్ని మాటలన్నారయ్యా? అయినా నీవువాళంటే మమకారమే చూపించావు. ప్రభూ! నేడు చూచెదము కదా! నీ సరసత్వము ఏపాటిదో? పోనీ నీ గొప్పతనాలు చూద్దామా అంటే నీకు రేపల్లె అంతా గొల్లకంపు ప్రియురాళ్ళేనాయె!! కానీ పాపం నిన్నుచూస్తే జాలివేస్తుంది స్వామీ! ప్రతి వనితా నీపై వలపులు చల్లేదే. ఇప్పటిదాకా ఆ వలపుల తాపాన్ని మోస్తూనేవున్నావు. ఆ గొల్లెతలు తమ పెద్ద పెద్ద చనుగవలు పోటీలుపడి నీవురమును కానించేవారే!! నీవెట్లా ఆనించుకోనిచ్చావయ్యా, స్వామీ! ఇంతమంది వలపుకత్తెలు నీ అధరామృతం జుర్రేస్తూ నానా బాధలు పెట్టారు కదయ్యా నిన్ను? ఇక నందుడు మొదలైన గొల్లవారంతా నీనెత్తిమీద గడ్డివాములుపెట్టి పదపద అని తొందరపెట్టేవారు. ఇంత అందమైన నీ కొప్పు ఆ వేదనంతా యెట్లా సహించిందయ్యా? నేడు కూడా, ఇంతమంది ప్రతిదినమూ నిన్ను చూసీచూసీ కళ్ళతోనే పూజిస్తారు కదా! వాళ్ళల్లో ఎవర్ని చిన్నచూపు చూడగలవయ్యా! ఇంతమంది గోవిందా అని ఎలుగెత్తి పిలుస్తుంటే నీ చెవులు ఆ మోత యెలా భరిస్తూవున్నాయయ్యా?

★ **సుగుడతనము**–సరసత్వము ★ **ఏతులు**–గొప్పలు ★ **ఆనుకొనీనో**– ఆనించుకోనిచ్చిందో ★ **ఈతామోతలు**–నానాబాధలు ★ **ఓముచు**–ఓర్చుకుంటూ ★ **కొలదిపెట్టు** –తక్కువచేయు





సంఖ్య : 507   సంపుటము : 23   పుట: 340   రాగం : శుద్ధవసంతం

**10 కపటాలు వద్దుగాక కాంతలతోను**
**యిపుడు చెల్లదా నీకు యెంతసేసినాను** ॥పల్లవి॥

**తమకాన నాపెపేరు తడవితి వింతేకాక**
**మమకారము నామీఁద మఱచేవా**
**భ్రమసితినంటా నాతో బాసలు సేయఁగనేల**
**జమళి నెందరైనా దోసములా నీకేమీ** ॥కప॥

**ననుపున నాతోడ నవ్వితి వింతేకాక**
**యెనసి నన్ను మన్నించ కేల మానేవు**
**పనిపరాకంటా నొడఁబఱచఁగ నింతయేల**
**తనివి చాలకుండితే తగదా నీకేమీ** ॥కప॥

**సొలసి మొక్కఁగా నాపెఁ జూచితి వింతేకాక**
**కలసితివి నన్ను నీకడ మున్నదా**
**తొలుతటిపొందులంటా తొరలించ నిపుడేల**
**చెలితో శ్రీవేంకటేశ సిగ్గా నీకేమీ** ॥కప॥ **509**

**భావ పరిమళం :**

తిరుమలేశుని ప్రేమించని తరుణి యెవ్వతుంటుంది? స్వామి తమకి వలపునందిస్తే సంతోషిస్తారు కానీ ఇంకొకదానికి దగ్గరవుతున్నాడంటే ఈర్ష్యతో రగిలిపోతారు. వారెవ్వరికీ సుఖం దక్కినా ఆనందం దక్కదు. అన్నమయ్యలాగ నిస్వార్థ ప్రేమికులే స్వామికి ఆప్తులు. ఒక ప్రేమిక ఏమంటున్నదో వినండి. స్వామీ! నీకు కాంతలతో కపటములెందుకయ్యా? నీకు నేను యెంత చేసినా నా శ్రమ చెల్లకుండా పోయిందే? నా వలపు తన్మయత్వంలో వున్నావనుకొంటే తమరినోటివెంట ఆమెపేరు వస్తున్నది. నామమకారం గాలికి వదిలేశావా? మళ్ళీ యేదో భ్రమలో అలా జరిగిందని నాతో బాసలు చేస్తావు. కలిసికట్టుగా యెంతమందైనా నీకేమి తప్పులే. స్వామీ! అనురాగంతో నన్ను చూచి నవ్వినవాడవు నిన్ను మన్నించక వదిలేస్తే యెట్లాగయ్యా. నీపని ఒత్తిడిలో పరాకుగా వున్నానని యెన్నిసార్ను నన్ను ఒడబరుస్తావు? తనివి తీరకపోయినా నీకేమీ పట్టకపోతే ఇక మేము మాత్రం చేసేదేముంటుందిలే? స్వామీ! నేడు అదెవత్తో సొలసి మెక్కిందని ఆమెని చూచినావు. అంతేకదూ? నేడు నాతో కలిసినావు. నీకడమున్నదా స్వామీ? మన తొలినాటి వలపులు ఇంకా ఈనాడు పుట్టిస్తే ప్రయోజనమేమటి? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇప్పుడు సిగ్గులతో పనియేముందయ్యా?

★ **సొలసి**–పరవశించి ★ **కడమున్నదా**–అంతమున్నదా ★ **తొరలించ**–పుట్టించ

సంఖ్య : 209 సంపుటము : 23 పుట: 140 రాగం : సామంతం

11 ఘనుఁడవు చింతకుంటకంభమురాయ। మముఁ
గనుఁగొని రక్షించు కంభమురాయ ॥పల్లవి॥

కంతునిగురుఁడ వోకంభమురాయ। శ్రీ-
కొంతఁ దొడపైనిడినకంభమురాయా
కాంతులు నీమేనెల్లఁ గంభమురాయ। యే-
కాంతమాడే వింతులతోఁ గంభమురాయ ॥ఘనుఁ॥

కప్పురపువిడేలకంభమురాయ
కప్పము గొనే వింతటఁ గంభమురాయ
కప్పులుదేరీ నీమోవిఁ గంభమురాయ
కప్పుకొమ్మీ పచ్చడము కంభమురాయ ॥ఘనుఁ॥

కమ్మఁజెమటలు నిండెఁ గంభమురాయ
కమ్మటిఁ గూడితి విట్టే కంభమురాయ
కమ్ముకొనెఁ బులకలు కంభమురాయ
కమ్మన(ని) శ్రీవేంకటాద్రి కంభమురాయా ॥ఘనుఁ॥

**భావ పరిమళం :**

కడపజిల్లాలోవున్న చింతకుంట గ్రామమే నరసింహస్వామి ఆలయం వున్నచోటని కొంతమంది భావిస్తున్నా ప్రస్తుతం అక్కడ చెన్నకేశవుని ఆలయం వున్నది. మరి అన్నమయ్య కాలంలో అదే నృసింహాలయమో లేక దానిపక్కనెక్కడో మరొక ఆలయముండేదో తెలియదు. ఏదిఏమైనా అన్నమయ్య సందర్శించినది, ఈ కీర్తన చెప్పినదీ కంభమురాయడని పిలువబడిన నృసింహునిపైననే. ఓ చింతకుంట కంభమురాయా! నీవు ఘనుడవు స్వామీ! మమ్మల్ని కనిపెట్టి రక్షించాలి ప్రభూ! అంటున్నారు. స్వామీ! నీవు మన్మథుని తండ్రివి. శ్రీకాంతను నీతొడపై కూర్చొనబెట్టుకున్నావు. నీ శరీరమంతా కాంతులు విరజిమ్ముతున్నది. నీవు ఉగ్రుడవైనా, కాంతలతో ఏకాంతమునే కోరుకుంటావు. అందుకే నీవు ఓ కంభమురాయా! ఈ కర్పూర తాంబూలం స్వీకరించవయ్యా! మానుంచి కప్పముగా కానుకలు స్వీకరించేవా స్వామీ! ఓ కంభమురాయా! నీమోవి రక్తము యెండిపోయి నల్లబడినదయ్యా! పచ్చని పీతాంబరము కప్పుకొన్న స్వామివి నీవేనయ్యా! కమ్మిన చెమటలతో నీదేహం నిండిపోయినదయ్యా! కమ్మగా కూడేటి కంభమురాయా! నా దేహంపై పులకలు కమ్ముకొన్నాయయ్యా! ఇంతాచేసి నీవే శ్రీవేంకటాద్రిపై కమ్మని వాడవయ్యా కంభమురాయా!

★ **పచ్చడము** – పీతాంబరము ★ **కంతుని గురుడు** – మన్మథుని తండ్రి





సంఖ్య : 380 సంపుటము : 23 పుట: 221 రాగం : శ్రీరాగం

12 బంగారుమేడలలోన పరమాత్ముఁడు వాఁడే
సింగారాలు మీఁదమీఁద సేయరే చెలులు ॥పల్లవి॥

తట్టుపుణుఁగుల నూనె తగ నిండా నంటుకొని
గట్టిగాఁ గస్తూరి యట కలివెట్టి
మట్టులేనిపన్నీట మజ్జనమాడె నిదె
వెట్టదీర నిందరును విసరరే చెలులు ॥బంగా॥

కప్పురపుగందవొడి కడు నిట్టె మెత్తుఁకొని
కొప్పు దువ్వి ముడిచెను గొజ్జంగలెల్లా
తెప్పలుగా నించుకొనె తిరుమేన సొమ్ములెల్లా
దప్పిదేర విడెమీరే తలకొని చెలులు ॥బంగా॥

అలమేలుమంగ నురమందు నిట్టె నించుకొని
తులసిదండలు మోఁచె నిలువునను
చెలరేఁగి యారగించె శ్రీవేంకటేశ్వరుఁడు
కొలువున్నాఁడు మోహాలు గుప్పరే చెలులు ॥బంగా॥ 330

**భావ పరిమళం :**

వాడే వేంకటేశ్వరుడు. తన బంగారుమేడలో వుంటాడు ఆ పరమాత్ముడు. స్వామికి ఏదో మన తృప్తికొద్దీ సింగారిస్తాము. ఓ చెలులారా! స్వామిని ఈ నిమజ్జనాంతరం అలంకరించి సిద్ధం చేయండి అంటున్నారు అన్నమయ్య. తన జీవితకాలంలో స్వామిని తప్పనిసరిగా ఆ నిమజ్జన సేవచేసి తరించారు. ఇది ఒకానొకనాటి నిమజ్జన కార్యక్రమము. స్వామిని యెలా సిద్ధం చేస్తున్నారో చూడండి. ఈ స్వామి, తగినట్లుగా తట్టుపునుగు నూనెతో కలియవెట్టిన కస్తూరిని దట్టించి, ఏ నిర్మాల్యమూలేని పన్నీటిలో స్వామి మజ్జనమాడజేశారు. ఓ చెలులారా! వెట్టదీర (తాపోపశమనమగునట్లు) విసరండమ్మా! మజ్జనానంతరం కర్పూరగంధముయొక్క పొడిని స్వామి ఒంటిపై మెత్తండి. ఆయన కొప్పు చక్కగా దువ్వి గొజ్జంగలతో (చేమంతిపూలతో) అలంకరించండి. పవిత్రమైన స్వామి ఒంటిపై చక్కటి ఆభరణములతో అలంకరణ చేయండి. ఇవన్నీ అయ్యాక స్వామికి దప్పికతో నోరెండిపోతుందేమో, మరి పరిమళ భరితమైన తాంబూలం అందించండి. దేవి అలమేల్మంగను వురముపై వుంచుకొన్న ఆ దేవదేవుడు నిలువెత్తు తులసిదండలు తనపైన ధరించాడు. తరువాత స్వామి కమ్మటి ఆరగింపు చేయించుకొన్నాడు. ఓ చెలులారా! అటు పిమ్మట శ్రీవేంకటేశ్వరుడు కొలువులో నిమగ్నమైనాడు మధ్యమధ్య మీరు స్వామిని మోహపరవశుని చేయండి.

★ **గొజ్జంగలు** – చేమంతులు ★ **తలకొని** – లగ్నముచేసి

సంఖ్య : 326 సంపుటము : 23 పుట: 213 రాగం : దేవగాంధారి

**13 కానీవోయి అందుకేమి కడపరాయ**
**కానవచ్చె నీపనులు కడపరాయా ॥పల్లవి॥**

**కప్పురమియ్యఁగదోయి కడపరాయ**
**కప్పవోయి పచ్చడము కడపరాయ**
**కప్పమివే మాచన్నులు కడపరాయ నీకు**
**కప్పులు మోవి నున్నవి కడపరాయ ॥కానీ॥**

**కాలు దాఁకించకు మంత కడపరాయ**
**గాలపుచూపులు మావి కడపరాయ**
**కాలమందె నీవారము కడపరాయ।మాలో**
**కైలాటాలు వెట్టకుమీ కడపరాయ ॥కానీ॥**

**కందులేనివలపుల కడపరాయ**
**గందము మామేన నిదే కడపరాయ**
**కందర్పజనక వోకడపరాయ**
**కందువ శ్రీవేంకటాద్రి కడపరాయా ॥కానీ॥ 326**

**భావ పరిమళం :**

ఓ కడపరాయా! కానివ్వవయ్యా, దానికేముంది? నీ పనులు తేటతెల్లమై అందరికీ తెలిసిపోయాయి. ఇప్పుడు దాచిపెట్టి లాభమేమున్నది? అంటున్నారు అన్నమయ్య. దేవుని గడపలో వెలసిన శ్రీవేంకటేశ్వరుడే కడపరాయుడని రాయలసీమవారు పిలుస్తారు. ఓ కడపరాయా! ఆమె నములుటకు కర్పూరపలుకులు ఇయ్యరాదా? ఆమెపై పట్టువస్త్రము కప్పవయ్యా! స్వామీ! ఆమెనీకిచ్చే కప్పమేమిటో తెలియునా ఆమె కుచములేనయ్యా నీ మోవి ఆమె మోవిని కప్పివేయుటకు సిద్ధముగానున్నది. ఓ కడపరాయా! అంతచేటు నీకాలు ఆమెకాలును తాకించుచున్నది. చిలిపి పనులు వలదు స్వామీ! కడపరాయా! మావంటి కాంతల గాలమువంటి చూపులు నీపై పడినవి. మేము ఎల్లకాలములందునూ నీవారమే. నీ వలపుకత్తెలమైన మాలో మాకే కలహాలుపెట్టకయ్యా! స్వామీ! ఓ కడపరాయా! మావి నిష్కళంకమైన వలపులయ్యా! స్వామీ! మా శరీరాలను గంధముతో నింపవయ్యా! ఓ కడపరాయా! నీవు మన్మథుని తండ్రివి. స్వామీ! నీవే నేర్పుగా తిరుమలలోనూ శ్రీవేంకటేశ్వరుడవై వెలసినావు.

★ **కైలాటాలు** – కలహములు ★ **కందులేని** – నిష్కళంకమైన
★ **కందువ** – నేర్పు ★ **కందర్పజనకుడు** – మన్మథుని తండ్రి





సంఖ్య : 252 సంపుటము : 23 పుట: 169 రాగం : సాళంగం

**14 గొల్లదాన నింతే నేను; కొంగువట్ట దొరకొనె**
**యెల్లవవారరుఁ జూడఁగాను యేమిసేతునే ॥పల్లవి॥**

**కన్నుల జంకించీని కైదండ వట్టీని**
**వున్నతపుకొనగోర నొత్తీని**
**చన్నులు చేతఁబట్టీని సరసములాడీని**
**యెన్ని చెప్పినా మానఁడు యేమిసేతునే ॥గొల్ల॥**

**తీగెనవ్వు నవ్వీని తెరలోనికి రమ్మనీ**
**బాగుగాఁ దానే కస్తూరి పైఁబూసీని**
**వేగిరించి వలపులు వెల్లవిరిగాఁ జేసీనీ**
**యీగతి వీనిగుణము లేమిసేతునే ॥గొల్ల॥**

**మొక్కలానఁ గాఁగిలించి మోవి గంటిచేసీని**
**చిక్కుదీసి శిరసుపై సేసవెట్టీని**
**గక్కున శ్రీవేంకటాద్రిఘనుఁ డిట్టె నన్నుఁ గూడె**
**యెక్కువగా మన్నించీ నేమిసేతునే ॥గొల్ల॥ 252**

**భావ పరిమళం :**

ఒక గొల్లెత తనతోటివారితో కృష్ణుడు తనతో చేసిన ఆగడం గురించి యేకరువు పెడుతున్నది. తాను ఒక గొల్లెతవలె అన్నమయ్య విని స్వాంతన కలిగించారు. నేనేమన్నా వానిని చేపట్టగల ఐశ్వర్యవంతురాలనా? నేను ఒక సామాన్య చల్లలమ్మే గొల్లదానను అంతే. ఆ కృష్ణయ్య నాకొంగుపట్టుకొని దొరకబుచ్చుకొన్నాడే. అదీ... అందరూ చూస్తుండగా. ఇప్పుడు నేనేమిసేతునే? ఎంతైనా దొరబిడ్డకదా! నేను కాదంటే కన్నులు పెద్దవిచేసి అదిలిస్తాడు. తన కొనగోటితో గిచ్చి మరీ నన్ను వారిస్తాడు గొడవచేయవద్దని. స్తనములపై చేతులు ఆనిస్తూ సరసాలాడతాడు. ఎంత బ్రతిమాలిచెప్పినా తన పద్ధతి మార్చుకోడు. సఖీ! నేనేమి చేసేదే? స్త్రీలను పరవశింపజేయటం వానికి వెన్నతో పెట్టిన విద్యయేమో, సన్నటి మందహాసంచేసి మరీ చాటుకు రమ్మని బలవంతంచేస్తాడు. కస్తూరిని నా ఒంటిపై మెత్తుతాడు. నన్ను తొందరపెట్టి ప్రేమించానంటాడు. ఈరకమైన వీడి గుణములు మంచివో కావో కూడా తెలియటం లేదు. చెలీ! ధైర్యంతో కౌగలించుకొని పెదవులపై గంట్లుపెడతాడు. చిక్కుదీసి దువ్వినట్లేచేసి నాతలపై తలంబ్రాలు పోశాడు. చటుక్కున శ్రీవేంకటేశ్వరునిగా మారిపోయి ఘనుడైన ఆ స్వామి నన్ను గొప్పగా మన్నించాడు మరి, నేనేమి సేతునే చెలీ!

★ **తీగెనవ్వు**–సన్ననితీగెవలె మందహాసము ★ **మొక్కలాన**–ధైర్యంతో ★ **జంకించి**–బెదరించి

సంఖ్య : 131 సంపుటము : 23 పుట: 88 రాగం : దేసాళం

**15** కొమ్మలు పదారువేలగోవిందరాజ
నిమ్మపంట వేతురా నీ వాఁటదానిని ॥పల్లవి॥

చేరి కొంగువట్టెనంటాఁ జెలులతోఁ జెప్పిచెప్పి
ఆరీతి నవ్వుదురా ఆఁటదానిని
కోరి చెమటదీసితే కొనగోరు దాఁకెనంటా
నేరము లెన్నుదురా నీవాఁటదానిని ॥కొమ్మ॥

సన్నలఁ జిక్కించెనంటా సాకిరులు వెట్టిపెట్టి
అన్నిటా దూరుదురా ఆఁటదానిని
చన్నులుసోఁకఁగ నీసరుసఁ గూచుండెనంటా
నిన్నటికి నేఁ దందురా నీవాఁటదానిని ॥కొమ్మ॥

జట్టిగొని కూడెనంటా సముకాన మెచ్చిమెచ్చి
అట్టె పొగడుదురా ఆఁటదానిని
వొట్టుక శ్రీవేంకటేశ వుర మెక్కించుకొంటివి
నెట్టన నింతసేతురా నీవాఁటదానిని ॥కొమ్మ॥ **131**

**భావ పరిమళం :**

అన్నమయ్య తిరుపతిలో వెలసిన గోవిందరాజస్వామిపై చెప్పిన చక్కటి శృంగార కీర్తననాస్వాదించండి. పదియారువేలమంది రాచకన్నెలను పరిణయమాడిన ఓ గోవిందరాజా! ఇవ్వాళ ఒక ఆడుదానిపై కోర్కెతో నిమ్మపండు ఆమెపై వేస్తావా? ఇదెక్కడి అల్లరి!! ఇప్పుడేమిచేస్తున్నావు, నీచెలులతో ఆ సంఘటనను కొంగుపట్టి మరీ చెబుతున్నావు. ఆడదానిని ఆవిధముగా నవ్వులపాలు చేయుదురా? నీమీద కోర్కెతో నీచెమటను ఒక చెలియ తన కొనగోటితో తుడిచిందని నీవు ఆడుదానిపై నేరములెన్నుతావా? ఒక ఆడుదానిని ఇవ్వాళ నిందిస్తున్నావు. దేనికో తెలుసా? నీవు సైగలు చేశావని ఒక సేవకురాలు అన్నదని కోపించినావు. నీ సరసన కూర్చొని స్తనములను తాకించినదని నేడు ఒక ఆడుదానిపై నిందిస్తావా? వశపరచుకొని నీతో కూడినదని ఒక ఆడుదానిని నిండుసభలో మెచ్చుకొంటారా? ఇదేమిపని స్వామీ! శ్రీవేంకటేశ్వరుడవై మరో ఆడుదానిని (శ్రీదేవిని) నీ ఉరముపై ఎక్కించుకొన్నావు. అందరి యెదుటా మరీ ఇలా చేస్తారా!!!

★ **సాకిరులు** – సేవలు ★ **జట్టిగొని** – వశముచేసికొని
★ **సముకాన** – సమక్షమున ★ **నెట్టున** – ఎట్టెదుట





సంఖ్య : 113 సంపుటము : 23 పుట: 76 రాగం : బౌళిరామక్రియ

**16** వనితలజాడలు వద్దంటే మానరు
చనవు నీవిచ్చినదే సరివచ్చెనా ॥పల్లవి॥

అంకెకువచ్చినదాఁకా నాడుదురు మాఁటలు
చంకకులోనైతేనే జంకింతురు
పొంకపుగొల్లెతలను భోగించి చూచితివి
సంకెదీర నామాట సరివచ్చెనా ॥వని॥

నమ్మికైనయందాఁకా నవ్వుదురు నెలవుల
సమ్మతించినందుమీఁద సాదింతురు
వుమ్మడిఁ బదారువేల నొడివట్టి చూచితివి
సమ్ముకానఁ జెప్పితిని సరివచ్చెనా ॥వని॥

దక్కినయందాఁకానే తమకించి పైకొందురు
చిక్కితేనే కొనగోరఁ జెనకుదురు
గుక్కక శ్రీవేంకటేశ కూడి నన్నుఁ జూవి (చి?) తివి
చక్కనినావిన్నపము సరివచ్చెనా ॥వని॥ **113**

**భావ పరిమళం :**

ఈ కీర్తనలో అన్నమయ్య పురుషులచిత్త ప్రవృత్తులెలావుంటయో వివరిస్తున్నారు. ఈ స్ఫూర్తితోనే కాబోలు తరువాత వచ్చిన మన పెద్దన కవి తన స్వారోచిషమనుసంభవంలో వనిత తనంత తావలచి వచ్చీన చుల్కనెకాదె యేరికిన్? అన్నాడు. ఏమి పురుషులయ్యా! వీరు. వనితల జాడలు (జాడ్యము) వదలలేరు, వద్దంటే మానరు. వనితల్లారా! చనవు నీవిచ్చినవెంటనే, నీపని సరియే సుమా! పురుషులు స్త్రీ తమ స్వాధీనమైన దాకా మాటలనాడుదురు, (మంచిమాటలు చెబుతారు). చంకలోకి వచ్చారంటే చీటికి మాటికి బెదిరిస్తుంటారు. నీవు మాత్రం తక్కువ తిన్నావా? అమాయకురాళ్ళైన గొల్లెతలను భోగించి వదిలేశావుకదా! నీశంక తీరిందా, నామాట సరివచ్చెనా (సరిపోయిందా లేదా.) ఈ మగవారున్నారు చూశారా, వీరు స్త్రీకి నమ్మకం కలిగే దాకా చిరునవ్వులొలికిస్తూ చెప్పినట్లు వింటారు. ఒక్కసారి స్త్రీ సమ్మతించిందంటే ప్రతిదానికీ సాధిస్తుంటారు. ఉమ్మడిగా పదియారువేల మందిని వశంచేసికొనినావు. స్వామీ! ఈ విషయంలో నీకుసాటి యెవరు? నీ సముఖముననే ఈమాట చెప్పగలను. పురుషులు స్త్రీ తమకు దక్కినదాక తమకంలో ముంచుతారు. ఒకసారిపైబడి చిక్కితే కొనగోటితో తీసిపారేస్తారు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు అన్నివిధాలా లొంగిపోయిన నన్ను చూశావుకదా! నామాటలు నిజంగా సరిపోయాయాలేదా?

★ **జాడలు** – జాడ్యము, జిడ్డు ★ **గుక్కక** – అనుమానించక

సంఖ్య : 489 సంపుటము : 23 పుట: 327 రాగం : గౌళ

**17** **చేకొని నీసేవలెల్లాఁ జేసేఁగాని**
**యీకడ నిట్టె నీవు మాయింటికి రావయ్యా** ॥పల్లవి॥

**గొల్లెతలు వలచిరి కోరినట్టె సేసితివి**
**చెల్లునయ్య నీచేసినచేఁతలెల్లాను**
**మెల్లనే నీవంటుకోఁగా మేమిఁకఁ గాదనేమా**
**ఇల్లిదివో వున్నది మాయింటికి రావయ్యా** ॥చేకొ॥

**పదియారువేలింతులపతివైతి వెమ్మె మించె**
**యెదురు లేదయ్య నీకు నేమిటాను**
**వుదుటునఁ జెనకఁగా వోపననేమా నేము**
**యెదిగెఁ జన్ను లిదె మాయింటికి రావయ్యా** ॥చేకొ॥

**పట్టపుదేవులు ద్దు పనులెల్లాఁ జక్కనాయ**
**తొట్టుకొంటివయ్య మేలు వొమ్ము నీకును**
**గుట్టున శ్రీవేంకటేశ కూడితి వేఁటికనేమా**
**యిట్టె నీపొరుగే మాయింటికి రావయ్యా** ॥చేకొ॥ **489**

**భావ పరిమళం :**

ఓ తిరుమలేశా! పూనుకొని నీసేవ చేయుటకు సిద్ధముగా వున్నాము. ఇప్పుడు నీవు మా ఇంటికి వేంచేయుము ప్రభూ! అంటున్నారు స్వామి వలపుకత్తెగా తపిస్తున్న అన్నమయ్య. స్వామీ! ఆనాడు కృష్ణుడవైన నిన్ను రేపల్లె గొల్లెతలంతా వలచారు. నీవు వారు కోరినట్లే చేసినావు. నీవు చేసిన చేతలన్నీ నీకే చెల్లినవి. లోపలున్న గదులలో మెల్లిగా నీవు మమ్మల్ని తాకితే మేము కాదంటామా అనివారు వేడుకొన్నారు. ఇదిగిదిగో ఇక్కడే మాఇల్లు వుంది నీవు రావోయీ అని వారంతా వేడుకొన్నారు. స్వామీ! అదే శ్రీకృష్ణావతారంలో పదియారువేలమంది రాచకన్నెలకు పతివైనావు. మించిన విలాసముతో వున్న నీకు ఎందులోనూ తిరుగులేదాయెనయ్యా! అతిశయించి నీవు మమ్ము తాకితే మేము సహించమని అంటామా? స్వామీ! నిన్ను చూచి మా వక్షోజములుప్పొంగినవి, ఇకనైనా మా ఇంటికి రావయ్యా! ఓ శ్రీవేంకటేశ్వరా! నీపట్టపుదేవి అలమేల్మంగ నీకు పురమాయించిన పనులన్నీ చక్కబడ్డాయి. నీకు మేలుకలుగుగాక! నన్ను స్పృశించవయ్యా! ఓ ప్రభూ! నీవు కూడితే ఎందుకు అని అంటామా? ఇదిగో నీపొరుగుననే మా ఇల్లువున్నది కదా! త్వరగా మా ఇంటికి రావయ్యా!

★ **తొట్టుకొంటివి** – స్పృశించితివి ★ **ఉదటున** – ఉద్ధతితో





సంఖ్య : 347 సంపుటము : 23 పుట: 232 రాగం : శ్రీరాగం

**18** **ఇంతి చెలువం బెంచ నితరులకు వసమౌనా**
**ఇంతయునుఁ దలపోసి యెరిఁగించవలదా** ॥పల్లవి॥

**చిగురైనమోవిపై చిలుకవోట్లు నిండె**
**తగుఁ గోవిలకుఁగాక తనకేల**
**మొగమైనతామరకు మొగి విచారము లేదు**
**తగవు లివి యేర్పరచి తా దిద్దవలదా** ॥ఇంతి॥

**వలుదజక్కవచన్నుల వంకలచంద్రులు వొడమె**
**జలధందుఁ గాక ఇచ్చట నమరునా**
**కలికిమేనైనతీగకు విచారము లేదు**
**తలకొన్న యీతగవు తా దిద్దవలదా** ॥ఇంతి॥

**మఱి గజకరపుఁదొడల నఱిదిఁ బగడపులతలు**
**అఱెంట్లందము గాక అందుకేలా**
**యెఱిఁగి శ్రీవేంకటేశు కీవిచారము లేదు**
**తఱిఁగూడీ నీతగవు తా దిద్దవలదా** ॥ఇంతి॥ **347**

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో దేవి సోయగాలను చమత్కారంగా వర్ణిస్తున్నారు. ఆస్వాదించండి. ఈ ఇంతి సోయగము నెంచ ఇతరులకు సాధ్యమవుతుందా? ఇదంతా ఆలోచించి స్వామికి యెరిగించవలదా? అని చెలికత్తెలు ఆలోచిస్తున్నారు. ఈ జవ్వని మోవి (అధరము) పైచిలుకగాట్లు కనబడుచున్నవి. కోకిలలు కంగారుపడుతున్నాయి. తనకు ఈ విషయం పట్టదా? ఈమె ముఖము తమకన్నా అందమైన పద్మములావున్నదని తామరపూవులు తత్తరపడుతున్నాయి. మరి ఈ తగవు దిద్దే బాధ్యత స్వామిపైననే వున్నది. ఈమె స్తనములు జక్కువపిట్టల జంటవలెనున్నవి. అంతటి సొంపైన చనుగవపై చంద్రవంక గుర్తులు స్వామిపనికాక మరేమి? జలధిలో వుండాల్సిన చంద్రరేఖను దేవి కుచములపైచూచి కలికిమేను లతవలె వున్నదని లత విచారపడుతున్నది. ఇప్పుడీ చంద్రవంక, లతల తగవు శ్రీనివాసుడే సర్దుబాటు చేయాలి. ఆ భామిని వూరువులు గజకరములవలె బలిష్టమైనవి. కాళ్ళు పగడపుతీగెలవలెనున్నవి. ఆ రెండిటి అందముగాక మరొక అందముంటుందా? ఈ శ్రీవేంకటేశ్వరునికే విచారము లేదు. మరి ఈ తగవులన్నీ తానే పరిష్కరించాలి కదా!

★ **కోవిలకు** – కోయిలకు ★ **గజకరము** – ఏనుగు తొండము

సంఖ్య : 183 సంపుటము : 23 పుట: 123 రాగం : దేవగాంధారి

**19 కొలఁదులుమీరినగోవిందా**
**పలుదెఱగుల మతి పరగీఁజుమీ్మ** ॥పల్లవి॥

**యేలితి వప్పుడే యిల్లాండ్లఁగా**
**గోలతనముగలగొల్లెతల**
**ఆలఁ గాచితివి ఆఁబోతువలెనే**
**పాలించ మనసు పారీఁజుమీ్మ** ॥కొలఁ॥

**పెట్టితి సేసలు పెండ్లికూఁతులఁగా**
**వొట్టి యచ్చరల కొకమాటే**
**చుట్టితి పెంచముసోగ నెమలివలె**
**పెట్టనెమళ్ళను బెరిసేవుసుమీ్మ** ॥కొలఁ॥

**కలసితివి శ్రీవేంకటేశ మమ్మిటు**
**లలిఁ బట్టపుసతుల మనుచును**
**యెలమి యమునలో నీఁదులాడితివి**
**పొలసి యాఁడుమీలఁ బొందేవుసుమీ్మ** ॥కొలఁ॥ **183**

**భావ పరిమళం :**

ఈ శ్రీకృష్ణ గీతికలో అన్నమయ్య వింత విన్నపం స్వామికి చేస్తూ సావధానుడవైయుండమని హెచ్చరిక చేస్తున్నారు. హద్దులు మీరిన గోవిందుడా! నరులమనస్సు పరిపరి విధముల వశము తప్పుతుంది. జాగ్రత్త సుమీ్మ! చిరుయౌవనమునాడే గొల్లెతలందరితో మగనివలె యేలితివి. పాపం వారి గోలతనము (బేలతనము) అవకాశంగా తీసికొని, ఆవులు గాచిన నువ్వు వారిపట్ల ఆబోతువైనావు. మరి అవకాశం దొరికితే మనస్సు పరుగులు పెట్టదా ప్రభూ! అప్సరసలుకూడా నీతో ఒక్కసారి రమిస్తే బ్రతుకులు ధన్యమని రేపల్లె గొల్లెతలై జన్మించారు. దేవాంగనలను పెండ్లికూతుళ్ళుగా చేసికొని వారి కోరిక దీర్చి పెళ్ళితలంబ్రాలు వారి శిరసుపై పోసినావు. సొగసైన నెమలివలె పింఛము ధరించెడివాడవు. ఆడు 'నెమళ్ళు' ఆకరించబడితే వదలనే వదలవు. జాగ్రత్త సుమీ్మ! నేడు శ్రీవేంకటేశ్వరుడవై భక్తిగల వనితలనందరినీ యేలితివి. మమ్మల్నే కదా! ఆనాడు యమునలో నీపట్టపురాణులమని ఈదులాడుతూ మురిపించినావు. ఈ మాటవిని ఆడుచేపలన్నీ ఆశపడి వెంటబడితే యేమయేది స్వామీ? జాగ్రత్తసుమా!

★ **బెరిసేవు** – పొందేవు ★ **కొలదులుమీరిన** – హద్దులు మీరిన

సంఖ్య : 69 సంపుటము : 23 పుట: 47 రాగం : భైరవి

**20** **వెన్న వట్టుకొని నేయి వెదకనేల**
**కన్నప్పుడే రమణునిఁ గాఁగిలించుకొనవే** ॥పల్లవి॥

**మంతనము లాడియాడి మరి యెడమాటలేల**
**చెంత నొక్కటైనమీఁద సిగ్గులేలా**
**సంతోసమైనవెనక సారె విచారములేల**
**కాంతరో విభుని మెచ్చి కాఁగిలించుకొనవే** ॥వెన్న॥

**కన్నులఁ జూచి పతి చకఁ (చక్కఁ?) దనా లడుగనేల**
**ఇన్నియు నేరిచి బయలీఁదనేల**
**మన్ననలు చేకొని మఱఁగున దాఁగనేల**
**కన్నెవైతేనే మితనిఁ గాఁగిలించుకొనవే** ॥వెన్న॥

**ననుపు లొనగూడితే మనసు సోదించనేల**
**తనిసి యాసాసలు దప్పఁగనేల**
**యెనసె శ్రీవేంకటేశుఁ డింతలొనె నిన్ను మెచ్చి**
**ఘనుఁ డీతని నేపొద్దూ గాఁగిలించుకొనవే** ॥వెన్న॥ **69**

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధుర కీర్తనలో తాను నాయిక చెలికత్తెయై దేవికి నచ్చజెబుతున్నారు. ఓ దేవీ! వెన్న చేతిలోవుండగా యెవరన్నా నేయి యెక్కడ దొరుకుతుందా అని వెదుకుతారా? నీ రమణుని కాంచిన వెంటనే కౌగలించాలి కాని మీనమేషాలు లెక్కిస్తే ఎట్లాగమ్మా? దేవీ! నీసలహాదారులతో తెగ మంతనములాడి, ఇప్పుడీ పెడసరం మాటలు దేనికమ్మా? స్వామినీచెంత చేరినాక ఏకాంత సేవలో సిగ్గులేలనమ్మా? సంతసించవలసిన అవసరమున విచారములెందుకమ్మా? నీవంటే ఇంత మక్కువగల నీకాంతుని మెచ్చుకుంటూ కౌగలించవమ్మా! దేవీ! నీ కనులయెదుట కనబడుతున్నవానిని చూస్తూ కూడా నీవిభుడు యెంత చక్కనివాడని నన్నడుగుతావేమమ్మా? ఇన్ని నా సలహాలు విన్నాక కూడ వ్యర్థమైన ఆశలు మానవేమమ్మా? స్వామి నీపై ఇంత మన్నన చూపిస్తుంటే నీవు చాటు మాటున వుండనేలనమ్మా? నీవు కన్నెపిల్లవనే సంకోచమువదలివైచి స్వామిని కౌగలించవమ్మా! దేవీ! నీ మనస్సులో ఆయనపై అనురాగం అతిశయిస్తుంటే ఆయన అనుమానంతో సోధించేవేలనమ్మా? తృప్తి పొందిన వెనుక గూడా అధికముగా ఆశపడతావేమమ్మా! శ్రీవేంకటేశుడంతటి దేవదేవుడు నిన్ను మెచ్చుకొన్నాడు. ఘనుడైన స్వామిని యేపొద్దునైనా గుచ్చికౌగలించాలికానీ, దిక్కులు చూస్తారుటమ్మా?

★ **బయలీదనేల** – వ్యర్థమైన ఆశకు ఏల తావిచ్చెదవు ★ **తనిసి** – తృప్తిపడి
★ **ఆసాసలు** – అధికమైన ఆశలు





సంఖ్య : 92 సంపుటము : 23 పుట: 62 రాగం : రామక్రియ

**21** **ఏడనుండి వచ్చినాఁడే యీడకుఁ దాను**
**వీడెమిచ్చీఁ జూడవే వేసాలవాఁడు** ॥పల్లవి॥

**వెలలేనివలపులవేడుకకాఁడు**
**కలికితనాలమంచిగయ్యాళివాఁడు**
**చలమరిసరసాలజాజరకాఁడు**
**చెలువుఁడు వీఁడుగదె శ్రీవేంకటేశుఁడు** ॥ఏడ॥

**కొనబుతనాలతోడికోడెకాఁడు**
**నినుపునవ్వులునవ్వేనీటులవాఁడు**
**వొనరినవరముల వుదారికాఁడు**
**చెనకులవాఁడుగదే శ్రీవేంకటేశుఁడు** ॥ఏడ॥

**గొల్లెతలమానములకొల్లకాఁడు**
**పిల్లదొరులూఁదేటిపిన్నవాఁడు**
**యెల్లగా నలమేల్మంగనేలినవాఁడు**
**చెల్లుబడి వీఁ(వా?)డుగదె శ్రీవేంకటేశుఁడు** ॥ఏడ॥ **92**

**భావ పరిమళం :**

శ్రీవేంకటేశ్వరునిపై శృంగారగీతిక వినిపిస్తున్నారు అన్నమయ్య. తనవిదీరా ఆస్వాదించండి. చెలికత్తెలు ఒకరితో ఇంకొకరు చెప్పుకొంటున్నారు. తాను యెక్కడనుండి ఇక్కడకు వచ్చినాడే? ఈ వేషాలమారివాడు నిజంగా మన దేవిని వలచినాడా లేక దొంగవేషాలు వేస్తున్నాడా? కాస్త ఇతనికి తాంబూలమిచ్చి ఆహ్వానించండి. ఏమవుతుందో చూద్దాము. ఏ వెలకూ తులతూగని వలపులవేడుకకాడు వీడేనేమో? నేర్పరితనములో మంచి దిట్టవలెనున్నాడు. సరసముగా వసంతోత్సవాలలోకూడా వీడు గొప్ప పట్టుదలకలవానిలా అనిపిస్తున్నాడు. ఇతనే శ్రీవేంకటేశ్వరుడట. వీడు సొగసరివాడుకదే! ఈ కోడెగానికి విలాసము వెన్నతో పెట్టిన విద్య? ఈ నీటుగాక, నిండుగా చిరునవ్వులొలికించువాడు. ఒనగూడెడి వరములీయుటలో ఈయన బహు ఉదారవంతుడు. ఈ శ్రీవేంకటేశ్వరుడు విపరీతంగా నొక్కులు నొక్కుతాడు. ఈ మహానుభావుడే తన శ్రీకృష్ణావతారములో రేపల్లెలోని గొల్లభామల మానములు దోచుకొన్న కొల్లగాడు. ఈ పిల్లగాడు మురళి వాయించడంలో దిట్ట. దేవి అలమేల్మంగను యేలుకొనే పెనిమిటియైన ఈ శ్రీవేంకటేశ్వరుడు గొప్ప చెల్లుబడిగలవాడు.

★ **కొనబుతనం**–విలాసము ★ **నినుపు**–నిండు ★ **ఉదారికాడు**–ఉదారవంతుడు
★ **ఒనరిన**–ఒనగూడెడి ★ **పిల్లదొరులు**–మురళి ★ **కలికితనము**–నేర్పరితనము

సంఖ్య : 108 సంపుటము : 10 పుట: 62 రాగం : దేసాళం

**22 ఏమి మందు గద్దె యింతులాల ।యీ।**
**రామకుఁ దిరుపతి రాముఁడే మందు** ॥**పల్లవి**॥

**వెలసెటివిరహాన వేఁగెటియింతికి**
**చెలియలాల యేమి సేతమే**
**చలివేఁడివలపుల చవి గన్న యీపెకు**
**నలపించిన తనవరుఁడే మందు** ॥**ఏమి**॥

**పొదిగొన్న తమకానఁ బొరలెటి కాంతకు**
**చెదరక మన మేమి సేతమే**
**వుదుటుఁ గోరికల నొనరెటి యీపెకు**
**మదిలోపలి తనమగఁడే మందు** ॥**ఏమి**॥

**పొల్లవోని యాసఁ బొరలెటి మగువకు**
**చెల్లఁ బో మన మేమి సేతమే**
**కొల్లగా రతి నింతిఁ గూడినాఁ డీపెకు**
**నల్లని శ్రీవేంకనాథుఁడే మందు.** ॥**ఏమి**॥ **108**

**భావ పరిమళం :**

తాళ్ళపాక చినతిరుమలయ్య చెప్పిన శృంగార కీర్తననాస్వాదించండి. ఈ దేవి తిరుపతి రాముని (కోదండరాముడు) పట్టమహిషి జానకీ దేవి. పతి యేవో రాచకార్యాలపై తిరుగుతుంటే ఈమె విరహంలో వేగిపోతున్నది. చెలికత్తెలకు యేమి చేయాలో తోచటం లేదు. వాళ్ళిలా అనుకుంటున్నారు. ఓ ఇంతులారా! ఈ జవ్వనికి ఏమి మందు కలదే? ఈమెకు తిరుపతి రాముడే మందు అని భావిస్తాము. ఓ ఇంతులారా! బయల్పడిన విరహమున వేగిపోవుచున్న ఈ తరుణికి యేమి చేయుదుమే? సుఖదుఃఖములను రెంటినీ అనుభవించిన వలపులను రుచి చూచిన ఈమెకు తనని రతిలో అలిసిపోవునట్లు చేయగల తన పతియే మందు. అతిశయించిన తన్మయత్వము ముప్పిరిగొన్న ఈ ఇంతికి యేమిచేయుదమే? పెల్లుబికిన కోర్కెలతో ఒప్పేటి ఈమెకు, మదిలోపల నిలిచిన తన మగడే మంచి మందు. చెడిపోని తన ఆశలలో తేలియాడే ఈ మగువకు హతవిధీ! మనమంతా ఇప్పుడేమి సేయగలమే? సమృద్ధముగా రతులలో తేల్చి ఈ ఇంతిని గూడుటకు తిరుమల వేంకటనాథుడే దివ్యమైన మందు.

★ **చలివేడివలపులు** – సుఖదుఃఖములనిచ్చు ప్రేమలు ★ **రామ** – స్త్రీ
★ **పొల్లవోని** – చెడిపోని ★ **ఉదుట** – విజృంభించిన





సంఖ్య : 87 సంపుటము : 10 పుట: 50 రాగం : హిందోళం

**23 పాలు దాగె వెన్న దినె బానల పెరుగు జుట్టె**
**సోలి కాఁగులనేతులు చూరలాడె నమ్మా** ॥**పల్లవి**॥

**చిన్నవాని ఆరడి సేసినట్లు వుండుఁగాని**
**యెన్నెన్నిపోకిళ్లఁ బొయ్యీ యీకృష్ణుఁడు**
**కన్నెలు ముద్దాడఁ బోతే గంటి సేసి మోవు లెల్ల**
**తన్నుఁ గానట్టున్నాఁడు దయ్యపువాఁడమ్మా** ॥**పాలు**॥

**తగినపసిబిడ్డనిఁ దతిగొన్న ట్టుండుఁ గాని**
**యెగసక్కె లెన్ని నేర్చె యీగోవిందుఁడు**
**మగువ లెత్తుకొంటేను మరి గోళ్లువెట్టి తానె**
**తగవులు చెప్పెఁ గతలకారోయమ్మా** ॥**పాలు**॥

**పలుదూరులు బాలునిపైఁ జెప్పిన ట్టుండుఁ గాని**
**కలికివాఁడమ్మ శ్రీవెంకటనాథుఁడు**
**చెలులు కాఁగిలించితే సిగ్గు వీడఁ గూడి కూడి**
**వలపించినాఁడు యెటువంటివా డోయమ్మా.** ॥**పాలు**॥ **87**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య పాడిన శ్రీకృష్ణామృతం ఆస్వాదిద్దాం. ఈ చిన్నారి కృష్ణయ్య అల్లరినేమని చెప్పుదుమమ్మా! వీడు తాగినన్ని పాలు తాగి, తిన్నంత వెన్న తిని, జుట్టవలసిన పెరుగంతా జుట్టి, మేము కాగులలో కాచి దాచుకొన్న నెయ్యినంతా వ్యర్థపరచినాడే వోయమ్మా! మేమంతా కావాలని చిన్నపిల్లవాడిని అల్లరి పెట్టినట్లుంటుంది కానీ ఈ కృష్ణుడు యెన్నెన్ని పోకిళ్ళు పోతాడమ్మా! కన్నెపిల్లలు వీడు ముద్దొస్తున్నాడని ముద్దుపెట్టుకొనబోతే మా అధరములపై గాట్లుపెడతాడమ్మా! ఇప్పుడు చూడండి మాట్లాడుతున్నది తనగురించికానట్లు యెలావున్నాడో! ఒట్టి దయ్యపు పిల్లవాడమ్మా!! ఓయమ్మా! మేము చిన్నవాడిపై అధికముగా చెప్పినట్లుంటుంది గాని ఈ గోవిందుడు యెన్ని యెకసక్కెములు నేర్చినాడో తెలియునా? చిన్నపిల్లవాడని స్త్రీలు మురిపెంగా యెత్తుకుంటే తన గోళ్ళతో గిచ్చి యేవేవో కథలు చెప్పి తగవులు పెడతాడమ్మా! మేము బాలునిపై నిందవేసినట్లుంటుంది కాని, ఈ శ్రీవేంకటేశ్వరుడు మిక్కిలి నేర్పరియమ్మా! చెలులు తనను కౌగలించుకొంటే సిగ్గు వీడునట్లు కూడి వలపించుకొంటాడు. ఎటువంటివాడే, వోయమ్మా!

★ **చూరలాడే** – వ్యరం చేసినాడే ★ **ఎగసక్కెము** – పరిహాసము

సంఖ్య : 80 సంపుటము : 10 పుట: 46 రాగం : మాళవిగౌళ

**24** **బెల్లపుమాఁటల చెల్లపిళ్లరాయఁడా ।నీకుఁ।**
**జెల్లునయ్య యేమైన చెల్లపిళ్లరాయఁడా** ॥పల్లవి॥

**పేలరిమాఁట లాడేవు పెద్దతనమా యిది**
**పీలిచుంగుతోడి చెల్లపిళ్లరాయఁడా**
**కాలు దాఁకించినప్పుడె కళలంటె నిఁక నేల**
**చేలకొంగు వట్టేవు చెల్లపిళ్లరాయఁడా** ॥బెల్లపు॥

**యీతల నాకుఁ బరచే వింతటిదొరవు నీ**
**పీతాంబరము చెల్లపిళ్లరాయఁడా**
**ఘాతల నీగోరు దాఁకి కరఁగితి నిఁక నే నీ**
**చేతిలోని దాన నింతె చెల్లపిళ్లరాయఁడా** ॥బెల్లపు॥

**నెట్టన దేవరవంటి నీమేనిసొమ్ము నాకుఁ**
**బెట్టేవుగా చెల్లపిళ్లరాయఁడా**
**గట్టిగా నన్ను శ్రీవెంకటనాథుఁడవై కూడి**
**చిట్టకాలు సేసేవు చెల్లపిళ్లరాయఁడా.** ॥చెల్లపు॥ **80**

**భావ పరిమళం :**

కడప జిల్లా నందలూరి గ్రామంలో వెలసిన సౌమ్యనాథస్వామిని చెల్లపిళ్ళరాయుడని జానపదులు వ్యవహరిస్తారు. చినతిరుమలాచార్యులవారు కూడా చెల్లపిళ్ళ రాయుడనే కీర్తిస్తున్నారు. చెల్లపిళ్ళ అంటే ముద్దు బిడ్డడు అని అర్థం. ఓ చెల్లపిళ్ళ రాయుడా! బెల్లము వలె తీయనైన మాటలవాడివి. అవి యెటువంటివైనను చెల్లుబడి చేయించుకోగల దిట్టవు నీవు. ఓ చెల్లపిళ్ళరాయడా! వట్టి వదరుబోత మాటలు అంటావు. ఇది పెద్దమనిషి పనికాదు స్వామీ! నెమలి పింఛమునలంకరించుకొన్న అందగాడివి. కాలు తొక్కించి పెళ్ళాడినప్పుడే నీకు అన్ని కళలు వచ్చినవి. ఇప్పుడు చీరెకొంగు వదలమన్నా వదలవు. పీతాంబర ధారివైన చెల్లపిళ్ళరాయడా! ఇంటి దొరవు కదా! ఈ విధంగా నాకు వ్యభిచారదోషం అంటగడుతున్నావు. చురుక్కుమనే నీ గోటి తాకిళ్ళకు ఇక నేను కరిగిపోయాను స్వామీ! ఇక అంతే, నీ చేతిలోని దాననై పోయానయ్యా! ఓ చెల్లపిళ్ళరాయడా! మా యెదుటనే వున్న దేవుడవు నీ ఒంటిపైనున్న ఆభరణాలు నాకు పెట్టెదనంటావేమయ్యా! నీవే శ్రీవేంకటనాథుడవై నన్ను గట్టిగా కూడితివి. శృంగారచేష్టలు చేస్తావయ్యా! చెల్లపిళ్ళరాయుడా!

★ **పేలరి** – వదరుబోతు ★ **ఘాతలు** – దెబ్బలు ★ **చిట్టకాలు** – శృంగార చేష్టలు





సంఖ్య : 71 సంపుటము : 10 పుట: 41 రాగం : రామక్రియ

**25** **కాంతాళిం చాడినమాఁట గాదు సుమ్మీ వో విభుఁడ**
**దొంతిమాయలఁ జిక్కఁగ దొరలకుఁ జెల్లునా** ॥పల్లవి॥

**వేడుకతో నీ వాపె వెంట వెంటఁ దిరుగఁగా**
**చీడెలలో నెల్ల నాకు సిగ్గాయరా**
**యీడు లేని వలపు ని న్నెరఁగని దింతే కాక**
**తోడనె యీ పను లెల్ల దొరలకుఁ జెల్లునా** ॥కాంతా॥

**వొయ్యనె నీ వాపెకు వూడిగాలు సేయఁగాను**
**నెయ్యపు నా కపు డెంత నెగు లాయరా**
**గయ్యాళితమి నీకు కన్నులఁ గప్పెఁ గాక**
**తొయ్యలికి నింత లోఁగ దొరలకుఁ జెల్లునా** ॥కాంతా॥

**ఆసపడి నీ వాపెకు అట్టె కొలువు సేయఁగా**
**యీసున నాకునుఁ గోప మెంత వచ్చెరా**
**కోసువానిపల్లెలోనఁ గూడి శ్రీవేంకటనాథ**
**తోసిపోవైతివి యింత దొరలకుఁ జెల్లునా.** ॥కాంతా॥ **71**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య, కోసువానిపల్లెలో వెలసిన వేంకటేశ్వరునిపై చెప్పిన ఈ కీర్తనలో నాయిక స్వామితో అనునయంగా నచ్చజెబుతున్నది. కాంతాళించి అంటే కోపము ఈర్ష్యలతో వశురాలై అని అర్థం. ఓ విభుడా! ఇవి నేను కోపముతోనాడిన మాటలు గావు. నీవు దొరవు. ఇట్లు అధికమైన మాయల జిక్కి హద్దులు మీరుట దొరలకు చెల్లునా స్వామీ! నేను చెప్పేది వినుము ప్రభూ! స్వామీ! నీవు వేడుకతో ఆ పడతి వెంట వెంట తిరిగితే నా చెలియలముందు నాకెంత తలవంపులుగా వుంటుంది. మీ ఇరువురికి యీడూజోడూ కుదురుతుందా. అట్లా కుదరని వలపుయెంత యెబ్బెట్టుగా వుంటుంది? దానికి తోడు ఇటువంటి పనులు దొరలకు చెల్లునా, స్వామీ! ప్రభూ! నీవు సుతారముగా ఆమెకు ఊడిగాలు చేస్తుంటే నా శోభ యెంత దెబ్బతింటుందో ఆలోచించు. ఆ గయ్యాళి దానిపై నీకున్న భ్రమ నీ కన్నులను కప్పేసిందేమో? అంతకాక ఒక ఆడుదానికి ఇంత లొంగిపోవటం దొరలకు చల్లునా స్వామీ! నేనింత నచ్చజెప్పినా, నీవామెపై ఆశపడి నీ కొలువుకు పిలిచావు. ఈర్ష్యతో నీపై కోపము నాకెంతవుంటుందో ఆలోచించు. కోసువాని పల్లెలో ఈ ఇంతితో కూడినాడేమో ఈ శ్రీవేంకటేశుడు అనుకున్నా, ఈ విషయం ఇంతటితో తోసిపోవైతివి. దొరలకు ఇది చెల్లునా ప్రభూ! ఆలోచించు.

★ **తొయ్యలి** – స్త్రీ ★ **ఈడులేనివలపు** – వయస్సు సరితూగని ప్రేమ

సంఖ్య : 107 సంపుటము : 10 పుట: 62 రాగం : మాళవగౌళ

**26 నీవెక్కుడో ఆపె నీకంటె నెక్కుడో**
**రావయ్య తిరుపతి రఘురామచంద్ర** ॥పల్లవి॥

**తుమురుగ దనుజులఁ దోలి తొప్పర లాడి**
**అమరఁగ గెలిచితి నందుపు (వు?)**
**మమతతోడుత నిన్ను మదనయుద్ధమునందు**
**రమణి నిన్ను గెలిచె రఘురామచంద్ర** ॥నీవె॥

**తవిలి శివుఁడు కాశిఁ దారకబ్రహ్మ మని**
**యీవల నిన్నుపదేశ మియ్యఁగా**
**నవమై శ్రీవెంకటనాథ మరుతంత్రము**
**రవళి నీ కీపె యిచ్చె రఘురామచంద్రా.** ॥నీవె॥ **107**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య తిరుపతిలో నెలకొన్న రఘురామచంద్రునికి తన తాత అన్నమయ్య శైలిలో శృంగార కీర్తన వినిపిస్తున్నారు. మన్మథుని జనకుడైన శ్రీవేంకటేశ్వరుడి వద్ద మదన తంత్రములలో అనాదిగా శిక్షణబొంది నేడు సీతమ్మయై నీకీమె యిచ్చినదేమో, ఆ కిటుకులు అని చలోక్తి విసురుతున్నారు. తాతగారివలె సరసుడే. ఈ శృంగార కీర్తననిప్పుడు ఆస్వాదించి తాళ్ళపాక వారి సేవలను స్మరించండి. ప్రభూ! నీవెక్కువైనవాడవో లేక ఆమెయే యెక్కువైనదో తేల్చుకొందువుగాని ఇక్కడకు రావయ్యా తిరుపతి రఘురామచంద్రా! ఓ రఘురామచంద్రా! దానవులను నుగ్గునుగ్గు చేసి తీవ్రమైన క్షోభకు గురిచేసినావు. అన్నీ అమరినందువల్ల గెలిచితి నంటివి. బాగు, బాగు. కానీ అనురాగంతో రక్తపాతమేమీ లేక మదన యుద్ధములో ఈ రమణి నిన్ను గెలిచినది కదయ్యా! రఘురామచంద్రా! శంకరుడు కృతనిశ్చయుడై కాశీనగరములో తారకమంత్రము వుపదేశించి జీవులకు ముక్తిని ప్రసాదిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. అది నిజమే కానీ ఓ శ్రీవేంకటనాథా! అనాది కాలంలోనే ఆమె నీ తరుణి అయినప్పుడు ఈ మదన తంత్రములు నేర్చి నేడు నీకిచ్చినదేమోనయ్యా! తిరుపతి రఘురామచంద్రా!

★ **తుమురుగ** – పొడిగ ★ **తొప్పరలాడు** – క్షోభపడు
★ **మదనయుద్ధమున** – రతికేళిలో ★ **తవిలి** – కృతనిశ్చయుడై
★ **మరుతంత్రము** – మన్మథతంత్రము ★ **రవళి** – శబ్దము





సంఖ్య : 81 సంపుటము : 10 పుట: 46 రాగం : కన్నడ బంగాళం

**27 బాలుఁడు సేసెటి పనులా**
**వోల వేయవచ్చీ నోయమ్మా** ॥పల్లవి॥

**చన్నులపైఁ జెయి చాఁచీనే యివి**
**చిన్నవాండ్ల చేఁతలా**
**కన్నులు గిరిపీ గామి డై**
**వున్నాఁ డిప్పుడు వోయమ్మా** ॥బాలుఁడు॥

**పస నీమోవిపైఁ బల్లు సోఁకించీ**
**పసిబిడ్డలబాగులా**
**కొసరుమాఁటల గో రంటి విడె**
**మొసఁగీ నిప్పుడె కో (వో?) యమ్మా** ॥బాలుఁడు॥

**నిండారఁ గాఁగిట నించీనే యివి**
**కొండుకబిడ్డలగుణములా**
**వెండిఁ బైఁడి నిచ్చి శ్రీవెంకటనాథుఁడు**
**వుండుండి నను గూడెనోయమ్మా.** ॥బాలుఁడు॥

**భావ పరిమళం :**

శృంగార కీర్తనలను ఇంత మధురంగా తేలిక భాషలో చెప్పటం చినతిరుమలయ్య ప్రత్యేకత. గోపికలు యశోద దగ్గర పితూరీ చేస్తున్నారు. ఓయమ్మా! యివి బాలుడు సేసేటి పనులటమ్మా. మేము యమునలో స్నానం చేస్తుంటే జలకాలాడుదాము రమ్మని బలవంతం చేస్తున్నాడు. ఇవి చిన్నపిల్లల చేష్టలా! పోనీ జలక్రీడలాడి సరిపెట్టుకోడు, యేదో నెపంతో మా కుచములపై చేతులు వేస్తాడు. ఇవి చిన్నవాళ్ళ పనులా? వీడు గయ్యాళితనముతో మమ్మల్ని చూచి కన్నుగీటుతాడమ్మా! ఇదిగో ఇప్పుడు నీ యెదుటనేవున్నాడు ఏమిచేస్తావో చేయవమ్మా! ఓ యశోదమ్మా! వీడు యెంత సామర్థ్యం గలవాడో మా మోవిపై వీడు చేసిన దంతక్షతములే కథనంతా చెబుతాయి. పసిబిడ్డలకీ పనులు బాగుంటాయా నీవే చెప్పు. తన వాంఛ తెలిపేటట్టుల మాట్లాడుతూ గోళ్ళు తాకించి మరీ మాకు తాంబూలమునిస్తాడు. ఇప్పుడే ఈ పనులు మొదలుపెట్టాడేవోయమ్మా! ఓ యశోదమ్మా! నీ చిన్న బిడ్డడు మాకు బిగి కౌగిలినిస్తాడమ్మా! ఇవేమిగుణాలమ్మా? పోనీ శ్రీవేంకటేనాథుడైన తన గుణము మానలేదు. కావలసినంత వెండి బంగారం ఇస్తానని నన్నూ కూడినాడేవోయమ్మా!

★ **ఓలవేయవచ్చీ** – జలకాలాడెదమనివస్తాడు ★ **పస** – సామర్థ్యం
★ **కొసరుమాటలు** – వాంఛతెలిపే ★ **కొండుకబిడ్డలు** – చిన్నబిడ్డలు

సంఖ్య : 69    సంపుటము : 10   పుట: 40    రాగం : వరాళి

**28** మాటకు మాఁటె యాడి మంచితనము సేయక
నీటున సరసమాడ నేఁడు నాకుఁ జెల్లునా ॥పల్లవి॥

ఘనుఁడవంటా నీకుఁ గానుక చేతి కిచ్చితే
యెనసి నీ వాపెచేతి కియ్యఁ దగునా
ననిచి నీనేరమా నానేర మింతే కాక
నిను దొర వని నమ్మి నేస్తము సేసినది ॥మాటకు॥

కాంతుఁడ వనుచు నావుంగరము వేలఁ బెట్టితే
అంతలో నాపె కిచ్చితి వది దగునా
అంతయు నీకడమలా అది నాకడమ గాక
వింత లేనిపొందు నీతో వేడుకఁ జేసినది ॥మాటకు॥

హితవరి వని నీతో నేకతము చెప్పితేను
అతివతోఁ జెప్పితివి అవురా నీవు
కతకారి శ్రీవెంకటనాథ నన్నుఁ గూడి
బతిమివట్టు కుండఁగా బా సదుగఁ జెల్లునా ॥మాటకు॥ **69**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య నివేదించిన ఈ సరసకీర్తనలో నాయిక యేమంటున్నదో వినండి. స్వామీ! నేడు నాకు, నీ మాటకు మాట బదులిచ్చి మంచి తనముగాలికి వదిలేసి నీటుతనముతో సరసమాడుట భావ్యమేనా? అట్లా అతివలు చేస్తే చెల్లునా? స్వామీ! నీవు ఘనుడవని, తగిన కానుకలు నీచేతికిస్తే నీవేమి చేశావు? వాటిని ఆమె చేతిలో పెట్టావు. ఇది నీకు తగునా స్వామీ! ఇందు నీ నేరమేమీ లేదు. నీవు దొరవని నిన్ను నమ్మిన నేరము నాదేనయ్యా! ప్రభూ! నా పతివి నీవేనని నమ్మి నావుంగరము నీ వేలికి పెట్టితిని గదయ్యా! నీవు నేడు స్వయంగా ఆమె వ్రేలికి బెట్టినావు. ఇదంతా నీ లోపము కాదయ్యా స్వామీ! నాదే లోపము. నీతో నేను చేసిన పొందులో నీకు కొత్తదనం లోపించింది. అంతేనయ్యా! నీవే నాకు హితుడవని నీతో ఏకాంత సేవకు ఒప్పుకొన్నాను. ఔరా!! అప్పుడే ఆ విషయం ఆమెకు చేరవేశావే? ఓ శ్రీవేంకటనాథా నీవెంత గొప్ప కథలు చెప్పేవాడివైనా నిన్ను నమ్మిన నాకుమాత్రం హితుడవై నన్ను కూడినావు. నిన్ను బ్రతిమిలాడి పట్టుకొని వుండాలిగాని బాసలు చేయించుకొంటే చెల్లుతుందా, ప్రభూ!

★ **కడమ** – లోపం ★ **కతకారి** – కథలు చెప్పువాడు





సంఖ్య : 68    సంపుటము : 10   పుట: 39    రాగం : దేశాళం

**29** కాంతుఁడు మరునియాజ్ఞ కడవలేఁ డింతే కాక
కొంతైన నెరఁగఁడా కోన చెన్నరాయఁడు ॥పల్లవి॥

వలపు నిలుప లేక వనితకు మొక్కెఁ గాక
సొలసి వాఁ డటువంటి సుద్దులవాఁడా
చెలిమి విడువ లేక చెయివూఁత యిచ్చెఁ గాక
కొలమున నేమి తక్కువవాఁడా ॥కాంతుడ॥

ఆసలు మానఁగ లేక ఆకు మడి చిచ్చెఁ గాక
వేసాల వాఁ డటువంటి విద్యలవాఁడా
బాసలు దప్పఁగ లేక బడినె తిరిగెఁ గాక
యీసున దొరతనము లెఱఁగనివాఁడా ॥కాంతుడ॥

పొందు విడువఁగ లేక పొత్తున భుజించెఁ గాక
అందగాఁ డాతఁ డెంగి లంటేవాఁడా
అంది శ్రీవెంకటనాథుఁ డాపెఁ గూడితే నేమి
చందముగా నాతోడి సమరతి మానేనా. ॥కాంతుడ॥ **68**

**భావ పరిమళం :**

కోన అనేగ్రామంలో నెలకొన్న చెన్నకేశవునిపై శృంగార గీతిక వినిపిస్తున్నారు చినతిరుమలయ్య. ఈ శ్రీకాంతుడు కూడా మదనుని ఆజ్ఞనతిక్రమించలేడు. ఈ కోన చెన్నరాయడు ఇంతకూడా యెఱుగడా? అసలు ఈ చెన్నకేశవుడు చేసిన తప్పేమిటి? తన వలపు నిలుపుకోలేక ఆ వనితకు మొక్కినాడు అంతేకదా! వాడు అటువంటి సుద్దులకు (వింత కథలకు) తావిస్తాడా? ఆమె నడచుటకు కష్టపడుతున్నదని తన చేతిని వూతగా ఇచ్చాడు. అంతమాత్రం చేత కులము తక్కువవాడయ్యాడా యేమి? ఆమె అంటే కలిగిన ఆసక్తి వల్ల తమలపాకు మడిచి తాంబూలం ఇచ్చి తన అంగీకారం తెలిపివుంటాడు. అంతెకాని వెట్టి వేసాలు వేసేవాడా యేమి? లేక అటువంటి టక్కుటమార విద్యలు తెలిసినవాడా యేమి? ఏదో ఆమెకిచ్చిన బాస వలన ఆమె చుట్టూ తిరుగుతున్నాడేమో? అతను దొరబిడ్డ. దొరతనము తెలియనివాడా యేమి? ఆమెపై మమకారంవల్ల నేడు ఆమె పొత్తున భుజించాడు. అతను త్రిజగన్మోహనుడే. ఎంగిలి కూటికి ఆశపడేవాడాయేమి? ఈ శ్రీవేంకటనాథుడే ఆ చెన్నరాయుడూను. ఈమెను (అన్నమయ్యను) గూడితేనేమి. వాడెన్నటికి అలమేల్మంగపతియే కదా!

★ **కడవలేడు** – అతిక్రమించలేడు ★ **ఎంగిలంటేవాడా** – కక్కుర్తిపడేవాడా

సంఖ్య : 18 సంపుటము : 10 పుట: 11 రాగం : కాంభోది

**30** నాలితనా లేఁటికోయి నారసింహుఁడా
నాలోనె నవ్వు వచ్చీ నారసింహుఁడా ॥పల్లవి॥

చేరువని ప్రియములు చెప్పి చెప్పి నామీఁద
నారువోసేవు వలపు నారసింహుఁడా
దారాసుద్ధపుమాఁటలు తాఁకనాడి మదనుని
నారసాలు సేయకు నారసింహుఁడా ॥నాలితనా॥

వెనుకొని నా వెంట వెంటఁ దిరిగి నామీఁద
ననుపు మోపు గట్టేవు నారసింహుఁడా
కనుచూపులనె వట్టి కాఁక రేఁచి మెత్తనైన
ననలు వాఁడిసేయకు నారసింహుఁడా ॥నాలితనా॥

చిలుకుగోళ్ల నన్నుఁ జెనకుచు నీపై నా-
నలు వెట్టె వచ్చేవు నారసింహుఁడా
కలికితనాన శ్రీవెంకటనాథ కూడితివి
నలువై వోఁగునూతుల నారసింహుఁడా ॥నాలితనా॥ **18**

**భావ పరిమళం :**

కడపజిల్లా చిన్న దాసరిపల్లె సమీపమున వేయి నూతులున్న ప్రదేశమునకు వోగునూతులకోన అన్న పేరున్నది. అక్కడ నరసింహస్వామి వెలసియున్నాడు. ఈ కీర్తనలో చినతిరుమలయ్య ఆ నారసింహునే కీర్తిస్తున్నారు. దేవి యేమంటున్నదంటే.. నీవంటి సత్యవచనాబద్ధుడైన వానికి వంచనమాటలేలనయ్యా నారసింహా! నీ మాటలు వింటుంటే నాలో నాకే నవ్వు వస్తున్నదయ్యా! ఓ నారసింహుడా! నాకు చేరువైవున్నావని, అనేకమైన ఇచ్చకపు మాటలు చెప్పి చెప్పీ నామీద వలపు వృక్షానికి నారుపోసేవయ్యా! ధారాశుద్ధివుందికదా! అని, వాడియైన మాటలు నా హృదయానికి తగిలేట్లు వేసి మన్మథుని బాణములకు నన్ను గురిసేయకయ్యా! ఓ నారసింహా! వెనకబడినా వెంటవెంట దిరిగి నామీద వలపు భారాన్ని వేస్తున్నావు. నీకంటి చూపులతోనే నన్ను కట్టేసి తాపమురేపి సుతిమెత్తనైన పూలను పదునైన బాణాలుగా వేయకుమయ్యా స్వామీ! ఓ నారసింహుడా! నీవి చిలుక ముక్కువంటి వాడియైన గోళ్ళు వాటితో నాకు గిలిగింతలు పెట్టకు. నాపై బాసలు చేయకుమయ్యా! నీవు దిట్టతనముగల శ్రీవేంకటేశ్వరుడవని నాకు తెలుసునయ్యా! సామర్థ్యముగల నోగునూతుల నారసింహా!

★ **నాలితనాలు** – వంచనలు ★ **నారసాలు** – బాణములు ★ **ననలు** – పూలు
★ **కలికితనము** – దిట్టతనము ★ **నలువై** – సామర్థ్యంగల





సంఖ్య : 29 సంపుటము : 10 పుట: 17 రాగం : నాదరామక్రియ

**31** వేవేలుచేఁతలవాఁడు వీఁడె వీఁడె
దేవుఁడగదె ప్రసన్న తిరువెంగళప్పఁడు ॥పల్లవి॥

యిద్దరు సతులు తన యిరువంకలఁ గొలువ
గద్దెన చూపులనె కరఁగింపుచు
అద్దరిపాటు సేసి ఆయములు ముట్టీని
తిద్దినగోళ్ల ప్రసన్న తిరువెంగళప్పఁడు ॥వేవేలు॥

కామినులు నలువంక కదిసి సేవలు సేయ
సామపు మాటలనె యాసలు సేయుచు
దోమటి చెనకులనె దుండగాలు సేసీని
దీమసముతో ప్రసన్న తిరువెంగళప్పఁడు ॥వేవేలు॥

అలమేలుమంగ దన కాకుమడి చియ్యఁగాను
సొలపులమాఁటలనె చొక్కింపుచు
నలువై శ్రీవెంకటనాథుఁడై కూడినవాఁడు
తెలిఁగన్నుల ప్రసన్న తిరువెంగళప్పఁడు. ॥వేవేలు॥ **29**

**భావ పరిమళం :**

కడపజిల్లా కమలాపురం తాలూకాలోని పందిళ్లపల్లె గ్రామంలోని ప్రసన్నవేంకటేశ్వర స్వామిని కీర్తిస్తున్నారు చినతిరుమలయ్య. ఈ ప్రసన్న తిరువేంగళప్పుడు అనేకమైన చేతలు చేయగలదిట్ట నిజమైన దేముడంటే వీడే. తన ఇద్దరు భార్యలైన శ్రీదేవిని, భూదేవిని తనను గద్దించినట్లు చూస్తుంటే వారినీ కరిగించుచున్నాడు. అంతేకాక యెలాగైనా వీలుచేసుకొని వారి మర్మాలను తాకుతాడు. తీర్చిదిద్దినట్లున్న ఈ స్వామి పేరే ప్రసన్న తిరువేంగళప్పుడు. ఈ స్వామికి ఇరువైపులా నిలబడిన వనితలు కూడి సేవ చేయుచున్నారు. సౌమ్యమైన మాటలు చెప్పి వారిలో ఆశలు రేకెత్తించుచు కపటముగా తాకునట్టి దుండగాలలో సిద్ధహస్తుడు. ఇతడే దర్పము ప్రదర్శించుచున్న ప్రసన్న వేంగళప్పుడు. దేవి అలమేలుమంగ ఈయనకు తాంబూలమునందించగా ఆమెను సొంపైన మాటలతో పరవశింపజేయుచున్నాడు. సామర్థ్యంగల ఈ శ్రీవేంకటేశ్వరుడు ఆమెను ప్రేమగా కూడియున్నాడు. తెల్లని కన్నులున్న ఈ స్వామిపేరే ప్రసన్నవేంగళనాథుడు.

★ **గద్దెన** – గద్దింపు ★ **దోమటి** – కపటపు ★ **తెలిగన్నులు** – తెల్లని కన్నులున్న
★ **చొక్కింపుచు** – పరవశింపచేయుచు

సంఖ్య : 20 సంపుటము : 10 పుట: 12 రాగం : మలహరి

**32 చుల్లరవెట్టుఁ జేఁతల చొక్కనాథఁడు**
**వుల్లములో నీ నెలఁదలూరి చొక్కనాథఁడు** ॥పల్లవి॥

**అద్దమరాతిరికాడ నంటువడి వచ్చి తాను**
**సుద్దు లేమి పచరించీఁ జొక్కనాథఁడు**
**వద్దు వొమ్మనవె రేపువచ్చుఁ గాని యిప్పుడేల**
**వొద్దికి వచ్చీ నెలఁదూరి చొక్కనాథఁడు** ॥చుల్ల॥

**మిక్కిలిఁ దా నెక్కడనో మీఁదువోయి వచ్చి నేఁడు**
**చక్కటు లేమి చెప్పీనె చొక్కనాథఁడు**
**పెక్కు లేల నేనె పిలిపించఁగా వచ్చీ**
**వొక్కటిగా నీ నెలఁదలూరి చొక్కనాథఁడు** ॥చుల్ల॥

**యిప్పుడె తా నెవ్వతెకో యెంగిలియై వచ్చి యిట్టె**
**చొప్పులు మాప వచ్చీనె చొక్కనాథఁడు**
**కప్పురపుమోవి శ్రీవేంకటనాథుఁడె నన్ను**
**వొప్పుగాఁ గూడె నెలఁదలూరి చొక్కనాథఁడు** ॥చుల్ల॥ **20**

**భావ పరిమళం :**

కడపజిల్లా నెలదలూరు గ్రామమున నెలకొన్న సౌమ్యనాథస్వామిని చినతిరుమలయ్య చొక్కనాథునిగా కీర్తిస్తున్నారు. బాధ కలిగించే చేతలలో సిద్ధహస్తుడవైన చొక్కనాథుడా! నా మనస్సులో నెలకొనినవాడీ నెలదలూరి చొక్కనాథుడు. అర్ధరాత్రిపూట పొందుకు ఆరాటపడి వచ్చాడటండీ, ఇతగాడు. అప్పటికప్పుడు ఈ చొక్కనాథుడు యేమి కథలు వినిపిస్తున్నాడో చూడండి. ఇవ్వాళ వద్దు పొమ్మని చెప్పండే. ఇప్పుడెందుకు రేపు రావచ్చును కదా! ఈ నెలదలూరి చొక్కనాథుడికి ఇప్పుడేమి ప్రేమ పుట్టుకొచ్చిందిట? తాను యెక్కడికో బయలుదేరి అనుకోకుండా నేడు ఇక్కడకు వచ్చాడు. అన్నీ చక్కబడ్డాయని యేమి చెబుతున్నాడే ఈ చొక్కనాథుడు. పెక్కు మాటలెందుకు పనుంది రమ్మనమని నేనే పిలిపించాను. ఈ నెలదలూరి చొక్కనాథుడు, ఇప్పటికైనా, ఒక్కటవుతాడా? ఇప్పుడే తాను యెవ్వతెకో యెంగిలిపడి వచ్చినట్టున్నాడు. నాతో జాడతెలిసిన వాడిలా అనునయించటానికి వచ్చాడీ చొక్కనాథుడు. కర్పూరపు పరిమళంగల అధరములున్న శ్రీవేంకటేశ్వరుడు నన్ను ఒప్పుగా కూడినాడు, ఏలననగా ఈయనే నెలదలూరి చొక్కనాథుడు.

★ **చుల్లరవెట్టు** – బాధకలిగించు ★ **అద్దమరాతిరి** – అర్ధరాత్రి





సంఖ్య : 23 సంపుటము : 10 పుట: 14 రాగం : రామక్రియ

**33 వద్దు నాతో వెచ్చీ వేవని మాయలు**
**వుద్దండపు వో సంబటూరి చెన్నరాయఁడా** ॥పల్లవి॥

**అమ్మమీఁద నానవెట్టి ఆసవుట్ట మాఁటలాడి**
**నమ్మించ వచ్చేవు నాకుఁ గొత్తలా**
**సమ్మతి నీ వలపుల సతులవద్దికె పోయి**
**యెమ్మెలు నెరపేవారి నెలయించవయ్యా** ॥వద్దు॥

**మానము సోఁకనాడి మచ్చిక బాస లిచ్చేవు**
**యానెపా లెల్లా నే నెరఁగనివా**
**వూనినవేడుకల నీ వువిదలతోడుతను**
**నీ నేరుపు సట లెల్లా నెరపవయ్యా** ॥వద్దు॥

**కాఁగిటికిఁ జేరఁదీసి కన్నుల మొక్కులు మొక్కి**
**ఆఁగేవు నేఁ దెలియనిపనులా**
**నాఁగువార శ్రీవెంకటనాథ నన్నుఁ గూడితివి**
**యేఁగి వచ్చి యిట్టె మాయింట నుండవయ్యా.** ॥వద్దు॥

**భావ పరిమళం :**

ఇది చినతిరుమలయ్య సంబటూరి చెన్నకేశవునిపై చెప్పిన శృంగార సంకీర్తన. చెన్నకేశవుడంటే ఒకరకంగా గోపీకృష్ణుడే. ఈ స్వామి, రసికావతంశుడు. నాయిక అంటున్నది... నాతో పరిపక్వమైన మాయలు చేస్తావు. ఇది నీకు తగదు, వద్దురా! నీవు ఉద్దండుడివి. ఓ సంబటూరి చెన్నరాయుడా! మా మాటవినవయ్యా! మీ అమ్మమీద ఒట్టుపెట్టుకొని ఆశకలిగేటట్లు మాటలు చెబుతావు. నేనేదో కొత్తదానినయినట్లు నమ్మించే ప్రయత్నం చేస్తావు. నాతో యెందుకు? నీవలపులను సమ్మతించే పడుచులదగ్గరకే పోరాదా? నీతో విలాసంగా గడిపేవారిని పరవశింపజేసికో. పోపోవయ్యా! మా మర్యాద దెబ్బతినేట్లు మాట్లాడి మళ్ళీమచ్చిక చేసికొనే బాసలు చేస్తావు. ఈ వాదప్రతివాదాలు నేనెరగనివా? నీకొత్త చెలియలతో కావలసినన్ని వేడుకలు పొందవయ్యా! నీ నేర్పరితనం వారి ముందు చూపించుకోవయ్యా! పోపో అక్కడికేపో. నన్ను కౌగిట్లోకి లాగికొని కన్నులతోనే నాకు మొక్కునట్లు చూసి అంతే చాలన్నట్లు ఆగిపోతావు. ఇవన్నీ నాకు తెలియని కిటుకులా? అతిశయించిన ఓ శ్రీవేంకటేశా! వెంటనే వచ్చి మా ఇంట్లో వుండిపోవయ్యా!

★ **వెచ్చీవేవు**– పరిపక్వమైన ★ **సోకనాడి** – నొచ్చునట్లుమాట్లాడి
★ **నాఁగువారు** – అతిశయించు ★ **మానము** – మర్యాద

సంఖ్య : 58  సంపుటము : 10  పుట: 34  రాగం : తెలుగుగాంబోది

**34 చెప్పరె మీరైనా బుద్ధి చెలులాల**
**అప్పసము మా కదిరి యప్పనికి** ॥పల్లవి॥

**యింతగా వలచినవాఁ డింటికి వచ్చితే నేమి**
**అంతలోఁ దనకును సిగ్గాయనటవే**
**పంతము దప్పిపోయీనా పచ్చిదేరేమాఁటలను**
**అంతేసి తన్నుఁ దూరనాడఁ జాలఁగాక** ॥చెప్పరే॥

**మన సిచ్చినట్టివాఁడు మాఁటలాడితే నేమి**
**తను నెవ్వరైనా వద్దనే రటే**
**చనుమొనలు సోఁకఁగా జాణతనపుఁజేఁతల**
**చెనకలేనా కొంత చేకాచి కాక** ॥చెప్పరే॥

**కదిసినవాఁడు నన్నుఁ గాఁగిలించితే నేమి**
**అదను గాదా తనకు నడ్డమా యేమి**
**వెదచల్లుఁ గూరిమి శ్రీవెంకటనాథుఁ డై కూడె**
**పదిలమై యిఁకఁ దన్నుఁ బాయలేనుఁ గాకా.** ॥చెప్పరే॥ **58**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య కదిరి నృసింహునిపై వినిపించిన శృంగార కీర్తననాస్వాదించండి. చెంచులక్ష్మి తన చెలికత్తెలతో వలచివచ్చానన్న నరహరిగురించి “ఓచెలులారా! మీరైనా హితవు చెప్పండమ్మా!” ఈ కదిరి నృసింహుడు ఎల్లప్పుడూ నాకు మేలువాడై వుండమని చెప్పండమ్మా అని వేడుకొంటున్నది. ఒకవేళ ఆ నృసింహుడు నన్ను ఇంతగా వలచితే మా ఇంటికి రావచ్చును కదా! అంతలోనే తనకూ సిగ్గయినదా యేమే? పట్టుదలను గాలికి వదిలేసి అంతేసి చెడుమాటలతో తనను తిట్టలేనుకూడా. అతగాడు నాకు మనసిచ్చినదే నిజమైతే నాతో మంచిగా మాట్లాడవచ్చును కదా! తననెవ్వరైనా వద్దన్నారటే. నేను కూడా అందరు వగలాడి జవ్వనులవలె చనుమొనలను తాకించుతూ జాణతనపు చేతలు చూపించలేనా? కాకపోతే కొంత సంకోచము నన్నాపని చేయనీయదు కదే! చెలియా! నన్ను దగ్గరైనవాడు కౌగలించుకొంటే కాదంటానా? తనకు అడ్డమా యేమి? పోనీ ఇది తగిన సమయము కాదా? ఈ నృసింహుడే వేంకటనాథుడై నన్ను కూడినాడే. ఇకనేను ఆతనిని యెన్నటికీ వీడలేను.

★ **పచ్చిదేరు** – చెడ్డవైన ★ **అప్పసము** – మేలువాడై





సంఖ్య : 38  సంపుటము : 10  పుట: 22  రాగం : సాళంగనాట

**35 తగవో బలిమో నీతలఁపు నాతోఁ జెప్పర**
**నగుమోముతోఁ గదిరినాథ నీవు** ॥పల్లవి॥

**యేరా వొద్దన్న మాన విల్లురికి నాతోను**
**మీరి నవ్వేవు కోమటిమేనరికమా**
**వారము వజ్జ మనక వాకిట నన్ను నాఁగేవు**
**పోరచి మావారు నీకుఁ బోఁక వెట్టిరా** ॥తగవో॥

**కొంత గొంత కోపించిన కొంగువట్టి నాతోను**
**రంతులు సేసేవు నీకు రాచబలిమా**
**వంతకు వాసికి నన్ను వావిదేరఁ బిలిచేవు**
**కొంతైనా మావారు నీవుంకువ వట్టిరా** ॥తగవో॥

**గబ్బినై యదలించిన కన్నుల మొక్కుచు నన్ను**
**గొబ్బునఁ గాఁగిలించేవు గొల్లదోమటా**
**అబ్బురపు శ్రీవెంకటాద్రినాథ కూడితివి**
**సిబ్బితివాయఁ బెండ్లి సేసిరా నీకూ.** ॥తగవో॥

**భావ పరిమళం :**

ఈ కీర్తనలో చినతిరుమలయ్య కదిరి నృశింహునితో చెంచులక్ష్మి విన్నపాలను యేకరువుపెడుతున్నారు. నరహరినని కదిరి వాసినని చెప్పిన ఈ సుందరమైన యువకుడు సాంప్రదాయబద్ధంగా యెలాతనను పరిణయమాడతాడని ఆమె బెంగ. ఓ నరహరీ! నన్నెలా పెళ్ళాడతావయ్యా? తగవుపెట్టుకుంటావా? నీబలగమెంతో చూపిస్తావా? నీ తలపేమిటో నాతో చెప్పరా? ఏమడిగినా, ఓ కదిరి నరహరీ! నవ్వులొలికే మొగము చూపిస్తావేమిరా? ఏమిరా వొద్దంటే మానవు. అభిమానంలేని ఇల్లువీడుట నాతో చేస్తావా అంటే నవ్వులొలికిస్తావు వారమూ వర్జ్యమూ చూడక నన్ను తీసికెళ్ళిపోతే మావాళ్ళు ధనం సమకూర్చుకోవద్దా? ఇంకా నీకు నిశ్చయతాంబూలమియ్యలేదు కదా! నీ తొందర చూచి నేను నీపై కోపము చూపితే నీ మిడిసిపాటు నాపై చూపిస్తావు. నీదేమన్నా రాజులకుండే బలగమా? నాతో వరుస కలిపి పిలుస్తున్నావు కదా! మన వావివరుసలు చూసికొనేమాట మరచి వూరకనే పిలిస్తే యెలా వస్తాను? నీవు మా వారికి యేదో కొంతైనా కట్నము ఇవ్వాలా వద్దా? ఓ నరహరీ! నేను కపటవు కోపంతో అదిలించితేనే కళ్ళతోనే నాకు మొక్కుతూ బిగికౌగిలిస్తావు. ఇదేమి గొల్లదోమటి? అసలు నీవు శ్రీవేంకటనాథుడవు కదా? ఇప్పుడన్నా నీకూ నాకూ పెండ్లి చేస్తారా?

★ **ఇల్లురికి** – అభిమానంలేక ఇల్లువీడుట ★ **పోరచి** – అలక్ష్యం
★ **రంతులు** – మిడిసిపాటు ★ **గొల్లదోమటి** – గొల్లవారి బంధుత్వం

సంఖ్య : 66 సంపుటము : 10 పుట: 38 రాగం : బౌళి

**36** చిత్తమె చిమ్మి రేఁగితే సిగ్గేమి యెగ్గేమి
రుత్తవోని వేడుకల రుచి గన్నవారికి ॥పల్లవి॥

మొక్కలానఁ దిట్టినాను మోహమె పెచ్చువెరుగు
దక్క వలచినయట్టి తరితీపున
వుక్కుగోరు సోఁకినాను వుపచార మై తోఁచు
నిక్క మై సరస మాడ నేరిచినవారికి ॥చిత్తమె॥

కాలు దాఁకించిన నైన కళ లంటిన ట్లౌను
వేళమె మోహించినట్టి వేడుకను
పేలరి మాఁట లాడిన ప్రియము లై తోఁచును
వాలాయించి నన్ను పైనవారికిని ॥చిత్తమె॥

ఎంగిలి సోఁకించినాను యిచ్చక మై తోఁచును
పొంగెటి తమకపు తీపులవేళను
చెంగలించె నీచెలియ శ్రీవెంకటనాథుఁ గూడి
అంగ మైన మండెమురాయఁడె తానై యుండఁగా ॥చిత్తమె॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య, కడప జిల్లా చినమండెము నరసింహస్వామిపై శృంగార కీర్తన వినిపిస్తున్నారు. దేవీ! మనస్సు చెలరేగిపోతే సిగ్గు యెగ్గులు పట్టింపునకు వస్తాయా? వ్యర్థముకాని వేడుకలు రుచి చూచిన వారికి ఆ మనస్సు వివశత్వం యెందుకు పొందదు? మొరటుతనంతో తిట్టినా మోహము పెచ్చు మీరుతూనేవుంటుంది. వలచిన వారికి ఆ తిట్లే ఆనందం కలిగిస్తాయి కూడాను. అతను వుక్కు గోటితో రక్కినా వుపచారములాగానే వుంటుంది. నిజమైన సరసం అంటే తెలిసినవారికే వలపుల రుచి తెలుస్తుంది. దేవీ! యుక్త వయస్సులో తరుణి మోహంలో పడితే కళ్యాణము వేడుకగా కాలు తొక్కించినా కళాస్థానములను అతగాడు తాకినట్లు అనిపిస్తుంది. అతిగా మాట్లాడినా అతగాడికి ప్రియములైన మాటలుగానే వుంటాయి. నిర్బంధము పెట్టినా, పైనుంచి చూచేవారికి సరసములాగానే వుంటుంది. దేవీ! అతగాడు అధరములను పెనవైచి యెంగిలిచేసినా ఇష్టమైనట్లే వుంటుంది. పొంగేటి తమకములు తీయగానే వుంటాయి. దేవీ! నిజానికి శ్రీ వేంకటనాథుడిని కూడిన శ్రీదేవివి. అందుకే తానే మండెము నరసింహుడై నీకు అంగమైనాడు.

★ **రుత్తవోవు** – వ్యరమైన ★ **పేరడి** – అధికంగా
★ **వాలాయించిన** – నిర్బంధముపెట్టినా ★ **అంగమైనది** – ఆకర్షణయైనది





సంఖ్య : 25 సంపుటము : 10 పుట: 15 రాగం : దేసాళం

**37** నేఁడు నీచేఁత లెల్లా నీ వెరఁగవా
నీడనుండె యలసేవు నీ వెరఁగవా ॥పల్లవి॥

వేమారు నాచేత వెళ్లనాడించ నేఁటికి
నీమనసులోని కల్ల నీ వెరఁగవా
దీమసానఁ బెక్కిండ్లు దిరిగి వచ్చేవాఁడవు
నేమపు నీగుణములు నీ వెరఁగవా ॥నేడు॥

గట్టున నుండక నాకుఁ గోపము రేఁచ నేఁటికి
నెట్టన నీనడవడి నీ వెరఁగవా
చుట్టాలసురభి వని సోఁకనాడినంతలోనె
నిట్టచూపులు చూచేవు నీ వెరఁగవా ॥నేడు॥

పన్ని నీనిజము లీడఁ బచరించ నేఁటికి
నిన్నటి నీసుద్దు లెల్లా నీ వెరఁగవా
నన్ను నిట్టె శ్రీవెంకటనాథుఁడ నీవె కూడి
నిన్ను నన్ను మెచ్చేవు నీ వెరఁగవా. ॥నేడు॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య వినిపిస్తున్న ఈ శృంగార కీర్తనలో దేవి, వినయంతోనే తిరుమలేశుని సూటిగా ప్రశ్నిస్తున్నది. ప్రభూ! ముంజేతి కడియం చూసికొనుటకు అద్దమెందుకు అన్నట్లు, నేడు నీవు చేసే చేతలెటువంటివో నీవెరగవా. నిన్ను నీవే చూసుకో, నీడనుండేవారికి ఇంతగా అలసిపోవటం అనేది జరుగదని నీవెరగవా. అనేక పర్యాయములు నీ చేతలు రచ్చకీడ్చినందువల్ల కలిగే ప్రయోజనమేమి? నీ మనస్సు కంటిన మకిలీ నీవెరగవా? తెంపరితనంతో అనేకమైన ఇళ్ళల్లో గడిపేవాడవు, నీ నియమాలు తప్పక పాటించే నీ గుణములు నీవెరగవా స్వామీ! గుట్టుగా వుండక నాకు కోపం రేకెత్తించేవెందుకయ్యా! కట్టెదురుగా కనబడే నీ నడవడి నీవెరగవా. చుట్టాలకేది కావాలంటే అదిచ్చే సురభి అనే దేవలోకపు కామధేనువు నీవని, అందరూ నా మనస్సు నొచ్చేట్లు అంటుంటే నీవు నిటారుగా చూసే చూపుల నేనెరగనా? దేవా! నీ గురించిన నిజాలు ఇక్కడ ప్రకటించటం దేనికి. నిన్నటిదాకా నీపై నడిచిన కథలు నీవెరగవా? ఓ శ్రీవేంకటేశా! నీవే నాతో కూడితే అందరూ నిన్నూ మెచ్చేరని, నీవెరగవా?

★ **నేమపు** – నియమముగల ★ **నిట్టచూపు** – నిటారుచూపులు
★ **సోకనాడు** – మనస్సునొచ్చే

సంఖ్య : 533 సంపుటము : 17 పుట: 307 రాగం : దేసాళం

**38 చిక్కని సింగారరాయ శ్రీవేంకటేశ నీకు**
**అక్కున నున్న తరుణి యన్నియునుఁ గాదా ॥పల్లవి॥**

**యింతిచూపువెన్నెలలు యిటు నీపైఁ బోసితేనే**
**కాంతి నీ కదే కప్పురకాపు గాదా**
**పంతాన గిన్నెలతోడి పచ్చకప్పురపుధూళి**
**యింతయు నీమై నలఁదే విది గొంతవలెనా ॥చిక్కని॥**

**చెలిబొమ్మజంకెనల చీఁకటిపైఁ బోసితేనే**
**కలిమి నదే పుణుఁగుకాపు గాదా**
**పలు భరణులతోడిపచ్చితట్టుపుణుఁ గెల్లా**
**నిలువున నలఁదేవు నీకు నిది వలెనా ॥చిక్కని॥**

**వనిత మేనికాంతులు వడి నీపైఁ జిమ్మితేనే**
**సునిసి నీ కవే పెక్కు సొమ్ములు గావా**
**అనుగు శ్రీవేంకటేశ అలమేలుమంగఁ గూడి**
**తనియ సొమ్ము వెట్టితి తగు నిది నీక ॥చిక్కని॥ 533**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో అనన్యాసాధ్యమైన సింగారరాయా! శ్రీవేంకటేశా! నీ యెదలోనున్న తరుణి నీకు అన్నియును తానే కాదా? నిజమే. దీనికి కారణమేమంటే... ఆ ఇంతి వెన్నెలవంటి తన చూపుతో నీపై చల్లదనం, తెల్లదనం కురిపిస్తుంది. నీకు అదే కర్పూరకాపు అయినదేమో!! దానికి తోడు గిన్నెలనిండా నింపిన పచ్చకర్పూరధూళి నీమేనిపై అద్దినారు. మరి దానిమూలంగా ఆ వెన్నెల కాంతి వచ్చినదా? ఈ తరుటి భ్రుకుటి ముడివైచినంతనే చీకటి కమ్ముకొన్నట్లవుతుంది. అదే నీకు పునుగు సుగంధద్రవ్యపు పూత అయినదేమో!! ఎన్నో భరిణల నిండా నింపి తెచ్చిన అప్పటికప్పుడు తీసిన తట్టుపుణుగు నీకు నిలువునా అద్దుతున్నారు. కానీ, స్వామీ! అసలే నల్లనివాడివి నీకా పూతలెందుకయ్యా? ప్రభూ! ఈ వనిత శరీరకాంతి నీపై చిమ్మితేనే విచిత్రమైన కాంతులు వచ్చి నీ ఆభరణాలకాంతియేమో అనునట్లు మిరుమిట్లు గొల్పుచున్నది. ప్రేమాస్పదుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీవీ అలమేల్మంగను కూడితివి. ఆమె నీకు సంతృప్తి అనే సొమ్ముపెట్టినది. నీకు అంతకు మించి ఏ కానుక కావలెను?

★ **సునిసి** – అతిశయించి ★ **బొమ్మజంకెనలు** – కనుబొమ్మలు కదలించి బెదిరిస్తే





సంఖ్య : 431 సంపుటము : 17 పుట: 249 రాగం : భైరవి

**39 ఇన్నియు నుండఁగ దమ కేమి గడమ**
**వున్నవాఁడు సిరి పురుషోత్తమరాజు ॥పల్లవి॥**

**వీలుచు నీ రావటించీ వేదమరాజు**
**కూలికి గుండ్లు మోచీఁ గూర్మరాజు**
**పోలిమి నేలలు దవ్వీఁ బొలమురాజు**
**నాలి బడుచాట లాడీ నరసింగరాజు ॥ఇన్నియు॥**

**చేకొని చేతులు చాఁచీఁ జిక్కరాజు**
**రాకపోక దపసాయె రామరాజు**
**రాకట్నములే కట్టీ రాఘవరాజు**
**రేకలఁ బసులఁ గాచీ కృష్ణరాజు ॥ఇన్నియు॥**

**మగువల కిచ్చలాడీ మాకరాజు**
**జగమెల్లాఁదిరిగీని జక్కరాజు**
**నగుఁబాటుదీర శ్రీవేంకటనగముపయి**
**వెగటై లోకము లేలే వెంగళరాజు ॥ఇన్నియు॥ 431**

**భావ పరిమళం :**

పెదతిరుమలాచార్యులవారు అన్నమయ్య సుపుత్రుడు. శృంగార భక్తి వైరాగ్య కీర్తనలను "వేంకట" మకుకటంతోనే వ్రాసి తండ్రిఋణం తీర్చుకొన్న ధన్యాత్ముడు. ఈ దశావతార కీర్తనలో తండ్రికి తగిన కొడుకని నిరూపించాడు. ప్రభూ! సిరిని హృదయవాసిని జేసిన పురుషోత్తమ రాజువి ఇన్ని వైభవములు నీకుండగా ఇక నీకు కొదవయేమి? "సిరిగలవానికి జెల్లును తరుణుల పదియారువేల తగపెండ్లాడన్" అన్నరు కదా! నీటితో నిండిపోయిన సాగరాన్ని చీల్చుకొని వేదములను రక్షించినాడు వేదమరాజు **(మత్స్యావతారం).** కూలికి కొండను మోసినాడీ కూర్మరాజు **(కూర్మావతారం).** పోలికతో నేలను తవ్వి హిరణ్యాక్షుని వెదికాడు పొలము రాజు **(వరాహావతారం).** వేళాకోళంగా చెంచుకన్యతో పడుచు ఆటలనాడినవాడీ నరసింహరాజు **(నరహరి అవతారం).** చేకొని ముష్టెత్తినాడీ చిక్కరాజు **(వామనావతారం).** అనేకమార్లు దండెత్తి చివరకు తపస్వియైనాడు రామరాజు **(పరసురామావతారం).** రాజకట్నముగా పత్నీ సుఖాన్నే త్యాగంచేసిన రాఘవరాజు **(శ్రీరామావతారం).** పల్లె ప్రాంతాలలో పశువుల్ని కాచిన కృష్ణరాజు **(శ్రీకృష్ణావతారం).** మగువలతో ఇచ్చకములాడి కార్యము సాధించాడీ మాకరాజు **(బుద్ధావతారం).** జగమెల్లా చక్రంవలె చుట్టి దుష్ట శిక్షణ చేశాడీ జక్కరాజు **(కల్కి అవతారం).** ఈ వేంకటరాజు శ్రీవేంకట కొండపైనుండి లోకములేలే శ్రీవేంకటేశ్వరుడైనాడు.

★ **నాలి** – వేళాకోళం ★ **చిక్కరాజు** – ఇబ్బందిపెట్టిన ఘనుడు

సంఖ్య : 360  సంపుటము : 17  పుట: 208  రాగం : భైరవి

**40 గుట్టు మాతోఁ జేసేవుగా కొండలరాయా**
**వట్టిజోలి యిఁక నేల వద్దు కొండలరాయా** ॥పల్లవి॥

**కొమ్మదిక్కు చూడరాదా కొండలరాయా, నీపైఁ**
**గుమ్మరించీ వలపులు కొండలరాయా**
**కుమ్మెలాయె గోరితాఁకు కొండలరాయా**
**నమ్మిక లిచ్చితివిగా నాడే కొండలరాయా** ॥గుట్టు॥

**కుప్పెసవర మేడది కొండలరాయా, కడుఁ**
**గుప్పళించకు సిగ్గులు కొండలరాయా**
**కొప్పు వంచి ఇంతి మొక్కె కొండలరాయా**
**అప్పటి నూరకున్నాఁడవయ్యో కొండలరాయా** ॥గుట్టు॥

**గోడమీఁదిసున్న మైతి కొండలరాయా**
**కోడెవయసు వో నీకు కొండలరాయా**
**కూడితివి మా సతిని కొండలరాయా**
**మేడెపు శ్రీవేంకటేశ మేలు కొండలరాయా** ॥గుట్టు॥ **360**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన కొండలరాయనిపై శృంగార గీతికనాస్వాదిద్దాము. దేవి చెలికత్తియలు స్వామితో తెగువచూపుతూ అభ్యర్థిస్తున్నారు. స్వామీ! నీవు మాతో గుట్టు బాగానే వుంచుతున్నావు. కానీ నీవు యెప్పుడెక్కడుంటావో తెలియదు. నీతో జోలి (సంబంధం) పెట్టుకొంటే అది వట్టిపోతుంది. ఇక అటువంటి జోలియెందుకయ్యా? ఈమె నీదే కదా! మరి ఆమె దిక్కుకైన చూడవేమయ్యా? మరి మీయేకాంతంలో నీవు కుమ్మరించే వలపుల భారం మోయలేరు. నీవు చేసిన నఖక్షతములవల్ల మా చెలి వొంటిపై గాయాలైనవి. ఆనాడే నీవలపుపై నమ్మకముంచమని ఆమెకు నూరిపోసినావు. కొండలరాయా! ఆమె నిన్నే నమ్మినదయ్యా! అది సరేగానీ స్వామీ! తమరి శిరోజాలలోకి కుప్పెసవరము యెక్కడనుంచి వచ్చింది? అది చూచి సిగ్గులు కుమ్మరిస్తున్నావే. బహుశా ఆ కొత్త భక్తురాలు కొప్పువంచి నీకు వందనం చేస్తుంటే అట్లా అయిందా యేమి? పూర్వం వలె మౌనమే నీ సమాధానమా స్వామీ! ఓ కొండలరాయా! గోడకు వేసిన సున్నమువలె ఆమెకు అతుక్కొనివుండిపోయావు. నీవేమో కోడెవయసు కుఱ్ఱవాడివి. మా సతిని ప్రేమతో కూడినావు. శ్రేష్ఠుడవైన ఓ వేంకటేశ్వరా! నీ అంత ఏలు వాడు ఇంకెవరయ్యా?

★ **కుమ్మెలాయె** – గాయాలైనవి ★ **కుప్పెసవరం** – స్త్రీలు ధరించు సవరం
★ **అప్పటి** – పూర్వంవలె ★ **మేడెపు** – శ్రేష్ఠుడవైన





సంఖ్య : 194  సంపుటము : 17  పుట: 114  రాగం : ఆహిరి

**41 వెల్లివిరు లాయనోయి వేడుకలు నీకు నేఁడు**
**గొల్లదోమటి సేసిరి గొల్లెత లిందరును** ॥పల్లవి॥

**కలికి యొక్కతె నిన్నుఁ గైకొని పెండ్లి యాడఁగా**
**తలఁబాలు తోడువోసీ తాను నొకతె**
**యెలమిఁ బెండ్లిపీఁటపై నిద్దరు గూచుండఁగాను**
**చలపట్టి పొరుగాలు సంగడిఁ గూచుండీని** ॥వెల్లి॥

**హత్తి నీబువ్వాన నొక్క యంగన గాచుకుండఁగా**
**పొత్తులకు వేరొక్క పొలఁతి వచ్చె**
**బత్తితోడ మరొకతె బాగాలు చేతి కియ్యఁగా**
**మత్తిలి యంతలో నాకు మడిచి యిచ్చీని** ॥వెల్లి॥

**కొసరి యొక్కతె నిన్ను గోరి తెర వేసితేను**
**యెసగఁ బాన్పు వరచె నింతి యొకతె**
**పసగా శ్రీవేంకటేశ పాదా లొకతె వొత్తఁగ**
**యెసగి యలమేల్మంగ యిటు నిన్నుఁ గూడెను** ॥వెల్లి॥ **194**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ కృష్ణామృతాన్ని ఆస్వాదించండి. ఓ శ్రీకృష్ణా! నేడు నీకు వేడుకలన్నీ వెల్లివిరిసినవి. ఇంతమంది గొల్లెతలు నీకు తమ గొల్లభోజనం తినిపించి నీకు విందులు చేశారయ్యా! వారిలో నిన్ను పెండ్లాడాలనే వాంఛ యెంత వృద్ధిచెందిందో వివరిస్తాను, వినవయ్యా! ఒక పడుచు నిన్ను తీసికొని పోయి పెండ్లియాడుతుంటే నిన్ను వలచిన యింకొకతె తానూ సిద్ధమై నీమీద తలంబ్రాలు పోసింది. చూడండీ తమాషా. పెండ్లిపీటలమీద ఇద్దరు పెండ్లికూతుళ్ళు కూచున్నారు. ఇంకేముంది ఇరుగు పొరుగు ఆడవాళ్ళంతా బద్ధశత్రువుల్లా కొట్లాడుకొన్నారు. నీపెండ్లిభోజనాల దగ్గర ఇంకొక గందరగోళం జరిగింది. పెండ్లిభోజనాలవుతున్నాయి. పెండ్లికొడుకూ, పెండ్లికూతురు సహపంక్తి భోజనం చేస్తుంటే, వేరొక కన్నెపిల్ల వచ్చి నీపొత్తున కూచున్నది. నీమీద భక్తి వున్న మరొకతె పెండ్లికూతురి భాగం తన కంచంలో పెట్టుకొన్నాది. మతిలేనిది ఇంకొకతె వచ్చి మీకు తాంబూలం కూడా ఇచ్చింది. ఇప్పుడు చెప్పాల్సింది నీవే. నీ పెండ్లాము యెవరైనట్లు? కొసరుగా ఇంకొక కథ నడిచింది. ఒక పెండ్లికూతురు నీతో పాటు తెరమరుగునకు వస్తే, ఇంకొక ఇంతి నేరుగా నీ పక్కలోకే వచ్చేసింది. ఓ శ్రీవేంకటేశా! మరొకతె వచ్చి నీ పాదాలు వొత్తసాగింది. ఈ సరదాకి అడ్డుకట్ట వేయడానికి దేవి అలమేల్మంగ వచ్చి నిన్ను కూడినది. ఇక ఆపైన మీదే స్వర్గం.

★ **పసగా** – చాతుర్యంతో ★ **సంగడి** – సమూహంగా

సంఖ్య : 315 సంపుటము : 17 పుట: 182 రాగం : శుద్ధవసంతం

**42 మేలుమేలు యిద్దరై మేకులకే సేవచేసి**
**గోలతనము మానితి గోవిందనాంచారి** ॥పల్లవి॥

**చప్పుడుగా దేవునికే సారెఁ బాదములొత్తఁగా**
**కొప్పు జారెఁ గదవమ్మ గోవిందనాంచారి**
**ముప్పిరి నాతఁడు నీమోము చూచి నవ్వితేను**
**కుప్పళించె పెంజెమట గోవిందనాంచారి** ॥మేలు॥

**సంగతి నాతనితోడ సరసము లాడఁగాను**
**కొంగు జాఱెఁ గదవమ్మ గోవిందనాంచారి**
**అంగవించి పాదముల నాతఁ డెంత యదిమినా**
**కుంగవుగా నీ చన్నులు గోవిందనాంచారి** ॥మేలు॥

**యెడయక పాఁపసెజ్జ నిద్దరునుఁ బెనఁగుచు**
**కొడుకుఁ గంటివిగా గోవిందనాంచారి**
**అడరి శ్రీవేంకటేఆద్రి నదె గోవిందరాజుతో**
**గొడుగులనీడ నేగె గోవిందనాంచారి** ॥మేలు॥ **315**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య తిరుపతిలోని గోవిందరాజ స్వామి దేవేరియైన గోవిందనాంచారి (శ్రీదేవి)పై చెప్పిన కీర్తన ఇది. అచ్చ తెలుగు ఇంత కష్టమా అనిపించక తప్పదు. ఓ గోవిందనాంచారీ! మేలుమేలు. ఒకరికిద్దరై నీవు భూదేవి మీ పతికి పెద్దరికముతో సేవచేస్తుంటే మీ ముగ్ధత్వము కొంత మానుకొని పోటీపడి గోవిందరాజస్వామిని సేవిస్తున్నారమ్మా! దేవీ! నీవా దేవునికి సంరంభముతో పాదములొత్తుతుంటే ఆ హడావిడిలో నీకొప్పు జారిపోయింది గదవమ్మా! అతిశయించిన ఆనందంతో స్వామి నీమోము చూచి నవ్వితే, నీకు పెంజెమటలు కుమ్మరించినట్లు పుట్టినవమ్మా! దేవీ! స్వామితో కాస్త ఏకాంతం దక్కగానే, నీవు సరసోక్తులాడుట ప్రారంభించినావు. మరి నీ ధ్యాస ఇటులేనందున నీకొంగు జాఱెగదవమ్మా! చేరువయై ఆతడు తన పాదముతో అదిమినా, నీకుచములేమాత్రము క్రుంగవాయెను గదవమ్మా! గోవిందనాంచారీ! దేవీ! నీవు విడువక పతిని గూడి ఇద్దరూ శేషతల్పముపై పెనవైచి అనురాగముతో కొడుకును కంటివి తల్లీ! అతిశయించిన వేంకటాద్రిపైన దేవుడు కూడా ఈ గోవిందరాజస్వామియే. అందుకే తిరుపతిలో గొడుగుల నీడలో గోవిందనాంచారితో వూరేగుచున్నాడు. స్వామి దీవెనలందుకొనండి.

★ **గోలతనము** – ముగ్ధత్వము ★ **మేకులకే** – పెద్దరికంతో
★ **అంగవించి** – చేరువయై ★ **పాఁపసెజ్జ** – శేషతల్పము





సంఖ్య : 257 సంపుటము : 17 పుట: 150 రాగం : శంకరాభరణం

**43 ఇట్టి గుణవంతురాలు యీ యలమేల్మంగ**
**గుట్టు గలదానికి కోరికె ఫలించును** ॥పల్లవి॥

**వోరుపు గలదానికి వొనరు దొరతనము**
**నేరుపు గలదానికి నిండు సిరులు**
**మేరతో నున్నదానికి మిక్కిలి కీర్తి గలుగు**
**భారీతనముదానికి పరు లెల్లాఁ జుట్టాలే** ॥ఇట్టి॥

**ప్రియము గలదానికి పెనగొను సౌఖ్యములు**
**నయము గలదానికి నమ్ములోకము**
**దయ గలదానికి దైవమైనాఁ దోడౌను**
**నియతి గలదానికి నెఱవేఱుఁ బనులు** ॥ఇట్టి॥

**తగనరైనదానికి తగులై యుండుజయము**
**మొగమోటదానికి మోహించుఁ బతి**
**నిగిడి శ్రీవేంకటేశ నీ కిన్నిటా నీకె గలిగె**
**తగులైనదానికి తప్పదు నీ కరుణ** ॥ఇట్టి॥ **257**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న సరసశృంగార కీర్తనాస్వాదించండి. ఈ అలమేల్మంగ ఇట్టి గుణవంతురాలు గనుకనే లోకమాత అయినది. ఈమె గుట్టు గలిగిన కాంత అయినందున ఈమె కోరికలన్నీ ఫలించినవి. ఈమె ఓరిమి గలది కావున జగదేకపతి పట్టపురాణి అయింది. మంచి నేర్పు కలది కావున ఆమెకు ఐశ్వర్యములన్నియు స్వంతమైనవి. ఆమె హద్దు నతిక్రమించదు కావున గొప్పగ కీర్తించబడినది. భారీతనముతో దానధర్మాలు చేస్తుంది కావున అందరూ ఆమెకు ఆప్త బంధువులే. ఈ దేవి, ప్రేమ గలిగియున్నది గనుక సౌఖ్యములన్నియూ ఈమెకు తోడైనవి. మృదుత్వము కలిగినది కావున లోకమంతా ఈమెను నమ్మింది. గొప్ప దయకలిగిన తరుణి కావున దైవము యెప్పుడూ ఆమెకు తోడు నీడై వుంటాడు. నియమము కలది కావున ఈమె తలచుకొన్న పనులన్నీ నెరవేరుతాయి. ఈదేవి, ఎప్పుడూ న్యాయము తప్పదు కావున జయము ఈమె వెంటే వుంటుంది. ఈ మొగమాటమునకు ముచ్చటపడే శ్రీపతి ఆమె పతియైనాడు. ఓ శ్రీవేంకటేశా! అన్నిటా నీకే కలిగి ఈమె నీకు విడరానిదైనది. అందువలన స్వామి కరుణ ఈమెకు గాక మరెవరికుంటుంది?

★ **మేర**– హద్దు ★ **నయము** – మృదుత్వము

సంఖ్య : 196   సంపుటము : 17   పుట: 115   రాగం : పాడి

**44** **మా కేమి మీ కెట్టున్నా మంచిదే నేఁడు**
**పైకొని మీ వారమై బ్రదికేము నేము** ॥పల్లవి॥

**చెప్పినట్టు సేసేటి చేకొలది మగఁడాయ**
**అప్పుడే సలిగగల ఆల వైతివి**
**చెప్పరానిసంతోసాల చెలు లెల్లాఁ బొగడేరు**
**చిప్పిలఁగ నవ్వవమ్మా సెలవుల నింకను** ॥మాకేమి॥

**కచ్చుపెట్టి నీ కతఁడు కాఁపురము సేసీని**
**యిచ్చకురాలవు తొల్లే యితనికిని**
**వచ్చి వచ్చి చూచేరు వాడవా రెల్లా మిమ్ము**
**ముచ్చట లాడవమ్మా ముదితలతోడను** ॥మాకేమి॥

**దక్కి శ్రీవేంకటేశుఁడు తమ్ముల మిడెను నీకు**
**తక్కక నీ కట్టే మదన మెత్తెను**
**అక్కరతో నీ విభుని అంతలోనే కూడితివి**
**చొక్కుచుఁ బాడవమ్మా సోబానపాటలు** ॥మాకేమి॥ **196**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య దేవి చెలికత్తెవలె ఆమెతో యేమంటున్నారో ఈ సరస కీర్తనలో వినండి. మాకేమిటమా? మీకెట్లున్నా మంచిదే కదా! మా జీవితాలు మీవారమనే తృప్తితో గడిచిపోతే నేడు, మేము కోరుకొనేదేముంటుందమ్మా! దేవీ! నీ మగని సంగతికి వస్తే అతడు నీ మాటను జవదాటడు. నీవాయనతో స్వాతంత్ర్యంగల ఇల్లాలివి. చెప్పలేనన్ని మీ సంతోషాలు చెలులమైన మేము పొగుడుతుంటే ఇక మనసార చిరునవ్వులొలికిస్తూ సుఖించవమ్మా! నీకేమి తక్కువ? దేవీ! కోరిక దీరా నీ పతి నీతో కాపురము చేస్తుంటే, నీవు కృతయుగం నాడే ఆతనికి ఇష్టమైనదానవయ్యావు. ప్రతివాడలో వున్న ముత్తైదువలు, స్త్రీలు ఈ శ్రీనివాసునే స్వంతం చేసికొనిన అందగత్తెను చూద్దామని ప్రతిదినమూ వచ్చి నిన్ను పరామర్శించి ముచ్చటలాడుతారు. మరి నీవా ముదితల నాదరించక తప్పదు కదా! ఇంతలో చీకట్లు పడుతున్నాయని వారు వెడలిపోగా, శ్రీవేంకటేశ్వరుడు నీకే దక్కినవాడై నీకు తాంబూలమందిస్తాడు. నీకు కూడా యేమాత్రం తగ్గని మన్మథ తాపము కలిగినది. నీవిభుని అక్కరతో కూడితివి. ఇక అతిశయించి మంగళగీతములాలపించవమ్మా!

★ **సలిగె** – స్వాతంత్ర్యము ★ **కచ్చువెట్టి** – కోరికదీరా





సంఖ్య : 510   సంపుటము : 17   పుట: 294   రాగం : బౌళి

**45** **ఆదిమలక్ష్మి యతనికిఁ గలుగఁగ**
**యీదెస సంపద లిఁక నేమి చెప్పేదమ్మా** ॥పల్లవి॥

**నెలఁత నీ తురు మిది నిండు నీలపుగని**
**పలచని నీ మేను పసిఁడిగని**
**మొలక నీ కనుచూపు ముత్యపురాసులగని**
**యెలమి నీ పతి కింక నేమి గడమమ్మా** ॥ఆది॥

**వనిత నీ దంతములు వజ్రాలపుట్లుగని**
**నినుపు నీ గోళ్ళు మాణికపుగని**
**పెనపు ననీ  కుచములు పెన్నిధానములగని**
**యెనయు నీ పతి కింక నేమి భాగ్యమమ్మా** ॥ఆది॥

**అతివ నీ కెమ్మోవి అదె పగడాలగని**
**రతి నీ కౌఁగిలి పెద్ద రసముగని**
**యితవైన శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ గలసె**
**అతనిరాజస మెల్లా నమరెఁ గదమ్మా** ॥ఆది॥ **510**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ మధురకీర్తన నాలకించండి. అన్నమయ్యకు దీటైన కీర్తన. మరి సింహం కడుపున సింహమే పుడుతుంది. ఆదిలక్ష్మి ఈ దేవుని దేవేరి అయినందువల్ల స్వామి ఎన్ని“గనులకు” యజమాని అయ్యాడో వినండి. ఈ ఆదిలక్ష్మిని పొందుటచేత ఎన్ని సంపదలు ఈ స్వామికి కలిగినవో ఏమి చెప్పేదమమ్మా? ఓ నెలత! నీ యొక్క కొప్పు వున్నదే అది నీలపు గని వలె నల్లని కాంతులను విరజిమ్ముతున్నది. ఇక నీ శరీరం బంగారు వన్నెలో మెఱసిపోతూ పసిడిగనివలెనున్నది. తెల్లని, నీ కనులు ముత్యాల రాసుల గనివలె నున్నవి. తల్లీ! ఇక నీ మగనికి లోటేమి కలదమ్మా? ఓ వనితా! నీ దంతములు ధగధగ మెఱయు వజ్రాలగనిని తలపించుచున్నవి. సమృద్ధముగానున్న నీ గోళ్ళు మాణిక్యముల గనివలె నున్నవి. నీ ఎదిరించుకుచములు పెన్నిధానములగని అనిపించుచున్నది. మరి నీ పతి భాగ్యవంతుడు కాక మరేమౌతాడు తల్లీ! ఓ అతివా! నీ అరుణమైన అధరము పగడములగనివలెనున్నది. రతిలో నీ కౌగిలి పెద్ద రతనము గని. హితుడైన శ్రీవేంకటేశ్వరుడు నిన్ను కూడుటచేత అతనికి ఈ గనులన్నిటి అధిపతియై యెనలేని రాజసము అబ్బినదమ్మా!

★ **నినుపు** – సమృద్ధమైన ★ **పెనపు** – ఎదిరించు

సంఖ్య : 316  సంపుటము : 17  పుట: 183  రాగం : లలిత

**46** **అదె వంటశాలలోన అలమేలుమంగనాంచా**
**రెదుట శ్రీవేంకటేశు కితవైనయట్లు** ॥పల్లవి॥

**వెండిపైఁడిచట్లలో వేరె వేరె కూర లెల్ల**
**వండించి దొంతివెట్టించి వద్దనుండి**
**కొండలపొడవుగాఁగ కోటిబోనా లపరంజి**
**కుండలఁ గుమ్మరింపించి కొలువై కూచుండీ** ॥అదె॥

**పానకాలు శిఖరులు పటికంపుఁ గొప్పెరల**
**పూని వాసనలుగాఁగ పువ్వు గట్టించి**
**వానినే నీలపుఁజట్టువములనే నించి నించి**
**ఆనించుకొని వడ్డించ నాయత్తపడీని** ॥అదె॥

**అందెలు గల్లు రనఁగా నడుగులు పెట్టిపెట్టి**
**విందు లలమేలుమంగ వేళ వేళను**
**చెంది శ్రీవేంకటపతికి చేతులకుఁ గడిగడి**
**అందియిచ్చి సొత్తునఁ డా నారగించి నదివో** ॥అదె॥**316**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న ఈ చక్కని సరకీర్తనలో దేవి అలమేల్మంగ వంటశాలలో తయారుచేసిన వేడివేడి వంటకాలలోంచి తిరుమలేశునికిష్టమైన కూరలు, రుచికరమైన భోజనాలు, పానకాలు స్వామిచేతికి అందిస్తూ కలిసి భుజించిందట. చదివి మీరూ ఆనందించండి. దేవి అలమేల్మంగనాంచారి, అదే వంటశాలలో పతి శ్రీవేంకటేశ్వరు యెదుట కూర్చొని ఆయనకు హితవైనయట్లు వడ్డించిందట. బంగారు, వెండి గిన్నెలలో రకరకాల కూరలు తెచ్చి దొంతరగా పెట్టించి ఒకదానివెనుక ఇంకొకటి వడ్డించింది. రకరకములైన చిత్రాన్నములను స్వామి ఏడుకొండలు పొడుగ్గా వరుసగా వున్నట్లు వడ్డించింది. బంగారు కుండలలో కుమ్మరించి, కొలువై కూర్చొని వడ్డించింది. పెద్దపెద్ద పాత్రలలో పటికబెల్లపు శిఖరాలుగా పోసి మంచినీటితో కలిపి చక్కని పానకాలు చేశారు. సువాసనకోసం కొంత కుంకుమపువ్వు కలిపి నీలములతో చేసిన గరిటెలలో నించి స్వామికి ఆనుకొని కూర్చొని వడ్డించిందట. దేవి కాలిఅందియలు ఘల్లుమని ధ్వనిస్తుంటే చిన్న చిన్న అడుగులుపెట్టుకొంటూ అలమేల్మంగమ్మ సరియైన వేళకు శ్రీవేంకటేశునికి వడ్డించింది. స్వయంగా ఆయన చేతులకు అందించి ఇచ్చింది. ఆయన పొత్తుననే తానూ కూర్చొని, అదిగో దేవికూడా ఆరగించింది.

★ **చట్టువము** – గరిటె ★ **చట్ట** – నోరువెడల్పుగల గిన్నె
★ **పువ్వుగట్టించి** – సువాసన గల కుంకుమపువ్వు గట్టించి





సంఖ్య : 166  సంపుటము : 17  పుట: 98  రాగం : రామక్రియ

**47** **ఇదివో నీ వొళ్లమేలు యింకా నేమి వున్నదో**
**యెదుట నిలుచుండితే నే మేమి సేతువో** ॥పల్లవి॥

**చక్కనివాఁడ వంటేను జాణతనా లాడేవు**
**ఇక్కువ లంటితేను యేమేమి సేతువో**
**మొక్కలీఁడ వంటేనే మోవితేనె లడిగేవు**
**అక్కరతోఁ బొగడితే నపు డెంత సేతువో** ॥ఇదివో॥

**నేరుపరి వంటేను నీటు లెల్లాఁ జూపేవు**
**గోరఁ జీరితే నెంత కొండ సేతువో**
**ఆరయ నాఱడికాఁడ వంటేనే పెనఁగేవు**
**సారె చన్నుల నొత్తితే చల మెంత సేతువో** ॥ఇదివో॥

**చెలిమికాఁడ వంటేనే చేయి మీఁద వేసేవు**
**కలిసితే నీ వెంత కరఁగుదువో**
**యెలమి శ్రీవేంకటేశ యిందుండే నన్నుఁ గూడితి**
**అలమి పెనఁగితే ని న్నపు డెంత సేతువో** ॥ఇదివో॥**166**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో నాయిక తిరుమలేశుని దెప్పుతున్నది. ఇదిగో స్వామీ! ఇంకా నీవల్ల నాకు యెంత గొప్ప "మేలు" జరుగబోతున్నదో చెప్పలేను కానీ, నీయెదుట నిలుచునివుంటే ఇంకా యేమేమి చేస్తావోనని బెంగ పట్టుకొన్నదయ్యా! దేవా! నీవు చక్కనివాడవని కాస్త పొగిడానో లేదో నీ జాణతనమంతా చూపించావు. ఇక నిను నా ఒళ్ళంతా తాకనిస్తే యేమేమి చేస్తావో? నీవు ధైర్యం, దిట్టతనం వున్న మొక్కలీడువన్నానో లేదో నా అధరామృతం కావాలంటావు. నేను నీవల్ల మేలు పొందాలని కాస్త పొగిడానంటే, మరి అపుడేమి చేస్తావోనని బెంగగా వున్నది. ప్రభూ! నీవు నేర్పరివని పొగిడానో, లేదో నీ శృంగార రసికత్వము జూపేవు. ఇక చిలిపిగా నఖక్షతాలు చేస్తే నామీద యెన్ని కొండెములు చెబుతావో! మాటమీద మాటవచ్చి ఆరడిపెట్టెదవన్నానో లేదో యెంత యాగీ చేశావు. ఇక నా అంతట నేను చిలిపిగా కుచములతో నొక్కితే యెంత పట్టుదల చూపిస్తావో!! దేవా! నీవు చెలిమికాడవన్నానో లేదో, మీద చేయి వేసేశావు. ఇక నీతో కలయికకు వొప్పుకొంటే, యెంత పరవశించిపోతావో కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఇక్కడే నన్ను కూడితివి. ఇక నేనూ చెలరేగితే ఇక "తమరు" నన్నేమి చేస్తారో!!

★ **నీటుతనము** – శృంగారహేల ★ **చలము** – పట్టుదల

సంఖ్య : 461   సంపుటము : 17   పుట: 283   రాగం : సామంతం

**48** నిన్నుఁ జూచి వెంగేలు నే నాడఁజుమ్మీ
విన్న కన్న మాటలకే వేరొకతె యాడేను ॥పల్లవి॥

పన్నీట మజ్జనమాడి పైపై తడిసూ ళ్ళొత్తి
వున్నతి నీవు నిలుచుండఁగాఁ జూచి
మున్నే నీ వెవ్వతెనో ముట్టుదానిఁ బొందివచ్చి
విన్నాణాలు చూపేవంటా వేరొకతె నవ్వెను ॥నిన్ను॥

కప్పురధూళిమేన కడు నిండా మెత్తుకొని
చిప్పిలఁ దెల్లనిరూపై చెలువొందఁగా
చొప్పున వెన్నముచ్చిమి సోకె నిట్టె మచ్చెమంటా
విప్పుచు నీ కొంగు వట్టి వేరొకతె దీసెను ॥నిన్ను॥

వొట్టుక పుణుగు పూసి వురాన నలమేల్మంగ
గట్టుక శ్రీవేంకటేశ కడు మించఁగా
యిట్టె చీకటితప్పు సే సిటు నల్లవైతి వంటా
వెట్టికి నీ నా పొందులు వేరొకతె మెచ్చెను ॥నిన్ను॥ **491**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య పాడిన ఈ శృంగార కీర్తనలో నాయిక కొంచెం కటువుగానే స్వామితో యేమంటున్నదో ఆలకించండి. ప్రభూ! నిన్ను చూచి యెకెసక్కెముగా మాట్లాడే కుసంస్కారిని కాను, సుమా! నేను చూచిన, వినిన మాటలే యెవత్తోకాని ఇంకొకతె చెప్పిన మాటలే కాని ఇందులో నా స్వంత ఆలోచనలేమీ లేవు. స్వామీ! నీవు పన్నీట స్నానమాచరించి తడి ఒళ్ళు తుడుచుకొంటూ లోపలికి వస్తుంటే ఔన్నత్యంతో నీవు నిలుచుండిపోతే ఆ వెంగేలాడే ఆడది యేమన్నదో తెలుసా? ఇంతకు ముందే నీవెవ్వతెనో ముట్టుదానిని తాకినావని, అందుకే స్నానం చేసేవని ఇక్కడ విన్నాణాలు (నేర్పు) చూపిస్తున్నావని మరొకతె నవ్వింది. దీనికేమంటావు? స్వామీ! నీవు కర్పూరధూళి నీ శరీరంపై మెత్తుకుంటే వోర్వలేని వొకతెయేమన్నదో విన్నావా? ఇదిగో తెల్లగా మెఱిసిపోతున్నది కర్పూరధూళికాదు. ఈయనకు వెన్నదొంగిలించి తినే అలవాటు ఇంకా పోనట్లుంది. అదిగో ఒంటిమీద వెన్న గుర్తులు చూడండి కావాలంటే... అన్నది. మరి యేమాయ చేసిందోకాని నీకొంగుముడి విప్పి వెన్న బయటకు తీసింది. దేవా! ఒంటిపై పునుగుజవ్వాది మెత్తుకొని అలమేల్మంగను వురమునదాల్చిన శ్రీవేంకటేశ్వరుడవై నీవుంటే ఈయన కూడా యెన్ని చీకటి తప్పులు చేశాడో ఒళ్ళంతా చీకటిలా నల్లబడింది అని వెంగేలాడిందయ్యా! నీ, నా పొందులు ఈ చుప్పనాతి సహించలేకపోతేనేమి. నీ దేవేరిని నమ్మిన దానను నాకేమి బెంగ?

★ **చీకటితప్పు** – రతిక్రీడ ★ **చొప్పున** – విధమున





సంఖ్య : 463   సంపుటము : 17   పుట: 284   రాగం : దేసాళం

**49** ఏమని తలఁతమమ్మ నింకా నీదేవుని
ఆముకొన్న పరబ్రహ్మమై వున్నవాఁడు ॥పల్లవి॥

నెప్పున నీళ్ళతోడి నీలమేఘమై వున్నాఁడు
చప్పుడుగాక పన్నీట జలకమాడి
కప్పురపుమాఁకువలె కడు మించివున్నవాఁడు
ముప్పిరిఁ బచ్చకర్పూరమునఁ దొప్పఁదోఁగీ ॥ఏమని॥

తట్టుపుణుఁగుభరణి తానైన ట్టున్నవాఁడు
గట్టిగాఁ బుణుఁగు మేనఁ గడు నించుకా
పెట్టినసొమ్ములతోడి పెట్టెవలె నున్నవాఁడు
వొట్టుకొన్న భూషణాలు వొడలెల్లా నిండఁగా ॥ఏమని॥

కళలతో లక్ష్మీకాంతుఁడై వున్నవాఁడు
అలమేలుమంగ వురమందు నుండఁగా
యెలమి శ్రీవేంకటేశుఁ డేలికై తా నున్నవాఁడు
నలువంక సర్వలోకనాయకుఁడు గనక ॥ఏమని॥ **493**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య వినిపించిన ఈ కీర్తన శృంగార ఛాయలేని భక్తి కీర్తన. నిమజ్జనానంతర సేవలతో భక్త కోటిని తరింపజేస్తున్నాడు శ్రీవేంకటేశ్వరుడు. శ్రీదేవికి వినిపిస్తున్నారు. ఇంకా నీ దేవుని యెంతని కీర్తింతుమమ్మా! అవతరించిన అధికుడైన పరబ్రహ్మస్వరూపుడుయై వున్నాడమ్మా ఇతగాడు. తల్లీ! నీ భర్త నీలమేఘశ్యాముడు యెందుకయ్యాడంటే తన నివాసం ఎప్పుడూ జలధినీటిలోనే కదా! అట్టి దేవుని సున్నితంగా పన్నీట జలకమాడించినారు. కర్పూరం చెట్టువలె యెత్తుగానున్న దేవునికి ముంచుకొనిన పచ్చకర్పూరంలో తొప్పదోగినాడు. ఈస్వామి యెంత సువాసనలు వెదజల్లుతున్నాడంటే, తట్టు పుణుగు భరిణ తానా యేమి అనినట్లున్నాడు. ఎందుకంటే అంతగా పునుగు స్వామి వంటిపై నింపినారు. ఇక అనేకమైన ఆభరణముల పెట్టెవలెనున్నాడు. ఎందుకంటే స్వామి చిత్రవిచిత్రమైన ఆభరణములను నిండుగా ధరించినాడు. ఈ స్వామి కళాపూర్ణుడై లక్ష్మీకాంతుడైనాడు. అందుకనే ఆదిలక్ష్మియైన అలమేల్మంగ ఆయన ఉరముపైనున్నది. ఈ శ్రీవేంకటేశ్వరుడు లోకములన్నిటికీ యేలికయై వున్నాడు. ఎందుకంటే నాలుగుదిక్కులకూ యేలికయైన సర్వలోక నాయకుడు కదా!

★ **తొప్పదోగినాడు**– మిక్కిలి నిండిపోయాడు ★ **నలువంకా** – నాలుగు దిక్కులా
★ **ఆముకొన్న** – అధికమైన

సంఖ్య : 470   సంపుటము : 17   పుట: 271   రాగం : సాళంగనాట

**50 మాయామానుషమహిమ యిది**
**యేయెడ నీతఁడె యీశ్వరుఁడు** ॥పల్లవి॥

**మొదల యశోదకు ముద్దులబాలుఁడు**
**అదె మునులకుఁ బరమాత్ముఁడు**
**మది గోపికలకు మన్మథమన్మథుఁ-**
**డెదుటనె తిరిగీ నీశ్వరుఁడు** ॥మాయా॥

**గోపబాలులకు గొల్లఁడు నాఁడే**
**చేపట్టెను లక్ష్మికి మగఁడు**
**కోపపుటసురలకు మృత్యు వీతఁడు**
**యేపున మెఱసీ నీశ్వరుడు** ॥మాయా॥

**పాండవులకుఁ దా బావయు మఱఁదియు**
**వొండొకవసుదేవునికొడుకు**
**అండనె శ్రీవేంకటాద్రికిఁ గృష్ణుఁడు**
**యిందుల ముంగిళ్ళ నీశ్వరుఁడు** ॥మాయా॥ **470**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న శ్రీకృష్ణామృతాన్ని తనివితీర గ్రోలండి. ఈ అవతారము మాయామానుష మహిమను చూపిన అవతారము. ఏవిధంగా చూచినా ఈతడు ఈశ్వరుడు కాక మరెవ్వరు? యశోద దృష్టిలో ఈయన ముద్దులొలికే బాలుడు. అదే మునీశ్వరులపాలిట పరబ్రహ్మమూ ఈతడే. మరులుగొన్న గోపికలకు మన్మథుని మించిన మన్మథుడు. మరి భక్త కోటికి యెదుటనే తిరుగాడిన ఈశ్వరుడు. రేపల్లెలోని గోపబాలురకు తమతో ఆటలాడిన గొల్లపిల్లవాడు. లక్ష్మీదేవి అవతారమైన రుక్మిణిని చేపట్టిన వుద్దండుడు. కోపముతో తననే చంపవచ్చిన తృణావర్తునివంటి అసురులపాలిట మృత్యువు ఇతడే. అదృష్టవంతులైన పుణ్యాత్ములకు ముక్తినొసగిన ఈశ్వరుడు ఇతడే. పాండవులలో తనకంటె చిన్నవారికి బావ, తనకంటె పెద్దవారికి మరిది ఈతడే. వసుదేవునికి కన్నకొడుకు, ఈ శ్రీవేంకటాద్రిపై వెలసిన కృష్ణుడు, ఈ దేవదేవుడే. భక్తకోటి ఇండ్లముందు తిరుగాడే ఈశ్వరుడు ఇతగాడే.

★ **ఒండొక** – ఒకానొక ★ **ఏపున** – విజృంభణముతో





సంఖ్య : 359   సంపుటము : 17   పుట: 208   రాగం : శంకరాభరణం

**51 పట్టినదే చలము యీపడఁతి యిదే నోఁచెనో**
**వొట్టిచెలుల మే మన్నా వూఁకొనదో రమణి** ॥పల్లవి॥

**చెక్కుచేయి యీ సతి చింతకే కాచుకుండెనో**
**తెక్కుల నెంత దీమన్నాఁ దియ్య దిది**
**చిక్కనిమోము నవ్వులు సిగ్గుకే కాచుకుండెనో**
**యెక్కువఁ దలెత్తుమంటె నెత్తదు యీ చెలియ** ॥పట్టి॥

**రమణివిరహము వెఱగుకే కాచుకుండెనో**
**తెమలి యెంత దెల్పినాఁ దెలియదు**
**చిముదువలపు లింతిచెమటకే కాచుకుండెనో**
**తమ నెంత విసరినా తనువున నింకవు** ॥పట్టి॥

**వెలదివూర్పులు రతివేళకే కాచుకుండెనో**
**వలదని మానిపినా వసముగాదు**
**యెలమి శ్రీవేంకటేశుఁ డింత సేసి కాంతఁ గూడె**
**తలఁపు లిద్దరికిని తమకించెనో** ॥పట్టి॥ **359**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన దేవి కీర్తననాస్వాదించండి. కొంచెం శ్రమపడితేగాని అర్థంకాదనిపించే కీర్తన ఇది. ఈ పడతికి పట్టినదే పంతము. ఈమె యేమి నోచినదోకాని, మనము సామాన్యమైన చెలికత్తెలము. ఈ రమణి తననిగాని తన భర్తనుగాని పల్లెత్తుమాటంటే వూరకుండదు, జాగ్రత్త. ఈ చెలియ, చెక్కిలి మీద చేతిని పెట్టుకొని దిగులుగా నిరీక్షిస్తున్నది. జవ్వని అట్లుండరాదు అని చెప్పినా వినదు. ఆమె మోమున నవ్వులు వస్తున్నా సిగ్గు ఆ నవ్వులను దాచివేయుచున్నది. ఈ రమణి విరహము గొప్ప ఆశ్చర్యమును కలిగించుచున్నది. దానిని ఆమె వివరించలేకున్నది. బాగా వుడికిపోతున్న వలపుల వలన ఈమెకు అధికముగా చెమట పట్టినది. చెలికత్తెలమైన మేము యెంత విసరినా ప్రయోజనం కలుగుటలేదు. ఈ వెలది దీర్ఘంగా నిట్టూరుస్తూ రతి వేళకే కాచుకొనియున్నది. వలదు, అంత నిరీక్షణ ప్రశాంతతను భంగపరుస్తుందని చెప్పినా వినదు. అతిశయించిన శ్రీవేంకటేశ్వరుడు ఇంత చేసిన వెనుక ఈ కాంతను కూడినాడు. అంతేకాదు వారి కూటమి గురించిన తలపే ఆ ఇద్దరినీ మోహమున పరవశింపజేసినది.

★ **చిముదు** – బాగుగా ఉడుకు ★ **తమకించె** – మోహపరచెను

సంఖ్య : 361 సంపుటము : 17 పుట: 209 రాగం : తెలుగుకాంబోది

**52 ఏమిటఁ దక్కువ నాకు యెదలోనిభావరతి**
**కామించి మేను మేను గలయదు గాని** ‖పల్లవి‖

**తలఁపు లోపల నుండు దగ్గరి నీ రూపమ**
**పిలిచితేఁ బలుకని వెలితే కాని**
**కలసినట్ల నుండు కలలోన నీరతి**
**తెలిసినప్పుడు గుండె దిగులొందుఁ గాని** ‖ఏమిట‖

**మాటలాడిన ట్లుండు మరిగి నీపై తమి**
**గాటమై వినరాని దొక్కటే కాని**
**వాటినట్లనే వుండు నవ్వుల నీచూపు నాపై**
**జూటరి నీ కిదే చెప్పి చూపరాదు గాని** ‖ఏమిట‖

**నిద్దిరించిన ట్లుండు నీ కౌఁగిటిలోనిసొంపు**
**పొద్దుగుంకుఁ బొడపులు వోదు గాని**
**వొద్దనే శ్రీవేంకటేశ వొక్క టైతి వింతలోనే**
**పెద్దరికమే నాకు పెనగొనీఁ గాని** ‖ఏమిట‖ **361**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య వినిపించిన ఈ సరస శృంగార కీర్తనలో తిరుమలేశుని వలచిన చిన్నదాని మనో భావాలను వివరిస్తున్నారు. ఆమె యేమంటున్నదో వినండి. స్వామీ! నాకు ఏమి తక్కువైనది? నా యెదలోని భావనలలో నీవు నన్ను రమిస్తున్నట్లే వుంటుంది. కామించుకొని మన తనువు లొక్కటి కాకపోయినా, నాకు యేదిగులూ లేదు. ఎందుకంటే యెదలోని నా భావరతి చాలు నాకు. ప్రభూ! నా తలపుల్లో యెప్పుడూ నీరూపు నిలిచివుంటుంది. కాకపోతే నేను పిలిస్తే అది పలుకదన్న లోటొక్కటే వుంటుంది. కలలో నీరతి నన్నెంత మురిపిస్తుందో నీకెలా వివరించను? కాకపోతే స్పృహతెలిసినప్పుడు నా గుండె దిగులొందుతూనే వుంటుంది. ప్రభూ! నీపై ఆసక్తి అధికమైనందువల్ల కాబోలు, నాకు నీవు నాతో మాటలాడుతున్నట్లే వుంటుంది. కాకపోతే ఆ మాటలు నాకు తప్ప మరెవ్వరికీ వినరావు. నిరంతరం నీ చూపుల తూపులు నాపై నాటుకొనినట్లే వుండును. నవ్వుతూ చూచే నీవు మోసకారివేమో అనే వేదన నీకు చెప్పనూ లేను, నిరూపించనూలేను. స్వామీ! నేను సొంపుగా నీ కౌగిట నిదురించినట్లే వుంటుంది. కానీ ప్రొద్దు గుంకుతూనే వుంటుంది, పొద్దు పొడుస్తూనే వుంటుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నావద్దనే చేరి ఇంతలోనే ఒక్కటైతివి. పెద్దరికము చూపాలి నీ మన్నన పొందాలని అలా చేయలేకపోతున్నాను.

★ **పొడపులు** – పొడచుటలు ★ **జూటరి** – మోసగాడు





సంఖ్య : 529 సంపుటము : 17 పుట: 305 రాగం : శంకరాభరణం

**53 చేతు లెత్తి మొక్కరమ్మ చేరి యార తెత్తరమ్మ**
**యేతులే బూమెల్లా నిండె నీ దేవదేవునికి** ‖పల్లవి‖

**తతిగొని పన్నీటిధారలు పై నించి నించి**
**సతముగాఁ బెద్దలు మజ్జన మార్చఁగా**
**అతివలచనుఁగొండ లంగము లొత్తినందుకు**
**యితవులై తోఁచె నేఁడు యిందిరాపతికి** ‖చేతు‖

**కప్పురపుధూళి మేనఁ గలయఁగ గంపెఁడేసి**
**నెప్పున సందుసందుల నిగిడించఁగా**
**చొప్పులెత్తి గొల్లెతల చూపులు దాఁకినీ కుమ్మె-**
**లప్పు దన్నియునుఁ గప్పినందువల్ల హరికి** ‖చేతు‖

**తట్టుపుణుఁ గలఁది యందపు టలమేలుమంగ**
**నట్టే వురముమీఁద నమరించఁగా**
**నెట్టనఁ బచ్చిసేసిననెలఁతల చేఁతలలో**
**చిట్టకము లెల్లాఁగప్పె శ్రీవేంకటపతికి** ‖చేతు‖ **529**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన మంగళహారతి కీర్తనతో ఈ సంపుటి– 1, ముగింపు జరగటం తిరుమలేశుని కృపకాక మరేమిటి? తాళ్ళపాక కవులు యెన్ని "మజ్జన" (నిమజ్జనం) కీర్తనలు చెప్పారో మన ఊహకందదు. ఓ భామినులారా! ఈ దేవదేవునికి చేతులెత్తి మొక్కండమ్మా! చేరి మంగళహారతులెలుగెత్తి ఆలపించండమ్మా! ఈ స్వామికి భూమిపైన యేతులే నిండెను (ఉద్ధతి వెల్లివిరియుచున్నది). పెద్దవారైన అర్చకులు, స్వామికి ఆసక్తితో పన్నీటిధారలలో నింపి, నింపి మజ్జన జరిపినారు. తదనంతరం, ఆ భామినులు తమచనుగొండలను చిలిపిగ తాకించుతూ ఆయన వొళ్ళంతా తడిలేకుండా తుడిచారు. రసికుడైన ఇందిరాపతికి, నేడు ఇదే హితవుగా తోచింది. ఓ అతివలారా! గంపలతో కర్పూర ధూళి తెచ్చి సందులేకుండ స్వామి వొళ్ళంతా బాగా వ్యాపించునట్లు అద్దండి. ఎందుకంటే ఆనాడు రేపల్లె గొల్లెతల చూపులు యెక్కడెక్కడ పడ్డాయో? స్వామి వొంటిపై యెన్ని దంతక్షతాలూ, నఖక్షతాలూ చేశారో యెవరికి తెలుసు? అందుకని హరికి వొళ్ళంతా కర్పూరధూళి మెత్తండి. అందమైన అలమేల్మంగమ్మ ఈ స్వామి వురముపై తట్టుపుణుగు సమృద్ధిగా అద్ది, ఆపైన చక్కగా స్వామి వురమెక్కి కూర్చొన్నది. మరి నేడు శ్రీవేంకటేశ్వరుని సేవించుచున్న నెలతలు స్వామిని ఆరడిచేష్టలతో, శృంగారహేలతో తమ చేతులతో స్వామిని, కప్పివేశారు.

★ **చొప్పులెత్తి** – తగినట్లుగా ★ **నిగిడించి** – వ్యాపింపజేసి
★ **చిట్టకము** – శృంగారహేల ★ **పచ్చిసేతలు** – ఆరడి చేష్టలు

రచయిత:

# అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు



| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | ఎం.టెక్. |
| ఉండేది | : | ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,<br>సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్. |
| రంధి | : | భగవన్నామ సంకీర్తన |
| నచ్చింది | : | శాస్త్రీయ సంగీతం |
| నచ్చంది | : | నక్కజిత్తులు |
| మెచ్చింది | : | సజ్జన సాంగత్యం |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |







## అంకితము

## మా తండ్రి, తాత, ముత్తాతలు, భార్యాసమేతులుగా
## శ్రీపతి పాదపద్మాలు పొందెదరు గాక



సీ॥ ప్రపితామహుడు నాకు పరగె మృత్యుంజయ
సోమయాజులుగారు చొక్కముక్తి
దివికి సుబ్రహ్మణ్య దీక్షితులుంగారు
మా తాత వడిజేరె మహిని వీడి
చదివించు గతిలేక సంతబేహారియై
రామకృష్ణుడు తండ్రి లక్షలెన్నె
ఎంటెక్కు చదివియు ఇంకొక వ్యాపారి-
గామారి గడియించి కంటికీర్తి

ఆ.వె॥ రోగమొచ్చి బ్రతుకు రోతయై కుందితిన్
వేంకటేశుడేలె పెన్నిధాయె
కవితవ్రాయ నేర్పె ఘనమైన యీకృతి
అంకితమ్ము పెద్దలందరికిని.





(సంపుటి - II)



# హరి సేవకే వేంకటేశ మకుటం

ఇది

అన్నమయ్య, పెదతిరుమలయ్య, చిన తిరుమలయ్య
సంకీర్తనలకు అమరవాది భావపరిమళం

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



# హరి సేవకే వేంకటేశ మకుటం

## అన్నమయ్య, పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య సంకీర్తనలకు

# భావ పరిమళం

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech.





**హరి సేవకే వేంకటేశ మకుటం**

(సంపుటి - I)

మొదటి ప్రచురణ

**ఏప్రిల్ 2014**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

**కె.వి.ఆర్.**

98495 79345

సీ॥ హరిసేవకే వేంకటాధిపు మకుటమ్ము
చేబూనికైతలు చెప్పినారు
అన్నమయ్య, అతనికాప్తుడౌ మనుమండు,
సుతుడు అదేబాట జొచ్చినారు
తాళ్ళపాక కవులు తరియించుటే కాదు,
మనబోంట్లకును ముక్తి మార్గమదిరి
కొడుకులన్నను తండ్రి కోర్కె దీర్చెడివారె
కొరివిబెట్టుటకేమి కొయ్యచాలు

ఆ.వె॥ అచ్చతెనుగు కవిత అవగతమగుటకు
నేటితరమువారి నేర్పు మితము
భావపరిమళంబు భక్తితో జెప్పితిన్
దిక్కునాకు నీవె తిరుమలేశ!

తరళము :
తరతరాలుగ శ్రీనివాసుని తాతతండ్రులు మన్మడున్
కొలుచుటే అపురూపమందురు కార్యదీక్షగ కైతలన్
విలువతగ్గక కీర్తనంబులు వేంకటామకుటంబుతో
చెలువమెప్పగ చెప్పిరందుకె చేరి బొందిరి మోక్షమున్.

కం॥ హరిసేవకె యీ దేహము
హరిజేరని జన్మయేల అది వ్యర్థమురా
హరిజెప్పని చదువెందుకు?
హరిగొల్వని చేతులేల హత్యలకొరకా?

మ॥ ఇదియే చక్కటి బాటరా కొలువనై ఈశున్ జగన్మోహనున్
పదిలంబైనది పెద్దలెందరొ ఇదే బాటంది వైకుంఠమున్
ముదమొప్పన్ గడియించిరయ్య వినుడీ ముద్దార నాకున్ హరే
అదిగో ఈ మకుటంబెరక్షయనుచున్ అందింతు మీకీ కృతిన్.





# హరి సేవకే వేంకటేశ మకుటం
(సంపుటి - II)
అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య సంకీర్తనలకు
భావ పరిమళం

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అంతరంగములోనున్నహరియే | 15/382 (పె.అ) | 33 |
| 2. | అందరు వికారమందుదురె | 10/44 (చి.అ) | 51 |
| 3. | అనుచులోకములెల్లనదె జయవెట్టేరు | 2/111 | 3 |
| 4. | అనుమానపు బ్రతుకదిరోతా | 1/26 | 5 |
| 5. | అన్నిటికి మూలము శ్రీహరి | 15/295 (పె.అ) | 23 |
| 6. | ఇందరునేలదూరేరు హితవే | 10/40 (చి.అ) | 38 |
| 7. | ఇందుకుధ్రువాదులిటుసాక్షి | 4/410 | 17 |
| 8. | ఇందుకేది వుపాయమో | 4/150 | 21 |
| 9. | ఇందునందు నెంచభేదమెంతైన | 15/153 (పె.అ) | 36 |
| 10. | ఇటువంటివారలనెట్టు | 15/378 (పె.అ) | 26 |
| 11. | ఇట్టివాడవు సులభమెట్లా | 2/311 | 22 |
| 12. | ఇవి నమ్మి గర్వించనేమిటికి | 15/306 (పె.అ) | 25 |
| 13. | ఈతనికెదురులేరు యెక్కడా | 15/156 (పె.అ) | 32 |
| 14. | ఎంతలేదిది యెంచిన | 10/10 (పె.అ) | 39 |
| 15. | ఎటులబుట్టించితోనీవె | 10/45 (పె.అ) | 50 |
| 16. | ఎవ్వరికియెవ్వరయ్యేరు | 2/304 | 10 |
| 17. | ఏమిసేయుదుము నింక | 2/11 | 14 |
| 18. | ఐనదేది కానిదందులోనేది | 10/27 (చి.అ) | 45 |
| 19. | ఓపికగలవారికి వొడినుండు | 15/195 (పె.అ) | 35 |
| 20. | కన్నవిన్నవారెల్లా కాకుసేయరా | 3/90 | 6 |
| 21. | కామక్రోధవికారజలధికి | 15/458 (పె.అ) | 24 |
| 22. | కాయపండుసేయబోతే | 15/127 (పె.అ) | 34 |

| | | |
|---|---|---|
| 23. కావగనీకేపోదు కరుణానిధివిగాన | 4/379 | 12 |
| 24. కొలువైతానల్లవాడే | 4/163 | 9 |
| 25. కొసరి కొసరియిక గోరగ | 4/15 | 16 |
| 26. ఘనసంసారులకెల్ల కర్మమై | 15/210 (పె.అ) | 37 |
| 27. ఘనసుఖము జీవుడెఱగడు | 15/463 (పె.అ) | 31 |
| 28. గాడిదెపిల్ల కోమలికమే | 10/60 (చి.అ) | 41 |
| 29. జ్ఞానంబొకటే జగమున | 4/231 | 19 |
| 30. చలమే చెల్లించుకొన్న | 10/27 (చి.అ) | 46 |
| 31. చెప్పేనామాటవినుచిత్తము | 10/12 (చి.అ) | 42 |
| 32. జగతివైశాఖశుద్ధచతుర్దశి | 4/285 | 4 |
| 33. జగదీశ్వరుని లీలాచక్రము | 10/47 (చి.తి) | 48 |
| 34. తాళ్ళపాక అన్నమాచార్యదైవమవు | 10/37 (చి.అ) | 52 |
| 35. తోటకూరగొంగలాల | 10/53 (చి.అ) | 44 |
| 36. దైవము చేసినసేత తప్పించ | 15/360 (పె.అ) | 30 |
| 37. నమ్మినదొకటేనాకు నీ శరణ్యము | 2/74 | 11 |
| 38. నాటికినాడు గొత్త నేటికి నేడు గొత్త | 2/85 | 18 |
| 39. నానా మహిమల శ్రీనారసింహము | 15/119 (పె.అ) | 27 |
| 40. నీవుగలిగిన జూలు నిక్కము | 10/46 (చి.అ) | 49 |
| 41. ప్రయాసపడవద్దు బయలువెదక | 15/324 (పె.అ) | 29 |
| 42. బ్రహ్మగన్నవాడు పసిబిడ్డ | 10/11 (చి.అ) | 43 |
| 43. మహినింతటివారువో మనవారు | 1/462 | 2 |
| 44. మాకునేమీ బనిగాదు మరి | 4/245 | 1 |
| 45. మునులాల జనులాల ముంచిన | 15/192 (పె.అ) | 28 |
| 46. మెచ్చుల దంపతులాల మీరే | 3/438 | 15 |
| 47. మేలేమి కీడేమి మించిన | 10/48 (చి.అ) | 47 |
| 48. వాసుదేవ నీవు నెలవరివి | 4/145 | 20 |
| 49. విచారించుకొనేవారు | 4/30 | 13 |
| 50. సులభుడీతడిదివో | 4/275 | 7 |
| 51. హరికి లంకిణీహంతకంతరమిట్టిది | 4/145 | 8 |
| 52. హితవిదెతెలుసుకొమ్మీ | 10/9 (చి.అ) | 40 |






# ప్రార్థన

కం॥ శ్రీకాంతుని కీర్తించుట-
కే కద! యీ జీవనంబు క్రీడించుటకా?
మాకేల కీర్తి, సిరులును
మాకీ హరిసేవ చాలు మన్నన యిదియే.

ఉ॥ చేకొని వేంకటేశ్వరుని సేవగకైతలు చెప్పినారహో!!
ఆకడతాళ్ళపాక కవులైన మహాత్ములు అన్నమయ్యకున్
సోకగు పుత్రపౌత్రులతిసొంపుగ ఆమకుటంబుతోడనే
శ్రీకరువేంకటేశ్వరుని సేవతరించిరి మాకు భాగ్యమై.

ఆ.వె॥ భావపరిమళంబు పరిఢవిల్లుచునుండ
తాళ్ళపాక కవులు తలలువూప
నేటివారి కొరకు నీటుగ జెప్పెద
చదివి దీనిమెచ్చ సంతసింతు.

తే.గీ॥ మొదట శృంగార కవితలు ముగ్గురున్ను
చెప్పినవి ఎన్నుకొంటిని చెలువమొప్ప
ఆర్తితీరక అధ్యాత్మ కీర్తనముల
జెప్పితరియింతు వేంకటశిఖరవాస!


చం॥ సరసుడు వీడు శ్రీవిభుడు జన్మల భాగ్యప్రదాత తానెయౌ
తిరుమల చేరియొక్కపరిదీవెనలందుము మంచిదారిరా
పరిమితమైన జీవితము బాధ్యత తీరదు చావుదాక,నా
తెరవును మీరు చేకొనుడుదేనికి శంకలు నమ్ముడీహరిన్.

అనుకోవడంలో ఆశ్చర్యమేముంది? కాని పెద తిరుమలయ్య వంటి కొడుకులు, చినతిరుమలయ్యవంటి మనుమలువున్న అన్నమయ్యలు నేటియుగంలో కానరారు. అందుకే నాఈ భగవత్సేవకు ఈ పేరు సరిపోతుందని భావిస్తాను.

ఇందులో 50 కీర్తనల సంపుటమునొకదానిని ఆడియో సి.డి.గా వెలువరించాలని నా ఆకాంక్ష. నా మిత్రులు విన్నకోట మురళీకృష్ణగారి సహకారంతో నా కోరిక తీరుతుందని నా ఆశ.

నా ఇతర రచనలన్నీ భగవద్సేవాభాగమే. అవన్నీ Google Site లో geetadeeksha.com లో లభ్యమవుతాయి

**తిరుమల తిరుపతి దేవస్థానములవారికి సదా కృతజ్ఞుడను**







# తొలిపలుకు

శ్రీవేంకటేశ్వర అనే మకుటంతో 32000 కీర్తనలు చెప్పిన ఘనుడు తాళ్ళపాక అన్నమాచార్యులవారు. రమారమి 75 సంవత్సరాలు ఆ యజ్ఞం నిర్వహించారాయన. ఆయన కీర్తన వినని శ్రీహరిభక్తుడు వుండడు. మన దురదృష్టంకొద్దీ 20 వేల కీర్తనలు లభ్యంకాలేదు.

ఆయన తదనంతరం వారి సుపుత్రుడు పెదతిరుమలాచార్యులవారు తండ్రిమాట ప్రకారం అదే మకుటంతో తానూ అనేక కీర్తనలు చెప్పారు. అంతేకాదు తాతగారివద్దనే పెరిగి ఆయన వారసత్వంగా సాహిత్య పరిమళం అందుకొన్న ఒక సుపుత్రుని కన్నాడు. ఆయనే చినతిరుమలాచార్యులవారు. ఆయనా తాతగారివలె కీర్తనలు చెప్పి తిరుమలేశుని సేవించారు. కొడుకుల కవితా శైలి పరంపరగా సాగింది. ఇదివరలో అన్నమయ్య – అనుయాయులు అనే పేరుతో అన్నమయ్య భక్తి కీర్తనలు, పెదతిరుమలయ్యవి శృంగార కీర్తనలు, చినతిరుమలయ్యవి వైరాగ్య కీర్తనలను పరిచయం చేసే భాగ్యం ఆ తిరుమలేశుడు నాకు కల్పించాడు. దానిని టి.టి.డి. వారు ముద్రిస్తున్నారంటే, నా జన్మ చరితార్థమైనదని భావిస్తున్నాను.

నేడు అదే స్ఫూర్తితో వారి ముగ్గురి శృంగార కీర్తనలకు

భావపరిమళం అందిద్దామనే తలంపు ఆ స్వామే నాకు కలిగించాడు. దాని ఫలితమే ఈ నా ప్రయత్నం. ఇదే కోవలో భక్తి, వైరాగ్య కీర్తనలు చెప్పాలని నా ఆకాంక్ష. ఆపైన శ్రీనివాసుని దయ నా ప్రాప్తము.

నా భావన యేమంటే ముగ్గురిలోనూ పెదతిరుమలయ్య కవిత కొంచెం అధిక శ్రమపడునట్లు చేస్తుంది. అన్నమయ్య కవిత అలవోకగా వుంటుంది. కాకపోతే మనబోటి నవీన యుగమువారికి అన్నమయ్య కవిత కష్టమే. నాచేత తిరుమలనాథుడు చెప్పించిన దీనినాస్వాదించండి. నేను వాడిన భాష తేలికపాటిదే అవటంవల్ల మీకు నచ్చుతుందని ఆశిస్తాను.

పెదతిరుమలయ్య భార్య తిరుమలాంబ. ఈయన భగవద్గీతను తెలుగు వచనముగా చెప్పాడట. హరివంశాన్ని ద్విపద కావ్యంగా రచించాడట. రెండవది నేడు లభ్యమగుటలేదు. ఆయన "సంకీర్తనా లక్షణము" అనే గ్రంథమునకు వాఖ్య రచించినట్లు చినతిరుమలాచార్యులవారు పేర్కొనినాడు. ఈయనకు అనేక బిరుదులున్నాయట. వేదాంతాచార్య, కవితార్కిక కేసరివంటివి సుప్రసిద్ధములు.

ఆ దంపతుల సుపుత్రుడే చినతిరుమలాచార్యులవారు. ఈయనకు అష్టభాషా చక్రవర్తి అని బిరుదున్నది. తన తాతగారు అన్నమాచార్యుల శిక్షణలో పెరిగిన చిన తిరుమలయ్య తాతగారి





కీర్తనలు జీర్ణించుకొని పెద్దవాడైనాడు. సంగీత సాహిత్యాలు రెండిటిలోనూ దిట్ట. ఈయన నేటి గుంటూరు సమీపమునగల మంగళగిరి నరసింహస్వామిని దరించినట్లు ఒక శాసనముద్వారా తెలియవచ్చుచున్నది. ఈయన కీర్తనలద్వారా నేటి చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలోకూడా విశిష్టాద్వైతమత ప్రచారానికై దర్శించి పెక్కు అర్చావతారములను చినతిరుమలయ్య దర్శించి కీర్తనలు చెప్పినాడు. అలమేలుమంగాపురంలోని పెక్కు జీర్ణమైన ఆలయములను పునరుద్ధరించినాడు.

"హరి సేవకే వేంకటేశ మకుటం" అనే ఈ నా రచనలో మొదటి రెండవ సంపుటములలో శృంగార కీర్తనలు మూడు నాలుగు సంపుటములలో వైరాగ్య కీర్తనలు ఐదు, ఆరవ సంపుటములలో భక్తి కీర్తనలు చెప్పాలని నా ఆకాంక్ష. ఆపైన తిరుమలేశుని దయ నా ప్రాప్తము. తాత తండ్రి మనుమడి కవితా ఒరవడి పాఠకుల మన్నన అందుకొనేట్లు ఏడుకొండలయ్య దీవెనలకు ఆశపడుతున్నాను. లేకున్న ఇంత బృహత్ ప్రయత్నం నెరవేరేనా?

తండ్రుల దీక్షను తనయులు కొనసాగించటము ఈ నవీన కాలంలో తండ్రుల మాటవినే పుత్రరత్నాలే, రత్నాలవలె అల్పసంఖ్యలో వున్నారు. ఇక తండ్రి దీక్ష తమకేం పని





















సంఖ్య : 285 సంపుటము : 4 పుట: 191 రాగం : గుండక్రియ

**4 జగతి వైశాఖశుద్ధచతుర్దశి మందవార**
**మగణితముగఁ గూడె నది స్వాతియోగము** ॥పల్లవి॥

**పక్కన నుక్కుఁగంభము పగిలించుక వెడలి**
**తొక్కి హిరణ్యకసిపుఁ దొడికిపట్టి**
**చక్కఁగాఁ గడపమీఁద సంధ్యాకాలమున**
**వక్కలుసేసె నురవడి నరసింహుఁడు** ॥జగ॥

**పిప్పిగాఁగఁ జప్పరించి పేగులు జందేలు వేసి**
**తొప్పఁదోఁగుచు నెత్తురు దోసిటఁ జల్లె**
**రొప్పుచుఁ గోపముతోఁ గేరుచుఁ బకపక నవ్వి**
**తప్పక చూచె వాని నుదగ్రనరసింహుఁడు** ॥జగ॥

**యెదుటఁ బ్రహ్లాదుఁజూచి యిందిరఁ దొడపైనుంచె**
**అదన నందరికి నభయ మిచ్చె**
**కదిసి శ్రీవేంకటాద్రిగద్దెమీఁదఁ గూచుండె**
**వెదచల్లెఁ గృపయెల్ల వీరనరసింహుఁడు** ॥జగ॥

**భావ పరిమళం :**

అన్నమయ్య అహోబల నృసింహుని కీర్తిస్తున్నారు. తన వరగర్వితుడై హిరణ్యకశిపుదు లోకకంటకుడైనను తన కావలి వాడు జయుడు సనకాదుల శాపగతిని దైత్యుడైనాడని హరికి తెలియుటచే సహించాడు, కానీ తన శరణాగతుడైన ప్రహ్లాదుని హింసిస్తే సహించలేక పోయాడు. దైత్యుడు దేవ, నర, జంతు జాతులతో గాని, భూమిపైన లోన ఆకాశంలోనూ, ఊర్ధ్వలోకాలలోగాని అధోలోకాలలోగాని, పగలుగాని రాత్రిగాని, ఏ ఆయుధంతోగాని, ఇంటిబయటగాని లోనగాని మృత్యువురాకూడదని కోరుకున్నాడు. అవే హిరణ్యుని వరాలంటే. మరి హరి తక్కువవాడా? వాడి వరాలకు అనుగుణంగానే వాడిని చంపటానికి నృసింహుడై స్తంభములోనుంచి వెలిసి వాడిని చంపి ప్రహ్లాదవరదుడైనాడు. వైశాఖ శుద్ధ చతుర్దశినాడు శనివారం రోజున స్వాతి నక్షత్రయుక్త శుభలగ్నమున అన్నీ అగణితముగ సరిపోయిన క్షణమున జగతికి హిరణ్యకశిపుని పీడ వదిలించాడు, ప్రహ్లాదవరదనృసింహుడు. ఉక్కుకంభమును చీల్చుకొని వెడలి చక్కగా గడపమీద, సంధ్యా కాలమున, తొడపై కూర్చొనబెట్టుకొని గోళ్ళతో చీల్చి చంపాడు నృసింహుడు. వాడి పేగులు జంద్యెములుగా వేసికొని నెత్తురు బొట్టు మిగలకుండా పీల్చి కోపముతో రొప్పుచూ అసురుని తుదముట్టించాడు నరసింహుడు. శ్రీలక్ష్మిని తన తొడపైననుంచుకొని, ప్రహ్లాదుని ముద్దుజేస్తూ, సురులు మునులు ప్రార్థిస్తుండగా అందరికీ అభయమిచ్చాడీ వేంకటనరసింహుడు. గద్దెపై కూర్చొనియున్న ఈ అహోబలనృసింహుడే జగద్రక్షకుడు.

★ **మందవారము** – శనివారము ★ **కేరుచు** – పరిహాసముతో





సంఖ్య : 245 సంపుటము : 4 పుట: 164 రాగం : ఆహిరి

**1 మాకు నేమీఁ బనిగాదు మరి యేమిగలిగినా**
**శ్రీకాంతు నడుగరో చిత్రగుప్తులాల** ॥పల్లవి॥

**ధరణీశుపసులకుఁ దగు బందె లేదట**
**హరిదాసులకుఁ బాప మంటునా మరి**
**సరిఁ జక్రపుడాగు లిచ్చుటఁ జూచుకోరో మీరు**
**అరసి, మీఁదటిమాట లాతని నడుగరో** ॥మాకు॥

**లావరి మన్ననపాత్రులకు వెట్టి లేదట**
**కావింప వైష్ణవులకుఁ గర్మ మున్నదా**
**దేవునిలాంఛన మిదె తిరుమణి చూచుకోరో**
**ఆవల నేమిగల్లాను అతని నడుగరో** ॥మాకు॥

**సతి రాణివాసమైతే జాతికుల మెంచరట**
**హిత శరణాగతుల కేది జాతి**
**తతి శ్రీవేంకటపతిదాస్య మిది చూచుకోరో**
**యితవై మరేమిగల్లా నీతని నడుగరో** ॥మాకు॥

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో చిత్రగుప్తునికి ఆతని ఆజ్ఞానువర్తనులైన అతని బంట్లకు ఈ నా హెచ్చరిక వినండి అని చెబుతున్నారు. మా కర్మలతోకాని, వాటి ఫలములతోకాని మాకెటువంటి పనిలేదు. మేము శ్రీకాంతుని దాసులము. మీరేమన్నా అడగాలనుకొంటే వెళ్ళి ఆయన్ని అడుక్కోండి. అనవసరంగా మా జోలికి రాకండి. హరిదాసులతో పేచీ మీకు తగదు. అయినా మీరెంత తెలివితక్కువ వాళ్ళయా. దేశమునేలే రాజుగారి స్వంత పశువులను బందెలదొడ్డిలో పెట్టగల మొగాడెవ్వరయ్యా? మరి హరిదాసులకు పాపమంటుతుందని యెట్లా అనుకుంటారయ్యా? మా భుజకీర్తులైన శంఖ చక్రముద్రలు మీకు కనపడటంలేదా? సరే, ఇప్పుడు చూశారుకదా! ఇక వెళ్ళి ఆయననడగండి యేమి చెయ్యాలని. బలవంతుడైన వూరిపెద్ద మన్ననకు పాత్రుడైనవానికి వెట్టిచాకిరి చేయటం అనే శిక్ష వుండనే వుండదు. మరి నిష్కామ కర్మలనాచరించే వైష్ణవులకు కర్మఫలమెట్లా వస్తుందయ్యా? నేను వైష్ణవుడనని ఈ నా నుదుటునున్న తిరుమణి (పంగనామము) చూసుకోండయ్యా. ఆపైన యేమి కావలెనన్నా, ఆయననడగండి. రాణివాసములోనున్న రాణిగారి చెలికత్తెలను కులమేమిటి జాతియేమిటి అని యెవ్వరూ అడగరు. హరి శరణాగతులకు జాతి పట్టింపు వుంటుందా? మేము శ్రీవేంకటపతి భృత్యులమయ్యా! ఇక మీద యేమికావాలన్నా వెళ్ళి ఆయననడుక్కోండి.

★ **ఏమిగల్లాను** – ఏమి కలిగినా ★ **లావరి** – మోతుబరి

సంఖ్య : 462  సంపుటము : 1  పుట: 310  రాగం : రామక్రియ

**2 మహి నింతటివారువో మనవారు**
**బహుమహిమలవీరు ప్రపన్నులు** ॥పల్లవి॥

**జయమంది జననపుజరామరణముల**
**భయములేనివారు ప్రపన్నులు**
**క్రియలెల్ల నుడిగి మూఁగిన కర్మపుటడవి**
**బయలుచేసినవారు ప్రపన్నులు** ॥మహి॥

**ధీరులై మాయాంధకారంబు నెదిరించి**
**పారఁదోలినవారు ప్రపన్నులు**
**సారమయ్యిన సంసారసాగరము**
**పారముగన్న వారు ప్రపన్నులు** ॥మహి॥

**అండ నిన్నిటాఁ దనిసి యాసలెల్లాఁ దెగఁగోసి**
**పండినమనసువారు ప్రపన్నులు**
**దండిగా శ్రీవేంకటేశుదాసులై పరముతోవ**
**బండిబాటచేసినారు ప్రపన్నులు** ॥మహి॥

**భావ పరిమళం :**

ప్రపన్నుడు అంటే శరణాగతిబొందినవాడని అర్థం. శ్రీవైష్ణవం చేపట్టిన అన్నమయ్య హరి శరణాగతి యొక్కటే ముక్తిత్రోవ అని నమ్మి పలు కీర్తనలలో ప్రపన్నులకు ముక్తి కరతలామలకం అని యెలుగెత్తి చాటినారు. మనవారు అంటే మన శ్రీవైష్ణవ శరణాగతులు, అని అర్థం. ఈ ధరాతలంమీద మన శ్రీవైష్ణవులు యెంతటివారో కదా! వీరు అనేక మహిమలుగల ప్రపన్నులు. జయకేతనం యెగురవేసి తమకు ఇకపై జనన మరణాలపీడకాక ముసలితనపు యాతన కూడ వుండదని చాటినవారు ప్రపన్నులు. క్రియలన్నిటిని త్రోసిరాజని కర్మపుటడవులను సుగమంచేసినారు, యీప్రపన్నులు. ధనమూలమిదం జగత్తనిపించే ఈ సంసారసాగరమునకవతలి ఒడ్డున జేరినవారే ప్రపన్నులు లభించిన వాటితో తృప్తిజెంది, ఆశాపాశమునకు జిక్కక పరిపక్వమైనమనస్సు కలవారే ప్రపన్నులు. నిబ్బరంతో శ్రీవేంకటేశ్వరుని దాసులై ముక్తి బాటలో రహదారి గావించినవారే ప్రపన్నులు.

★ **బయలుజేసిన** – వెల్లడించిన ★ **సారమయ్యిన** – సర్వమూధనమే
★ **తనిసి** – తృప్తిజెంది★ **బండిబాట** – రహదారి





సంఖ్య : 111  సంపుటము : 2  పుట: 75  రాగం : పాడి

**3 అనుచు లోకము లెల్ల నదె జయవెట్టేరు**
**నిను@ గొల్చితి@ గావవే నీరజాక్షుఁడా** ॥పల్లవి॥

**అదివో కోనేటిలోన నదివో సర్వతీర్థములు**
**అదివో పైఁడిమేడల హరినగరు**
**పొదలి పరుష లెల్లా పొదిగి సేవించేరు**
**యిదివో వరము లిచ్చె నిందిరానాథుఁడు** ॥అను॥

**అదివో వేద ఘోషము అదివో సురలమూఁక**
**అదివో విశ్వరూపము అద్భుత మందె**
**గుదిగొనెఁ బుణ్యములు కోట్లసంఖ్యలు చేరె**
**యిదివో దయదలఁచె నీశ్వరేశ్వరుఁడు** ॥అను॥

**అదివో శ్రీవేంకటేశుఁ డక్కున నలమేల్ మంగ**
**అదివో నిత్యశూరులు ఆళువారలు**
**నిదుల శేషాచలము నిక్కి పైపైఁబొడచూపె**
**యిదివో కొలువున్నాఁడు హృదయాంతరాత్ముఁడు** ॥అను॥

**భావ పరిమళం :**

కన్నుల పండుగగా కోనేటిరాయుడైన శ్రీవేంకటేశుని వైభవాన్ని ఆవిష్కరిస్తున్న అన్నమయ్య కీర్తన విని తరించండి. “ఓం నమో వేంకటేశాయ” అంటూ లోకములన్నీ జయజయ ధ్వానములు సలుపుచుండగ ఓ ఏడుకొండలవాడా! నిన్ను గొల్చితినయ్యా! ఓ నీరజాక్షా! నన్ను కాపాడుము ప్రభూ! నా మనోనేత్రము యెంత అద్భుతమైన దృశ్యాన్ని వీక్షిస్తున్నదో వినండి. అదివో స్వామి పుష్కరిణి అనబడే కోనేటిలో అఖిల తీర్థములూ వచ్చి చేరుతున్నాయి. అదిగో బంగారు మేడలమయమైన హరిపురము వైకుంఠము. అదిగో తీర్థయాత్రలు చేయుభక్తులందరూ ఒక్కచోట పోగై గోవింద నామస్మరణతో సేవిస్తున్నారు. ఇదిగో వారందరికీ ఇందిరాపతి కోరినవరాలన్నీ ఇస్తున్నాడు. ఇదిగో మునీశ్వరులు పెట్టే వేదఘోష, అదిగో దేవతలమూక, అదిగో అద్భుతమైన విశ్వరూప దర్శనము. అదిగో భక్తుల పుణ్యము కోట్ల సంఖ్య చేరిన అందరికీ ఆ విశ్వరూపము కనబడుతున్నది. ఇదిగో అందరినీ దయదలుస్తున్న దేవదేవుడు. అదిగో శ్రీవేంకటేశుడు అదిగో ఆయన వురముపై అలమేల్మంగ, అదిగో విష్వక్సేనుడు ఆయన పరివారము, అదివో ఆళ్వారులు, అదిగో నిధులతో నిక్కిన శేషాద్రి శిఖరము, అదిగో హృదయాంతరాత్ముడుగా నెలకొన్న శ్రీహరి

★ **పరుషలు** – తీర్థయాత్రికులు ★ **నిత్యశూరులు** – విష్వక్సేనాదులు

సంఖ్య : 145 సంపుటము : 4 పుట: 97 రాగం : సాళంగనాట

**8 హరికి లంకిణీహంత కంతర మిట్టున్నది**
**కరుణ నింత మన్నించె కమలావిభుఁడు ॥పల్లవి॥**

**విశ్వరూపు చూపినాఁడు విష్ణుఁడు దొల్లి, యట్టె**
**విశ్వరూపాంజనేయుఁడు వీఁడె చూపెను**
**శాశ్వతుఁడై యున్న వాఁడు సర్వేశ్వరుఁడు వీఁడె**
**శాశ్వతుఁడై యున్నాఁడు జగములో నీతఁడు ॥హరి॥**

**ప్రాణవాయుసంబంధి పరమాత్ముఁడు, అట్టె**
**ప్రాణవాయుసుతుఁడు పవనజుఁడు**
**రాణింప రవివంశుఁడు రామచంద్రుఁడు, తాను**
**నాణెపురవిసుతుని నమ్మినప్రధాని ॥హరి॥**

**దేవహితార్థము సేసెఁ ద్రివిక్రముఁడు, అట్టె**
**దేవహితార్థమే జలధిలంఘనుఁడు**
**శ్రీవేంకటేశుఁడు చిన్మయమూర్తి, తాను**
**కోవిదుఁడు జ్ఞానమూర్తి గొప్ప హనుమంతుఁడు ॥హరి॥**

**భావ పరిమళం :**

ఈనాడు అష్టావధానులు కవిత్వంలో చిత్రవిచిత్ర విన్యాసాలు చూపిస్తున్నట్లే ఆనాడు అన్నమయ్య కూడా ఇటువంటి పసందైన కీర్తనలనెన్నింటినో చెప్పారు. ఈ కీర్తనలో హరిని (వానరుడైన హనుమంతుని), శ్రీహరిని పోల్చి వారి మధ్య గల సామ్యమును పోల్చి చెబుతున్నారు. అన్నమయ్య ప్రతిభకు జోహార్లనక తప్పదు సుమా! హరికి (శ్రీహరికీ) లంకిణీహంతకుని (హనుమంతునికి) గల అంతరము (తేడా) ఇట్లున్నది. హనుమను కమలారమణుడు ఇంతమన్నించెను కదా! శ్రీహరి విశ్వరూపము చూపించాడు అర్జునునికి. ఈ హనుమంతుడు విశ్వరూపము భీమసేనునికి చూపినాడు. సర్వేశ్వరుడైన శ్రీహరి శాశ్వతుడు. ఈ హరి కూడా బ్రహ్మవరప్రసాదియైన శాశ్వతుడు. పరమాత్ముడైన శ్రీహరివల్ల ప్రాణవాయువు లభిస్తున్నది. ప్రాణవాయుసుతుండే ఈ హనుమ. ఈ శ్రీహరే రవివంశజుడైన రామచంద్రుడు. ఈ హనుమ రవి సుతుని (సుగ్రీవుని) ప్రధానమంత్రి. శ్రీహరి, త్రివిక్రముడై దేవతలకు హితము చేశాడు. దేవతల హితార్థమే హనుమ జలధి లంఘించాడు. శ్రీవేంకటేశ్వరుడైన శ్రీహరి చిదానందమూర్తి. ఈ గొప్ప హనుమంతుడు జ్ఞానమూర్తి.

★ **నాణెపు** – నాణ్యమైన ★ **కోవిదుడు** – పండితుడు





సంఖ్య : 26 సంపుటము : 1 పుట: 17 రాగం : ముఖారి

**5 అనుమానపుబ్రదు కది రోఁతా తన**
**మన సెనయని కూటమి మరి రోఁతా ॥పల్లవి॥**

**అపకీర్తులఁబడి ఆడికె లోనై**
**అపవాదియౌట అది రోఁత**
**వుపమ గెలిచేనని వొరుఁజెరుచుటలు**
**విపరీతపుగుణవిధ మొకరోఁతా ॥అను॥**

**తనుగుట్టెలా నెరిఁగినవారల ముందట**
**తన యెమ్మెలు చెప్పుకొనుట రోఁత**
**వనితలముందట వదరుచు వదరుచు**
**కనుఁగవఁగానని గర్వము రోఁత ॥అను॥**

**భువి హరి గతియని బుద్ధిఁ దలంచని**
**యవమానపుమన సది రోఁత**
**భవసంహరుఁడై పరగు వేంకటపతి**
**నవిరళముగఁ గొలువని దది రోఁత ॥అను॥**

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో మానవుని జీవితంలో రోత వేటిపైన కలుగుతుందో వివరిస్తున్నారు. రోత అంటే జుగుప్స అని అర్థం. ఏవగింపు అని కూడా అంటారు. కొంతమంది ప్రతిదానిని అనుమానిస్తుంటారు. అట్టి వారికి బ్రతుకే రోత. కొంతమంది భార్యతో కాపురము కూడా మనస్సులో సంతోషం లేకుండా చేస్తారు. వారికి భార్యతో కూటమి కూడా రోతయే. ఎవరైనా అపకీర్తిని పొంది, నిందలకులోనై అపవాదములను పొందుతుంటారు. అట్లౌట రోతయేకదా! పరులతో పోల్చిచూసుకోకండి బ్రతుకంతా రోతే. ప్రతివారికి యేదో కొంత గోప్యం అవసరమే. మనంతట మనము పరుల ముందు మనగుట్టు విలాసముగా బయటపెట్టుకొంటే రోతకాక మరేమిటి? కొంతమంది స్త్రీలముందు లేనిపోని గొప్పలు చెప్పుకుంటారు. వాళ్ళకి గర్వంతో కళ్ళు పొరలు కమ్ముతాయి. వారి డొల్లతనం బయటపడటం నిజంగా రోతేకదా! మనస్సున హరియే గతియని బుద్ధి తెలిసి వుండని వాని జీవితం ఒక రోత. వాడి మనస్సే వానిని కించపరచి రోత కలుగజేస్తుంది. భవసంహారకుడైన శ్రీవేంకటేశ్వరుని విడువకుండ కొలవకపోవడం కంటే రోత మరొకటి వుండదు.

★ **ఆడికె** – నింద ★ **అవిరళముగ** – విడువకుండా ★ **యెమ్మెలు** – విలాసము

సంఖ్య : 90 సంపుటము : 3 పుట: 61 రాగం : దేశాక్షి

**6 కన్న విన్న వారెల్లా కాకుసేయరా**
**వున్నతుఁడవైన నీ కీవొచ్చెము లేలయ్యా ॥పల్లవి॥**

**దేవతలఁగాచినట్టి దేవుఁడ నీకుఁ బసుల**
**నీవలఁ గాచితివనే హీనమేలా**
**కావించి పాలజలధిఁ గాఁపురముండినయట్టి**
**నీవు పాలదొంగవనే నింద నీ కేలయ్యా ॥కన్న॥**

**కాలమందు బలిదైత్యుఁ గట్టివేసినట్టి నీకు**
**రోలఁ గట్టువడినట్టి రోఁత నీ కేల**
**పోలించి లోకాలకెల్ల పొడవైన దేవుఁడవు**
**బాలుఁడవై రేపల్లెలోఁ బారాడనేలయ్యా ॥కన్న॥**

**పాముమీఁదఁ బవ్వళించి పాయకుండినట్టి నీకు**
**పాముతల దొక్కినట్టి పగలేలా**
**కామించి శ్రీవేంకటాద్రికడపరాయఁడ నీవు**
**భూమి మాయ లణఁచి నేర్పులమాయ లేలయ్యా ॥కన్న॥**

**భావ పరిమళం :**

కాకుసేయుట అంటే చులకనగా చూచి నిందించటం. ఆరువందల సంవత్సరాల తర్వాత దేవుడే లేడని నిందించే 'పెద్దమనుష్యులు' పుట్టుకొస్తారని అన్నమయ్య ఆనాడే వూహించివుంటారు అందుకనే ఈమాట, కడపరాయుడైన శ్రీవేంకటేశ్వరునికే హెచ్చరిక చేస్తున్నారు. స్వామీ! నీవు సర్వేశ్వరుడవు, ఉన్నతుడవు. నీకీ అవమానాలెందుకయ్యా? నీ కథలన్నీ విన్నవారు చూసినవారూ నిన్ను హీనముగా జూచి, నిందించరా? ఓ దేవదేవా! హిరణ్యాక్ష హిరణ్యకశిపులనుంచి దేవతలను రక్షించిన నీవు, ఇటీవల పశువుల్ని కాచినావనే అపకీర్తిని యెందుకు మూటకట్టుకొన్నావు? క్షీరసాగరమున శేషతల్పశాయివైన నీకు పాలదొంగవనే నిందనెందుకు తలకెత్తుకొన్నావు? ప్రభూ! ఓ సర్వేశ్వరా! కృతయుగంలో నిష్కల్మషుడైన బలిచక్రవర్తినేమో కట్టివేశావు, అందుకు శిక్షగా మీ అమ్మ యశోద చేత రోటికి కట్టేయించుకొన్నావా? రోతపొందితివా లేదా? నీవు లోకపాలకుడవు, పొడవుకి పొడవైన పురుషోత్తముడవు. మరి అట్టి నీకు రేపల్లెలో మట్టి వీధుల్లో పారాడ వలసిన గతేమిటి స్వామీ! ఓ జగద్రక్షకా! ఆదిశేషుని కోర్కెపై ఆయననే నీ శయ్యగా స్వీకరించావు బాగు,బాగు. కానీ అదే నాగజాతికి చెందిన కాళింగునిపై నీకు పగ యెందుకయ్యా! కడపరాయడవైన నీవే తిరుమలగిరులపై శ్రీవేంకటేశుడవైనావు. నేటి భూలోకంలో ముష్కరుల మాయ తొలగించి నేర్పుతో నీమాయలెందుకు జూపుతున్నావయ్యా?

★**ఒచ్చెము**–అవమానము★**భూమిమాయలణచి**–భూమ్మీద ముష్కరుల మాయ తొలగించి





సంఖ్య : 275 సంపుటము : 4 పుట: 184 రాగం : ఆహిరి

**7 సులభుఁ డీతఁ డిదివో సుగ్రీవనారసింహుఁడు**
**చెలఁగి మొక్కులు మొక్కి సేవించరో ॥పల్లవి॥**

**నవ్వులమోమువాఁడు నానామహిమలవాఁడు**
**రవ్వలుగా దేవతల రక్షించేవాఁడు**
**వువ్విళ్లూర కంభములో నుదయించినవాఁడు**
**నివ్వటిల్లు ప్రతాపాన నెగడినవాఁడు ॥సుల॥**

**హేమపుచాయలవాఁడు యెదుటఁ గొల్వున్నవాఁడు**
**కోమలిఁ దొడపై నిడుకొన్న వాఁడు**
**కోమలపుమేనివాఁడు గొప్పకిరీటమువాఁడు**
**చేముంచి హిరణ్యదైత్యుఁ జించినవాఁడు ॥సుల॥**

**వాలుకగోళ్ళవాఁడు వాఁడికోరలవాఁడు**
**మేలిమికరుణతోడ మించినవాఁడు**
**వోలిఁ దుంగభద్రకాడనుండి శ్రీవేంకటాద్రిని**
**లీలతోఁ బ్రహ్లాదుని కేలి కైనవాఁడు ॥సుల॥**

**భావ పరిమళం :**

ఇది తుంగభద్ర దరినున్న సుగ్రీవనారసింహునిపై అన్నమాచార్యులవారు చెప్పిన సంకీర్తన. చూడటానికి సింహమే కానీ నవ్వులు వెదజల్లే సుగ్రీవనారసింహుడు మాత్రం యితడే. ఇంత సులభంగా అనుగ్రహించే దైవం మరొకడు లేడు. అనేక విధాలుగా మొక్కి యీ స్వామిని సేవించండయ్యా! విజృంభించండి అంటున్నారు. భక్తి తొణికిసలాడే కీర్తన ఇది. ఈ స్వామి యెటువంటివాడంటే... నవ్వులు చిలకరించు మోమువాడు, అనేక మహిమలు గలవాడు, దేవతలను కీర్తివంతులను చేసి రక్షించిన వాడు, ఉత్సుకించి స్తంభమునుండి వెలువడినవాడు, అతిశయించిన ప్రతాపముతో బయల్వెడలినవాడు. ఈ స్వామి బంగారు ఛాయలో వెలిగిపోతున్నాడు, మనయెట్ట యెదుటనే వున్నాడు, తనదేవేరియైన శ్రీలక్ష్మిని తన యెడమ తొడపై నుంచుకొనినవాడు, నరశరీరమంతా బహు కోమలమైనవాడు, గొప్ప కాంతులీను కిరీటముగలవాడు, ప్రమాణపూర్వకముగా హిరణ్యకశిపుని వాడివరములు వీగిపోకుండా గోళ్ళతో చీల్చి చంపినవాడు. ఈ స్వామి వంకరతిరిగిన వాడియైన గోళ్ళున్నవాడు, బలమైన కోరలుగలవాడు, మేలు కలిగించే కరుణతో మించిపోయినవాడు ఎందుకంటే... తుంగభద్రానదీతటమున వెలసిన ఈ నృసింహుడే తిరుమల శ్రీవేంకటేశుడు. ఈ స్వామి సురుచిరలీలతో ప్రహ్లాదునికేలికైనాడు.

★ **ఉవ్విళ్ళూరు** – ఉత్సుకించు ★ **చేముంచి** – ప్రమాణముచేసి

సంఖ్య : 379   సంపుటము : 4   పుట: 254   రాగం : నారాయణి

**12 కావఁగ నీకే పోదు కరుణానిధివిగాన**
**భావించి నీవని తుదపదమే యెక్కితిమి.** ॥పల్లవి॥

**కరిరాజవరద నీకడనున్న వారికి**
**కరిరాజభయము లెక్కడాఁ బొందవు**
**సిరుల నీయర్థమే చింతించి చింతించి**
**నరలోకమెల్ల నీనగమె యెక్కితిమి** ॥కావఁ॥

**కాళింగమర్దన నిన్నుఁగని మనువారికి**
**కాళింగభయములెక్కడా లేవు**
**తాలిమితో నిదియే తలపోసి తలపోసి**
**కేలి మనుజులము నీగిరియె యెక్కితిమి** ॥కావఁ॥

**కందువ శ్రీవేంకటకటకేశ నీవద్ద-**
**నెందుఁ గటకేశభయమిఁక లేదు**
**యిందుకే పో జగమెల్లా నిటు శరణని మూల**
**కందువ నీదండ శ్రీవేంకటమె యెక్కితిమి.** ॥కావఁ॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో నాబోటి 'తెలుగు తక్కువ' వాళ్ళకి అర్థంకాని మాటలు కోకొల్లలు. శ్రమపడితే భగవంతుని కరుణవుంటే సాధించలేని దేముంటుంది? పెట్టే అమ్మనే అడగాలన్నారు పెద్దలు. ప్రభూ! నీవు కరుణానిధివి కాబట్టి నిన్ను అర్థిస్తున్నాము. మరి నీకు మమ్ము రక్షించక తప్పదు. నిన్ను మా మనస్సులలో భావించి, నిలుపుకొని, ముక్తిని సంపాదించుకొన్నాము. ఓ గజేంద్రసంరక్షకా! నీవద్దనున్న వారికి ఏనుగంత కష్టములు కలుగవు స్వామీ! ఈ ధనమెందుకయ్యా నాకు నీ అర్థము (ధనము) నాకుచాలు. ఆ అర్థము కోసమే చింతించి చింతించి మానవలోకమంతా నీ కొండ యెక్కినది. కాళింగ సర్పమును తొక్కి పీడించిన నిన్ను ధ్యానించి జీవించే వారికి కాళింగుని వంటి సర్పపగగల వారిభయము, పీడ వుండదు. ధైర్యంతో నీ కాళియమర్దన తలపోసి, తలపోసి మనుష్యులు "ఆట" మాదిరి నీ కొండనెక్కగలుగుతున్నారు స్వామీ! సామర్థ్యంగల ఓ వేంకట కటకేశా! (వేంకటమనే కొండ నడుము భాగమునకు అధిపతివైన శ్రీవేంకటేశ్వరా!) కొండనెక్కేవారికి మధ్యలో కళ్ళు తిరిగి పడిపోతామేమో అనే భయం కలుగుతుంది. ఆ కటకేశ భయం నివారించగల నీకు జగమెల్లా శరణమన్నది పో!! సామర్థ్యంతో నీ అండవలన మేము శ్రీవేంకటగిరినెక్కి తరించితిమి తండ్రీ!

★ **తలపోసి** – తలుచుకొని ★ **కటకము** – కొండనడుము





సంఖ్య : 163   సంపుటము : 4   పుట: 109   రాగం : సామంతం

**9 కొలువై తా నల్లవాఁడె కూచున్నాఁడు గద్దెమీఁద**
**బలవంతుఁ డితఁడు ప్రహ్లాదవరదుఁడు** ॥పల్లవి॥

**చిదుముడిగోళ్లతోడ సింహపుమోముతోడ**
**తొడమీఁదఁ గూచున్న తొయ్యలితోడ**
**కదలేని నవ్వుతోడ కదురాజసముతోడ**
**అదరించీఁ బంతము ప్రహ్లాదవరదుఁడు** ॥కొలు॥

**సంకుఁజక్రములతోడ చాయలమేనితోడ**
**సంకె దేర్చే యభయహస్తముతోడ**
**బింకపుమీసాలతోడ పెనువదనముతోడ**
**అంకె వరము లిచ్చీఁ బ్రహ్లాదవరదుఁడు** ॥కొలు॥

**వనితకౌఁగిటితోడ వామకరముతోడ**
**ననుపైన తమలో నానందముతోడ**
**యెనయుచు శ్రీవేంకటేశుఁడై యీడా నాడా**
**అనిశము వెలసెఁ బ్రహ్లాదవరదుఁడు** ॥కొలు॥

**భావ పరిమళం :**

కడపజిల్లా ముడియము గ్రామములో వెలసిన నరసింహుడు కూడా ప్రహ్లాదవరదుడే. బహుశా అన్నమాచార్యులవారీ కీర్తన ఆ స్వామిపై చెప్పివుంటారేమోనని నా భావన. అదిగో గద్దెపై కూర్చొనివున్న అల్లవాడే ప్రహ్లాదవరదుడు. అతడు గొప్ప బలవంతుడు. ఆస్వామి భక్తుల కొరకు కొలువుదీర్చియున్నాడు. ఈయనను సేవించి తరించండి. సింహపు వదనముగల ఈ స్వామి గోళ్ళు చూస్తే తొట్రుపాటు కలుగక మానదు. ఈ స్వామితొడమీద తొయ్యలి శ్రీలక్ష్మి కూర్చొనియున్నది. అన్ని వరాలకూ విరుగుడుగా హిరణ్యకశిపుని చంపాను చూశారా, అని నవ్వులొలికిస్తున్నాడు స్వామి. అయినా, ఈయనలో రాజసము వుట్టిపడుతూనే వున్నది. తన పంతము సూటిగా నెరవేర్చుకున్నాడు. ఈ స్వామి చేతులలో శంఖచక్రములున్నవి. ఈయన శరీరం కాంతిని విరజిమ్ముతోంది. భక్తులకు ఏ శంకా లేకుండా అభయహస్తమిచ్చుచున్నాడు. ఈయన వదనమేమో పెద్దగా వున్నది. ఈయన మీసాలు బింకమును చూపుతున్నాయి. స్వాధీనుడై ఈ ప్రహ్లాదవరదుడు పెక్కు వరములిచ్చుచున్నాడు. ఈ స్వామి తన ఎడమ చేతిని చాచి శ్రీలక్ష్మిని కౌగలించుకొనినాడు. అందుచేత తనలో తానే మిక్కిలి ఆనందము చెందుతున్నాడు. ఈయనే శ్రీవేంకటేశ్వరుడు కూడా కాబట్టి ఇక్కడా, అక్కడా (తిరుమలలో), అనవరతమూ వెలసియున్నాడు.

★ **అదరించె** – సూటిగా ★ **బింకము** – గర్వము

సంఖ్య : 306   సంపుటము : 2   పుట: 205   రాగం : ముఖారి

**10 ఎవ్వరికి యెవ్వ రయ్యేరు యిందరికి నీవే దిక్కు**
**అవ్వల నివ్వల నీ వనాథనాథుఁడవు** ॥పల్లవి॥

**కాయకము లందరునుఁ గార్యవశపరులే**
**పాయని నీ వకారణబంధుఁడవు**
**దాయగాం డ్లెవ్వరినైనాఁ దప్పించుకొనేవారే**
**బాయటనున్నా నీ వాపన్న శరణ్యుఁడవు** ॥ఎవ్వ॥

**అట్టె లోకమువారు అర్థకామపరులే**
**జట్టిగొని నీవైతే సర్వదాతవు**
**పొట్టఁ బొరుగుచుట్టాలు భోజనసహాయులే**
**నెట్టన నీ వైతే మాకు నిర్వాహకుఁడవు** ॥ఎవ్వ॥

**అంతటా వారికి వారు ఆత్మపోషకులే**
**రంతుల నీ వైతే నానారక్షకుఁడవు**
**సంతతము శ్రీవేంకటేశా మమ్ము నేలితివి**
**పంతమున నీవు భక్తపరిపాలకుఁడవు** ॥ఎవ్వ॥

**భావ పరిమళం :**

ఈ కీర్తనలో అన్నమయ్య సామాన్య మానవులకు పరమాత్మకు గల తారతమ్మాలను విశదీకరిస్తున్నారు. ఈ లోకంలో ఒకరికింకొరితో పొత్తు కుదరదు. కానీ వీరందరికీ నీవే దిక్కువు. అవతల పైలోకాలలో కాని, ఇవతల భూలోకంలోకాని నీవొక్కడవే అనాథలకు నాథుడవు. నీకు మరెవ్వరూ సాటిరారు. ఈ ప్రపంచంలో ప్రతివొక్కరు వారివారి అవసరాలకొరకే బంధుత్వం పాటిస్తారు. కానీ నీవొక్కడివే అకారణ బంధుడవు. దాయాదులందరూ తప్పించుకొని తిరిగే వారే. అపన్నులకు శరణము నివ్వగలిగింది నీవొక్కడవే. ప్రభూ! ఈ లోకంలో మాతోటి వాళ్ళంతా ధనమునాశించేవారే. అదే పూనుకొనిన నీవైతే సర్వదాతవు. నీ భక్తులు ఏదడిగితే అదిస్తావు. ఇరుగు పొరుగు చుట్టాలు భోజనాలు తినుటకు మమ్మల్ని ఆశ్రయిస్తారు. మరి నీవైతే సర్వకార్యములను నిర్వహించువాడవు. ఈ జగత్తులోవున్న వాళ్ళంతా వారివారిని పోషించుకోవాలని ఆరాటపడేవారే. నీవొక్కడవే సర్వరక్షకుడవు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవెప్పుడూ అండవై మమ్ము ఆదుకొన్నావు. నీవు పంతము వహించి నీభక్తులను పరిపాలించువాడవు.

★ **రంతుల** – విలాసపురుషుడవైన ★ **పొట్టబొరుగు** – దగ్గరివారైన





సంఖ్య : 74   సంపుటము : 2   పుట: 50   రాగం : గుండక్రియ

**11 నమ్మినదొకటే నాకు నీ శరణము**
**యెమ్మెల సంసార మింతే యిందేమిగలదు** ॥పల్లవి॥

**యేఁటికర్మము నా కేఁటి ధర్మము**
**యేఁటిదో నేఁజేయఁగా నీకేమి గూడెను**
**నాఁటకపుతొంటివారు నడిచిన మార్గమని**
**యీఁటుకుఁ జేసేఁగాక యిందేమి గలదు** ॥నమ్మి॥

**యేడ తపము నాకేడ జపము నే**
**వాడికఁ జేయఁగ నీకు వచ్చినదేమి**
**బెడిదపుఁబెద్దలెల్లాఁ బెట్టిన తిట్టము లంటా**
**యీడుకుఁ జేసెఁగాక యిందేమి గలదు** ॥నమ్మి॥

**యెక్కడి పుణ్యమునా కెక్కడి భోగములు**
**యిక్కువ న న్నిట్లఁజేసి యేమిగంటివి**
**నిక్కెపు శ్రీవేంకటేశ నిన్నుఁ గనుటగాక**
**యెక్కడి కెక్కడిమాయ లిందేమి గలదు** ॥నమ్మి॥

**భావ పరిమళం :**

అన్నమయ్య యేమంటున్నారో వినండి. అతిశయించిన ఈ సంసారము ఇంతేకదా? ఇంకా ఇందు యేమివున్నది చెప్పండి? ఇవన్నీ నాకెందుకు? నేను నమ్మినది కోరుకునేది ఒక్కటే. నాకు నీ శరణము చాలును. మరేమి అక్కరలేదు. పెద్దలంతా యేవేవో మాటలు చెబుతారు. కర్మము యేటిది? నాకు ధర్మము యేటిది? అసలు వీటిని చేయవలసిన అవసరం నాకేమిటి? ఈ జగన్నాటకములో నడిచిన నా పూర్వీకులు తొక్కినదీ బాటనే. కానీ ఇవన్నీ వ్యర్థమైనవే? ఇందేమి కలదు? నాకు ఈ తపములెందుకు? జపములెందుకు? పోనీ వీటిని అలవాటు చేసికొంటే నాకు ఒరిగేదేమిటి? అధికులై యజ్ఞయాగాలు చేసిన నా పెద్దలంతా పెట్టిన రాశివలెనున్న పనులు చేస్తే నేను సాధించేదేమిటి? ఇందేమి కలదు? ఈ పుణ్యము అనేది యెక్కడిది? ఈ భోగములన్నీ యెక్కడివి? ఓ సర్వేశ్వరా! నన్ను వీటినన్నిటిని నమ్మేట్లు చేస్తే నీకేమి ఉపయోగం? నిజమైన శ్రీవేంకటేశ్వరా! నిన్ను పొందుటగాక ఇవన్నీ నాకెందుకు? ఇదంతా యెక్కడికక్కడే కలిగే మాయ. ఇందేమి కలదు తండ్రీ?

★ **ఈటుకు** – వ్యర్థముగా ★ **బెడిదము** – అధికులైన ★ **తిట్టము** – రాశివలె

సంఖ్య : 15 సంపుటము : 4 పుట: 10 రాగం : సామంతం

**16 కొసరి కొసరి యిcకc గోరcగ నేcటికి**
**అసురవైరి శరణనుటే చాలు ॥పల్లవి॥**

**సంతతభోగము జననబంధములు**
**జంతురాసులకు సహజము**
**వంతు రక్షకత్వము కరుణ భువి**
**నంతర్యామికి నది సహజము ॥కొస॥**

**కలకాలంబును గామముc గ్రోధము**
**చలమును బ్రాణులసహజము**
**సులభత్వంబును సొరిది వదాన్యత**
**అల లక్ష్మీపతి కది సహజము ॥కొస॥**

**వుడుగని కర్మము లొడలోముటలును**
**జడులము మాకిది సహజము**
**యెడయక శ్రీవేంకటేశ నీకు మము-**
**నడరికాచుటే అది సహజము ॥కొస॥**

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో దేవదేవుని కొసరి కొసరి అడిగి యాచించుట దేనికి? దానవ వైరియైన ఆ దయానిధిని శరణంటే చాలదా? మనకేమి కావాలో తానే అనుగ్రహిస్తాడు కదా! మళీ మనం అడగాలా? అంటున్నారు. చిన్న పిల్లలకు యేమికావాలో తల్లిదండ్రులకి తెలియదా? మనమందరమూ జంతువులమే వాటికి జన్మతః కలిగే బంధములు, నిరంతరము భోగలాలస, సహజగుణము. మరి సర్వులకు అంతర్యామియైన పరమాత్మకు ఆ జంతువులను కరుణతో రక్షించుట సహజగుణము. ఈ ప్రాణులన్నిటికీ సహజగుణ మేమిటో తెలియునా? జీవితాంతమూ కామక్రోధ మత్సరాలతో మగ్గిపోతుంటారు. సులభముగ అనుగ్రహించుట, దాతృత్వము ఆ లక్ష్మీపతికి సహజ గుణము. ఎన్నటికీ విడనాడని కర్మబంధాలతో ఒడబడుట జడులమైన మాకు సహజము. మరి నీ సహజగుణమేమిటి శ్రీవేంకటేశ్వరా? నీ శరణాగతులమైన మమ్ము రక్షించుము.

★ **వదాన్యత** – దాతృత్వము ★ **ఒడలోముట** – ఒడబడుట





సంఖ్య : 30 సంపుటము : 4 పుట: 20 రాగం : మాళవిగౌళ

**13 విచారించుకొనేవారి వివేకాలకొలcదులు**
**పచారించు వున్న వెల్ల భావనమాత్రములు ॥పల్లవి॥**

**జగము లన్ని నీ శరీరమే కనక**
**తగు వైకుంఠాలే వుండే తావు లెల్లాను**
**పొగరు స్వర్గనరకభూములనే లోకా లెల్ల**
**పగటున తమలోని భావనమాత్రములు ॥విచా॥**

**అన్ని పదార్థాలు నీయందే పుట్టివచ్చెcగాన**
**తిన్నని నీ ప్రసాదాలే దినభోగాలు**
**వన్నెల నిష్టానిష్టవస్తుభేదము లెల్లాను**
**పన్నుకొన్న యటువంటి భావనమాత్రములు ॥విచా॥**

**అంతరాత్మవు శ్రీవేంకటాధిప నీవే కాన**
**చెంతల నీకైంకర్యాలే చేcత లెల్లాను**
**వింతలైన సంసారవిహారము లెల్లాను**
**బంతినే నానావిధభావనమాత్రములు ॥విచా॥**

**భావ పరిమళం :**

వైరాగ్యం పెల్లుబికిన అన్నమయ్య యెవరి వివేకము కొలది వారు ఆలోచించుకోవాలిగాని మనం ప్రచారం చేసికొనేవన్నీ భావనలు మాత్రమే అవి నిజం అవునో కాదో తెలిసినవాడు ఆ శ్రీహరి ఒక్కడే అంటున్నారు. తనట్లా అనుటకుగల కారణాలను సహేతుకంగా వివరిస్తున్నారు. ఓ ప్రభూ! ఈ జగములన్నీ నీ శరీరమేనని శ్రుతులు చెబుతున్నాయి. మరి వైకుంఠాలెక్కడ వున్నాయి స్వామీ? ఈ స్వర్గమూ, పాతాళము యెక్కడివి? భూలోకమొక్కటే మేము చూడగలిగింది. మరి మిగిలినవన్నీ తమలోని భావనలేనా? అనిపిస్తున్నది. ఈ ప్రపంచంలోని పదార్థాలన్నింటినీ సృజించిన వాడివి నీవే అయినప్పుడు మేము తినే భోజనములు అన్నీ నీ ప్రసాదమే కదా! మరి మేము వాటిని నీకు నివేదించడమేమిటి స్వామీ? మనం కొన్ని మనకు ఇష్టమైనవీ, కొన్ని కానివీ అనుకుంటుంటాము. అవన్నీ కేవలం మన భావనలే కదా. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే మా అంతరాత్ముడితో మేము చేస్తున్నామనుకొంటున్నవన్నీ చేయిస్తున్నావు. కాబట్టి మా చేతలన్నీ నీ కైంకర్యాలే. మరి అబ్బురపరచేదేమంటే... ఈ సంసారములో జీవులు సలిపే విహారములన్నీ పలువిధములైన భావనలు మాత్రమే.

★ **పచారించు** – వ్యాపించు ★ **పన్నుకొన్న** – ఏర్పఱచుకొన్న

సంఖ్య : 11 సంపుటము : 2 పుట: 8 రాగం : సామంతం

14 ఏమిసేయుదు నింక నిందిరాధీశ్వరుఁడా
నీ మఱఁగు చొచ్చితిని నెరవేర్తు గాక ॥పల్లవి॥

కడివోని జవ్వనము కలిమిలే మెఱుఁగునా
బడినుండి మిగుల రుణపరచుఁగాక
అడియాస లెల్లాఁ బుణ్యముఁ బాప మెఱుఁగునా
వెడగుఁదనలో దయ విడిపించుఁగాక ॥ఏమి॥

వలపు వెఱ పెఱుఁగునా వాఁడిమొనలకు నైన
బలిమిఁ దూరించఁ జలపట్టుఁగాక
చలనమందిన మనసు జాతి నీ తెఱుఁగునా
కలిసి హేయమున కొడిగట్టించుఁగాక ॥ఏమి॥

యెలమి రతిపరవశము యెగ్గసి గ్గెఱుఁగునా
బలిమిఁ దిట్లకు నొడఁబఱచుఁగాక
యిలలోన శ్రీవేంకటేశ నీ మాయ లివి
తలఁగించి యేలితివి దయసేతుగాక ॥ఏమి॥

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో కామాతురత, ధనాతురత, వలపు ఆతురత, చలించిన మనస్సుకు కలిగే భ్రాంతి పీడలను వివరిస్తున్నారు. ఓ ఇందిరాధీశ్వరా! నా బోటివాడు ఇంకనేమి సేయగలడయ్యా? నాకు చేతనైనదొక్కటే. నీఅండ జేరానయ్యా! ఇక నా జీవితం నెరవేరుతుంది. అదే నా నమ్మకం. స్వామీ! మొక్కవోని యౌవనం కలిమిలేములను లెక్కజేస్తుందా? సంగత్వం పెట్టుకొని మమ్మల్ని ఇంకా ఋణగ్రస్తులను చేస్తుంది. అడియాసతో అల్లకల్లోలమైనవాడు పాపపుణ్యాలగురించి పట్టించుకొంటాడా? అవివేకంలో దయాగుణాన్నే విడిచిపెట్టేస్తాడు కదా! ప్రభూ! వలచినవారు మొదట విడనాడేదే భయము. కత్తితో బెదిరించినా వలపు మానుకోలేరు. ఎంత తిట్టినా వలచినవారు, వారి మొండితనం మానుకోరు. చలించిన మనస్సు నీతి, జాతి లెక్కజేస్తుందా? వారిచేత యెంత హేయములైనపనులనైనా చేయిస్తుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! రతి పరవశత్వంలో వున్నవాడు సిగ్గూ యెగ్గూ యెఱుగునా? వాణ్ణెంత తిట్టినా మనని కాదులే అని దులపరించేసుకొంటాడు. తండ్రీ! ఇదంతా నీ మాయగాక మరేమిటి? దయతో నీవే నీ మాయను తొలగించి మమ్మల్ని కాపాడాలి.

★ **వెడగుదనము** – అవివేకంలో ★ **తలగించి** – తొలగించి





సంఖ్య : 438 సంపుటము : 3 పుట: 295 రాగం : ధన్యాసి

15 మెచ్చుల దంపతులార మీరేగతి
మెచ్చితి నిన్నిట మిమ్ము, మెరసె మీచేఁతలు ॥పల్లవి॥

తమ్మిలోనిమగువా వో ధరణీధరుఁడా
మిమ్ము నే నమ్మితి నాకు మీరేగతి
నెమ్మది నోయిందిరా నీరజలోచనుఁడా
కమ్మి యేపొద్దును మీరే కలరు నా పాలను ॥మెచ్చు॥

పాలజలధికూఁతుర భక్తవత్సలుఁడ హరి
మేలిచ్చి రక్షించ నాకు మీరేగతి
కేలి నో శ్రీమహాలక్ష్మి కేశవ దయానిధి
తాలిమి మీరే నాకు దాపు దండ యెపుడు ॥మెచ్చు॥

చెన్నగు రమాకాంత చెందిన వో మాధవ
మిన్నక యేపొద్దు మాకు మీరేగతి
చిన్ని యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడా
యెన్నికె కెక్కించి నన్ను నేలుకొంటి రిదిగో ॥మెచ్చు॥

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీదేవిని, ఆవిడ వల్లభుడైన తిరుమలేశుని పొగుడుతున్నారు. మెప్పులు పొందిన ఓ దంపతులారా (శ్రీదేవి, ఆమె భర్త) మాకు మీరేగతి. మిమ్ము అన్నిటిలోను మెచ్చుకొంటున్నాము. మీరు చేసే చేతలన్నీ విరాజిల్లుతున్నాయి. మిమ్మల్ని యేమని పొగడుదుము. ఓ పద్మసంభవీ! ఓ ధరణీవల్లభా! నేను మిమ్మల్నే నమ్ముకొన్నాను. మీరే నాకు గతి. నెమ్మదస్తురాలవైన ఓ ఇందిరాదేవీ! ఓ నీజరాక్షా! ఏవేళనైనా మీదంపతులే నాపాలగలరు. మీరు చూపే దయ సాటిలేనిది. ఓ క్షీరసాగర తనయా! ఓ భక్తులపైన వాత్సల్యము చూపు శ్రీహరీ! నాకు మేలు చేసి రక్షించే దిక్కు మీరే. ఓ శ్రీమహాలక్ష్మీ! దయానిధివైన కేశవా! నా ధైర్యము మీరే. నాకు అండదండలు మీరే. అందాల సుందరివైన ఓ రమాదేవీ! మా అందరి వాడవైన మాధవా! యే వేళనైనా మీరే నాకు గతి. చిన్నారి అలమేల్మంగమ్మా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఇదిగో, నన్ను గణుతికెక్కునట్లు చేసి యేలుకొనినారు. అందుచేత తరించితిని.

★ **కేలి** – క్రీడించు ★ **తాలిమి** – ధైర్యము ★ **మిన్నక** – వూరక

సంఖ్య : 145  సంపుటము : 4  పుట: 96  రాగం : దేసాళం

**20** వాసుదేవ నీవు నెలవరివి మగుడనేల
యీసరి నీవద్దనుండే యెట్టైనఁ జేయవయ్యా ॥పల్లవి॥

మాయ దెచ్చి నా బదుకు మనుజలోకాన వేసె
కాయము సంసారవార్ధి గడ్డపై వేసె
పాయపు నా తమకము భామలవలల వేసె
చాయ నేనుండి వచ్చినజా డెఱఁగ నయ్యా ॥వాసు॥

ఘనమైన యింద్రియాలు కర్మముల వాతవేసె
మనసుసంపద యామనిలో వేసె
పనులెల్ల లంపటాల పయిఁ బక్కలా వేసె
కొనకెక్కె నేనె నా గురుతు గాననయ్యా ॥వాసు॥

అంచెల నా దినములు ఆఁకటిబారి వేసె
ముంచిన నా గుణములు మోహముల వేసె
యెంచఁగ శ్రీవేంకటేశ యెందెం దున్నాఁడనో
పొంచి నీకు శరణంటి బోధించవయ్యా ॥వాసు॥

**భావ పరిమళం :**

నెలవరి అంటే సుపరిచితుడు అని అర్థం. అన్నమయ్య ఈ భక్తి సంకీర్తనలో ఓ వాసుదేవా నీవు మాకు పరాయి వాడవు కావు. సుపరిచితుడవే. మరి నన్నెందుకు మొగము చాటు చేయుచున్నావు? ఏ విధంగానైనా నన్ను నీ వద్దనే వుండేట్లు చేయవయ్యా – అంటున్నారు. ప్రభూ! మాయయనేదాన్ని తెచ్చి నన్ను బ్రతుకుమని మానవలోకంలో పడేశావు. నా శరీరాన్ని సంసారం అనే సముద్రంలో పడేశావు. నా యౌవనాన్ని వనితలపాలుజేశావు. వాళ్ళ తన్మయత్వంలో పడి అసలు నేను యెక్కడ నుండి ఇక్కడకు వచ్చానన్న జ్ఞానమునే మఱచాను. స్వామీ! ఇది చాలదన్నట్లు నా ఇంద్రియాలను కర్మలపాల బడవేసినావు. నా మనస్సును సంపదలనే వసంతవనములో బడవేశావు. వీటికితోడు అనేక లంపటములను నాకు అంటగట్టావు. అంతవరకు జ్ఞానం కావాలనుకొన్న నేను నా గుర్తునే మఱచిపోయాను. దేవా! చివరి దెబ్బ అన్నట్లుగా, నాకు తెల్లవారింది మొదలు ఆకలి అనే పిశాచానికి ఒప్పజెప్పావు. ఏవో వొకటిరెండు సద్గుణాలతో మిగిలిన నన్ను వాటినుండి కూడా మోహము అనేదానితో నిర్మూలన జేశావు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇక నా తరము కాదయ్యా! ఈ జన్మలలో యెక్కడెక్కడకు పోతానో నాకే తెలియదు. నీకే శరణన్నాను తండ్రీ! నన్ను గట్టెక్కించవయ్యా!

★ **కొనకెక్కు** – కడతేరు ★ **ఈసరి** – ఈసడింపు లేక





సంఖ్య : 410  సంపుటము : 4  పుట: 275  రాగం : దేవగాంధారి

**17** ఇందుకు ధ్రువాదు లిటు సాక్షి
చెంది నమ్మవో జీవుఁడ నీవు ॥పల్లవి॥

కొండలవంటివి ఘోరపాపములు
ఖండించును హరిఘననామజపము
నిండించును మతి నిత్యానందము
పండించునపుడె పరమపదంబు ॥ఇందు॥

జలధులవంటివి జననబంధములు
తొలఁగించును హరితూరినభక్తిది
వెలిఁగించును ఘనవిజ్ఞానంబులు
చెలఁగించును బహుసిరిసంపదలు ॥ఇందు॥

తోవరాని బహుదుఃఖము లణఁచును
శ్రీవేంకటపతిఁ జేరినశరణము
పావనంబుగాఁ బచరించు గుణము
కైవశమగు లోకములెల్లాను ॥ఇందు॥

**భావ పరిమళం :**

అన్నమయ్య భక్తిరస ప్రధానమైన ఈ కీర్తనలో ధ్రువుడుమొదలైన భక్తులంతా నేనుచెప్పబోవు దానికి సాక్షిగానున్నారు. ఓ జీవుడా నీవు కూడా ఇదే భక్తకోటికి చెంది నేను చెప్పబోవునది నమ్మవో! అంటున్నారు. సహజంగానే ఈ జీవులు చేసే ఘోరపాపాలు కొండలపరిమాణంలో పేరుకు పోయాయి. మరి వీటిని ఖండించే దారియేమిటి? ఒక్క హరినామ సంకీర్తన మాత్రమే. ఆ నామసంకీర్తనం మీ మనస్సులను సంతోషంతో నింపటమే కాదు, మీకు పరమపదమనే ముక్తిని ప్రసాదిస్తుంది. ప్రపంచంలోని జీవుల జన్మతః కలిగిన బంధాలు మహాసాగరమును, దాటినంత క్లిష్టమైన వ్యవహారము. మరి ఈ బంధాలను తొలగించగలగినదేది? హరి మీద కలిగిన భక్తి మాత్రమే. ఈ హరిభక్తి జీవిని గొప్ప జ్ఞానిని చేస్తుంది. అంతేకాదు, అంతులేని సిరిసంపదలను కూడా ఇస్తుంది. శ్రీవేంకటపతిని జేరి శరణాగతిని బొందితే, దారీ తెన్నూతెలియని అనేకదుఃఖముల నుంచి గట్టెక్కిస్తుంది. అది మనలోని సద్గుణాలను పెంచుతుంది. అంతెందుకు ఈ లోకాన్నే మనకు కైవశమగునట్లు చేస్తుంది ఈ స్వామి శరణాగతి.

★ **తూరిన** – కలిగిన ★ **తోవరాని** – దిక్కుతెలియని

సంఖ్య : 85 సంపుటము : 2 పుట: 57 రాగం : శంకరాభరణం

**18** నాటికి నాఁడుగొత్త నేటికి నేఁడుగొత్త
నాటకపుదైవమవు నమో నమో ॥పల్లవి॥

సిరుల రుక్మాంగదుచేతికత్తిధారఁ దొల్లి
వరుస ధర్మాంగదుపై వనమాలాయె
హరి నీ కృపకలిమి నట్లనే అరులచే
కరిఖడ్గధార నాకుఁ గలువదండాయె ॥నాఁటి॥

మునుపు హరిశ్చంద్రు మొనకత్తిధారఁ దొల్లి
పొనిగి చంద్రమతికిఁ బూవు దండాయె
వనజాక్ష నీ కృపను వరశత్రు లెత్తినట్టి
ఘనఖడ్గధార నాకుఁ గస్తూరివాటాయ ॥నాఁటి॥

చలపట్టి కరిరాజు శరణంటే విచ్చేసి
కలుషముఁ బెడఁబాపి కాచినట్టు
అలర శ్రీవేంకటేశ ఆపద లిన్నియుఁ బాపి
యిల నన్నుఁ గాచినది యెన్నఁ గతలాయ ॥నాఁటి॥

**భావ పరిమళం :**

అనేక భాగవత గాథలను వుదహరిస్తున్న ఈ కీర్తనలో అన్నమయ్య ఆ గాథలన్నీ ఆనాటికి ఆనాడు బాగుంటాయి, నేటికి నేడూ కొత్తగా వుంటాయి. ఈ జగన్నాటకమునకు ఆ పరమాత్మే సూత్రధారి. అటువంటి దైవరాయా! నమోనమో అంటున్నారు. ధర్మరక్షణ కోసం తన కొడుకు ధర్మాంగదుడి తల ఖండించుటకు సిద్ధపడ్డాడు రుక్మాంగద మహారాజు. హరికృప వలన ఆ ఖడ్గం వనమాలగా మారిపోయింది. శ్రీహరి కృపవుంటే శత్రు ఖడ్గధారలు కలువదండలైపోతాయి. ఆ త్రేతాయుగంలో హరిశ్చంద్ర మహారాజు విశ్వామిత్రునివలన కాటికాపరియై తన వృత్తిధర్మంగా భార్య చంద్రమతి తలనరకబోతే ఆ కరవాలము కూడా పూలదండయైనది. ఓ పద్మనయనా! నీ కృపవుంటే శత్రువుల కరవాలములన్నీ నిరుపయోగమైపోతాయి. అది మాకు కస్తూరి పూతవలె చల్లగా వుంటుంది. కొలనులో గజేంద్రుడు మొసలిచే పీడించబడి నిన్ను శరణు వేడగానే నీ చక్రాయుధంతో మకరిని నరికి కరిరాజును కరుణించావు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆనాడు ఆ పురాణ పురుషుల్నే కాదు, ఈనాడు నాబోటి శరణాగతులను కూడా కాపాడినదీ కొత్తకొత్త కథలవుతున్నాయి.

★ **అరిఖడ్గధార** – శత్రువుల కత్తివేటు ★ **కలుషము** – కష్టము





సంఖ్య : 231 సంపుటము : 4 పుట: 155 రాగం : బౌళిరామక్రియ

**19** జ్ఞానం బొకటే జగమున కధికం మరి
నానావిధములు నటనలు ॥పల్లవి॥

బహుదానఫలము పడయుట కంటే
యిమమున వైరాగ్య మెక్కుడు
సహజకర్మములు శతములకంటే
అహిశయనుని భక్తధికము ॥జ్ఞానం॥

ధరఁ దపము లనంతంబులకంటే
గరిమల శాంతము ఘనము
విరసాచారము వేవేలకంటె
హరినామపఠన మధికము ॥జ్ఞానం॥

ఆవల వ్రతముల అన్నిటికంటే
శ్రీవైష్ణవమే శేఖరము
శ్రీవేంకటేశ్వరు చేఁతలె యివిగన
సేవ యిదొకటె చింతింప ఘనము ॥జ్ఞానం॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన అత్యద్భుత కీర్తనలో యేమంటున్నారో చూడండి. మానవుడు ద్విపాద పశువు. వాడికి జ్ఞానంబొక్కటి తోడైతే జగమున కధికుడౌతాడు. అదిలేక యెన్ని పనికిరాని విద్యలు నేర్చినా అవి అనేకమైన నటనలతో వాడి పొట్టపోసుకోవడానికి వుపయోగపడతాయేకాని ముక్తిని అందించవు. ముక్తికి దగ్గరదారి జ్ఞానం మాత్రమే. అనేక దానములను చేసి గొప్ప ఫలమును పొందుట కంటే ఇహలోకమున వైరాగ్యముతో బ్రతుకుట మేలు. మనకి సదాచారము ప్రకటించిన అనేక కర్మలకంటె పన్నగశయనుడైన హరిభక్తి అధికమైనది. ఈ భూలోకంలో అనేక విధములుగా తపమునాచరించి వేసారుటకంటే శాంతస్వభావుడై పెద్దల మన్నన పొందుట మేలు. విరుద్ధములైన అనేక ఆచారములకంటె హరినామ సంకీర్తనమే అత్యధికము. ఈ ప్రపంచంలో అనేక వ్రతములు వున్నాయి. వాటన్నిటికంటె శ్రీవైష్ణవదీక్ష చేపట్టుట అత్యధికము. మన చేతలనన్నీ నియంత్రించే శ్రీవేంకటేశ్వరుని సేవలే చింతింపగా ఘనమైనవి. దీని దెలియుటయే జ్ఞానము.

★ **శేఖరము** – ధరింపదగినది ★ **సహజకర్మలు** – ఆచారము చెప్పిన కర్మలు

సంఖ్య : 458 సంపుటము : 15 పుట: 308 రాగం : సాళంగనాట

**24 కామక్రోధవికారజలనిధికి కలశభవుఁడు మీ నామము**
**భీమగుణత్రయబిసకాండములకు బిరుదుహంస మీ నామము ॥పల్లవి॥**

**బహుళ దురితపటుపటల మను ఘన**
**గహన దావశిఖి గణుతింపఁగ మీ నామము**
**సహజకలుషతమిస్రముఁ దొలఁగింపఁగ నహ-**
**రహముల వెలిఁగెడి రవిబింబ మైనది మీ నామము ॥కామ॥**

**జననబంధదోషము లను గిరులకు**
**ననుపమ మగు నిష్ఠుర నిర్ఘాతం బరయఁగ మీ నామము**
**ఘనసంసారం బనుపెనుసర్పం**
**బునకును ముదమున గరుడుఁడు ॥కామ॥**

**తీరని పంచేంద్రియ మేఘములకు**
**ఘోరమారుతవిహారం బై నది మీ నామము**
**శ్రీరమణీశ్వర శ్రీవేంకటపతి**
**ధారుణిఁ బొగడఁగఁదగినది మీ నామము ॥నామ॥**

**భావ పరిమళం :**

నారికేళపాకంలో కవిత చెప్పగల, పెదతిరుమలయ్య ఈ కీర్తనలో శ్రీహరి నామ మహిమను కొనియాడుతున్నారు. ఓ శ్రీహరి! కలశభవుడైన అగస్త్యుడు మీ నామ సంకీర్తన చేసి కామక్రోధాది వికారములను అణచగలిగినాడు. సత్త్వరజస్తమో గుణములని పేర్కొనిన త్రిగుణములను విషవృక్షములంటారు. వాటికి హంస విరుగుడు. అయితే త్రిగుణాల విషవృక్షానికి మాత్రం పరమహంసయైన శ్రీహరియే విరుగుడు. గొప్ప పాపములనెడి కారడవిలో చిక్కుకొన్న వారికి మీనామము దావాగ్నియై కాల్చి ఆ యడవినుంచి వారిని రక్షిస్తుంది. కలుషము అనెడిగాడాంధకారమును చీల్చగల రవి బింబము మీ నామగానమే. జన్మ బంధాలనే పర్వతపంక్తులకు కఠినమైన పెద్ద సుత్తిదెబ్బలు మీ నామ సంకీర్తనములు. ఘనసంసారమనే ఘోరసర్పానికి మీ నామము గరుత్మంతుని వలె మృత్యువు. పరమపురుషా! పంచేంద్రియములనబడు, కారుమేఘములను పటా పంచలు చేయగలిగిన ప్రళయ మారుతము శ్రీహరి నామ సంకీర్తనము. శ్రీరమణీవల్లభుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ భూమిపై పొగడ దగినది యేదన్నా వుందంటే, అది మీ నామసంకీర్తన మాత్రమే. (నా భావనలో పెదతిరుమలయ్య ఉద్దండుడు.)

★ **నిష్ఠురనిర్ఘాతము** – కఠినమైన పెద్ద సుత్తిదెబ్బ
★ **భీమగుణత్రయము** – భయంకరమైన త్రిగుణములు





సంఖ్య : 150 సంపుటము : 4 పుట: 101 రాగం : దేసాక్షి

**21 ఇందుకేది వుపాయమో యీశ్వర నీకే తెలుసు**
**మందలించ నశక్తుఁడ మరి నీ దాసుఁడను ॥పల్లవి॥**

**ధీరుఁడనై ధరలోన దేహము నే మోచితి**
**కోరి పుణ్యపాపాలకు గురియునైతి**
**వూరట యేమిటా లేదు వోప నని మానరాదు**
**తీరదు భోగించక దినదినకర్మము ॥ఇందు॥**

**గరిమ సంసారినైతి కంటిఁ బెక్కుసుతులను**
**యిరవుగఁ గట్టుకొంటి నీలంపటాలు**
**వెరవేమీ నెరఁగను విడువ వెంతైనాను**
**హరిహరి రాచినా సమయపు బలుకాంక్షలు ॥ఇందు॥**

**అట్టె గురుముఖమైతి నాతుమలో నినుఁగంటి**
**జట్టిగొని నీ పాదాలే శరణంటిని**
**గట్టిగా నలమేల్మంగకాంతుఁడ శ్రీవేంకటేశ**
**యిట్టె ని న్నెరఁగలేని దిన్నాళ్లు నా నేరమి ॥ఇందు॥**

**భావ పరిమళం :**

మానవుడు దినదిన కర్మలు చేయకా తప్పదు, వాటి ఫలితం అనుభవించకా తప్పదు అని అన్నమయ్య అంటున్నారు. ఈ కర్మలతో సరిపెట్టుకోక సంసారలంపటాన్ని తలకు కట్టుకొన్నాను. దీంట్లోంచి తప్పించుకోలేకపోతున్నాను. ఈశ్వరా! ఇందుకేదయ్యా! వుపాయము. నన్ను నేను మందలించ నశక్తుడను. కాకపోతే నీ దాసాను దాసుణ్ణి నన్నెట్లు రక్షించాలో, నీకే తెలుసు. ప్రభూ! నేను ధీరునివలె మానవదేహాన్ని మోస్తున్నాను అందువల్ల కోరి, కోరి పాపపుణ్యాలు రెండూ చేస్తూనే వున్నాను. నాకు వూరట అనేదేలేదు. పోనీ నేను వీటిని ఒప్పను అని త్యజించనూ లేను. ఉన్నంతలో భోగించక మానను. ఈ దినదినకర్మలవల్ల మరింత బిగిసి కట్టుబడిపోయాను. ఇది చాలదన్నట్లు సంసారినై కొడుకులను కన్నాను. ఇక వీళ్ళవలన అనేక లంపటాలలో చిక్కుకుపోయాను. ఇవి నన్ను నిలవనీయుటలేదు, నన్ను వదలుటలేదు. హరిహరీ! బలమైన ఈ కాంక్షలు చావవూ నన్ను బ్రతుకనీయవు. ఇది యిట్లావుండగా ఈశ్వరకృపవల్ల గురుముఖుడనై నా ఆత్మలో నిను దర్శించగలిగాను. కృతనిశ్చయుడనై నేను శరణంటినయ్యా నిన్ను పురుషోత్తమా! అలమేల్మంగ విభుడవైన శ్రీవేంకటేశ్వరా! నేను నిన్నినాళ్ళు తెలియకపోవుట నా నేరమే తండ్రీ!

★ **జట్టిగొని** – వెలకట్టి ★ **ఊరట** – ఓదార్పు

సంఖ్య : 311 సంపుటము : 2 పుట: 208 రాగం : శ్రీరాగం

**22 ఇట్టివాఁడవు సులభ మెట్లా నైతివో కాక**
**అట్టి నీదయ దలఁచి అరుదయ్యీ నాకు** ॥పల్లవి॥

**యేమేమి చదువవలె నెందరి నడుగవలె**
**ఆముక నిన్నుఁ దెలిసేయందుకొరకు**
**భూమిలోన నెంతేసి పుణ్యములు సేయవలె**
**కామించి నీపై భక్తిగలిగేటి కొరకు** ॥ఇట్టి॥

**యెన్ని జన్మా లెత్తవలె నెందెందు వెదకవలె**
**కన్నుల నీ సాకారము గనేకొరకు**
**వున్నతి నెంతగాలము వొగ్గి కాచుకుండవలె**
**విన్నవించి నీ సేవ వేఁడుకొనేకొరకు** ॥ఇట్టి॥

**యేదేది యెఱఁగవలె యె ట్లభ్యసించవలె**
**నీ దాసుఁ డనిపించుకొనేటికొరకు**
**సాదరాన శ్రీవేంకటేశ్వర నన్ను మన్నించితి**
**వేదెసఁ బొగడవలె యింత సేసేకొరకు** ॥ఇట్టి॥

**భావ పరిమళం :**

అన్నమయ్య యేమంటున్నారో వినండి. నీవు ఇట్టివాడవని తెలియని వారెవరు? నీవు సులభుడవు అందామా అంటే అందరినీ సులభంగా దయతలుస్తావా? నాబోటివానికి అదీ అరుదయ్యీనయ్యా! – అంటున్నారు. ఓ దేవదేవా! నీజాడ తెలియాలంటే నేనెంతమందిని అడగాలి, యెంత చదువుకోవాలి. ఈ భూమిపై యెన్ని పుణ్యకార్యాలు చేయాలి. యెంత భక్తిని నీపై పొందాలి? ఇటుగాక వూరకే నీవు నాకు దక్కవలెనంటే సాధ్యమా? నీకోసం నేను యెన్నెన్ని జన్మలెత్తాలి, యేమేమి జన్మలెత్తాలి యెవరు చెప్పగలరు? పోనీయెంతకాలం వేచివుండాలో, యెవరన్నా చెప్పగలరా? నాకోరిక నీపాదసేవ వొక్కటే అని నేను చెప్పగలగాలంటే యెంతకాలం పడుతుందో యెవరికి తెలుసు? ఏమేమి తెలియాలి, యెట్లా అభ్యసించాలి, నీ దాసులనిపించుకోవాలంటే యెంత శ్రమపడాలి? ఎట్లాగైతేనేమి, నన్ను మన్నించావు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీదయ ఇంతగా కలుగవలెనంటే నిన్నెంత కీర్తించాలయ్యా?

★ **ఆముక** – పైకొని ★ **కామించి** – కావాలనుకొని





సంఖ్య : 295 సంపుటము : 15 పుట: 199 రాగం : శుద్ధ వసంతం

**23 అన్నిటికి మూలము శ్రీహరియె సుండి**
**విన్నవార కన్నవార విచారించుకొనుఁడీ** ॥పల్లవి॥

**దైవమును దలఁచక తత్వమును నెఱుఁగక**
**భావించుధ్యానము బట్టబయలు సుండీ**
**తోవ దెలుసుకొనక దొడ్డమతస్థుఁడు గాక**
**కావలెనంటే మోక్షము కలుగదు సుండీ** ॥అన్నిటికి॥

**అతిభక్తి నిలుపక హరిఁ గొనియాడక**
**వెతకేటిచదువులు వృథా సుండీ**
**యితరము లుడుగక యిన్నిటిపై రోయక**
**జితకాముఁడు గాఁబోతే చిక్కదు సుండీ** ॥అన్నిటికి॥

**పాపములు విడువక పరిశుద్ధుఁడు గాక**
**యేపున జన్మఫల మీడేరదు సుండీ**
**దాపుగా శ్రీవేంకటేశుదాసుఁడ నంటేఁగాక**
**తీపుల బ్రహ్మానందము తిరము గాదు సుండీ.** ॥అన్నిటికి॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య ఆవిష్కరిస్తున్న ఈ చక్కటి భక్తిరస ప్రధానమైన కీర్తననాలకించండి. అన్నిటికీ మూల కారణము పరమాత్ముడైన శ్రీహరియే సుండీ! మీలో, ఆయన గురించి విన్నవారు కన్నవారు (దర్శన భాగ్యం కలిగినవారు) వుంటే... ఆయన గుణగణాలను విచారించుకొనండి. అయ్యలారా! దైవాన్ని తలచకుండా, ఆయన తత్త్వము నెఱుగకుండ, ధ్యానముతో వైష్ణవుడు కాకపోతే శ్రీహరిని యెఱుగకపోతే మోక్షం సిద్ధించదు. హరిమీద భక్తి నిలుపక, హరిని కీర్తించక హరివున్నాడా లేడా అని తర్కించే చదువులన్నీ వృథాయే సుండీ! (సుమా!) కామక్రోధాలవంటి దుర్గుణాలుడుగక వాంఛలపై రోయక కామభావము యెట్లా నశిస్తుంది? సాధ్యం కాదు సుమా! పాపచింతన విడువక. పరిశుద్ధాత్ముడు గాక జన్మలఫలితము తీరదు సుమా! స్వామిని చేరుకొని ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ దాసుడనయ్యా! అనకపోతే మనస్సులో యాతనననుభవిస్తుంటే, బ్రహ్మానందము స్థిరముకాదు సుండీ

★ **దొడ్డమతస్థుడు** – శ్రీవైష్ణవుడు ★ **తీపుల** – యాతనతో

సంఖ్య : 192   సంపుటము : 15   పుట: 128   రాగం : సాళంగనాట

**28** **మునులాల జనులాల ముంచిన దేవతలాల**
**పనిపూని మొక్కరో పరమాత్మునికి** ॥పల్లవి॥

**కనకాచలమువంటి ఘనదివ్యరథముపై**
**వనజాక్షుఁ డెక్కి వీథివచ్చీవాఁడె**
**వెనుదళమై నడచె విష్వక్సేనుఁ డిదె దేవిడి**
**కని మని సేవించరో కన్నులపండుగలు** ॥మును॥

**గగనవాహినివంటి గరుడధ్వజముతోడ**
**అగడై వీథినేఁగే చక్రాయుధుఁడు**
**పగటు విజయముతో పాంచజన్యము వట్టీని**
**నిగిడి కొనియాడరో నిచ్చ కల్యాణములు** ॥మును॥

**వరుస భాగ్యదేవతవంటి యలమేలుమంగ**
**వుర మెక్కఁగ శ్రీవేంకటోత్తముఁడు**
**తిరమై నెలవుకొనె దివ్యనగరులోనను**
**శరణని బదకరో సాక్షాత్కారమున** ॥మును॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య రచననాస్వాదించండి. శ్రీవేంకటేశ్వరుడు వీధుల వీధుల వెంట వూరేగుతున్నాడు. ఓ మునులారా! జనులారా! పరవశులైన దేవతలారా! ఈ పరమాత్మునికి వినమ్రులై మొక్కండి. ఈ స్వామి వూరేగుతున్న రథము మేరుపర్వతమువలెనున్నది. దానిమీద వనజాక్షుడెక్కి వీధులలో వూరేగవచ్చినాడు. స్వామి రథము వెనుకనే విష్వక్సేనుడు తన దళములతో నడచుచున్నాడు. మీ కన్నులకు పండుగవలెనున్న ఈ దేవదేవుని సేవించండయ్యా! స్వామి వారి గరుడధ్వజము గగనవాహినియైన ఆకాశగంగవలెనున్నది. స్వామివారి సుదర్శనచక్రము కూడా వూరేగుచున్నది. తన విజయమునకు సంకేతముగా పాంచజన్య శంఖమును స్వామి పూరించుచున్నాడు. నిత్యశోభనములతో విరాజిల్లుతున్న హరిని భక్తితో స్తుతించండి. వరుసలో భాగ్యములనొసగు అలమేల్మంగమ్మ వురమెక్కి శ్రీవేంకటేశ్వరుని అలరించగా, స్థిరముగా నెలకొనిన దివ్యనగరము తిరుమలలో, వూరేగుచున్నారు. ఈయన సాక్షాత్కారము చేసికొని శరణని బ్రతకండయ్యా!

★ **కనకాచలము** – మేరుపర్వతము ★ **నిగిడి** – విజృంభించి





సంఖ్య : 306   సంపుటము : 15   పుట: 206   రాగం : పాడి

**25** **ఇవి నమ్మి గర్వించ నేమిటికి**
**వివేకించి కొలిచితే విష్ణుఁడే సతము** ॥పల్లవి॥

**కల రిందరుఁ జుట్టాలు కాయముతో నున్న నాళ్లు**
**వెలయ నంతటిమీఁద వింతవారే**
**నిలుచును విద్యలెల్లా నేరుపుగలన్నాళ్లు**
**తలఁపు మఱచితేను తనలోనే యడఁగు** ॥ఇవి॥

**యెక్కుడుగా నుతియింతు రీవిగల యన్నాళ్లు**
**చక్కఁగా నూరకుండితే చప్పచప్పనే**
**గక్కనఁ బంపుసేతురు కలిమిగలన్నాళ్లు**
**కక్కసానఁ బేదయైతే కైకొన రెవ్వరును** ॥ఇవి॥

**పను లేమైనాఁ జెల్లు బలిమిగలన్నాళ్లు**
**తన లా వుడిగితేను తడఁబాట్లే**
**వెనుకొని కొల్చితే శ్రీవేంకటేశుఁడే రక్షించు**
**మినుకుల భోగములు మీసాలపై తేనెలు** ॥ఇవి॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య యేమంటున్నారో వినండి. ఇదిగో నేను చెప్పబోయే వాటిని నమ్మి, గర్వించుట దేనికయ్యా? వివేకము చూపి కొలిచినవారికి విష్ణువే సత్యమూ, శాశ్వతమూ అయివున్నాడు. ఆలోచించి చూడండి. మనం చుట్టాలు అని మురిసిపోతున్న వీరంతా మన శరీరం వున్నంతవరకే కదా? దాని తర్వాత యెవరికెవరు యేమౌతారు. మనం నేర్చుకొన్న విద్యలన్నీ మతిమరపురానంతవరకే. అది వస్తే అన్నీ మనలోనే అణగారిపోతాయి. మనకు సిరిసంపదలున్నంతకాలం అందరూ మాటవింటారు. సంపదలేనినాడు ఒక్కడూ నీ మాట వినడు. నీవు దానధర్మాలు చేస్తున్నంతకాలము ఆశ్రితులు నిన్ను ఆకాశానికెత్తేస్తుంటారు. కానీ చప్పన నీవు చేయివిదిలించనినాడు ఒక్కడూ నీ వద్దకు రాడు. నీకు బలిమివున్నన్నాళ్ళూ యేమిచేసినా చెల్లుతుంది. ఒక్కసారి తన బలం వదిలిపోతే యెంత తడబడినా ప్రయోజనం వుండదు. వెంటబడి కొలిచినవారిని శ్రీవేంకటేశ్వరుడు తప్పక రక్షిస్తాడు. అలాకాకుండా భోగలాలసులైన వారికి సుఖం మీసాలకంటిన తేనె నాకినట్లే క్షణకాలపు ఆనందం సుమా!

★ **కక్కసాన** – కష్టాల్లో వున్నప్పుడు ★ **మినుకుల** – అప్పుడప్పుడూ కలిగే

సంఖ్య : 378   సంపుటము : 15   పుట: 254   రాగం : బౌళి

**26 ఇటువంటివారల నెట్టు బోధించఁగ వచ్చు**
**కుటిలపుబుద్ధులచే కుందుదురు తాము** ॥పల్లవి॥

**పాపపుణ్యకర్మదేహి పసిరికాయపురువు**
**కూపములోని కప్ప దుర్గుణబద్ధుఁడు**
**దీపమువేటమృగము తెగని యాసోదకాఁడు**
**దూపము కాకిభక్తి యెందును లేనివాఁడు** ॥ఇటు॥

**మతిచంచలపువాఁడు మద్దెలలోనియెలుక**
**వ్రతియై కోరెడువాఁడు వలలో మీను**
**కుతిలపుటహంకారి గుండెమీఁది చింబోతు**
**అతికాముకుఁడు జిగురంటుకొన్న పికిలి** ॥ఇటు॥

**దేవతాంతరపరుఁడు తేనెలోఁబడిన యీఁగ**
**భావించి కాననివాఁడు బైసికొక్కెర**
**శ్రీవేంకటాధీశ్వరుసేవించక మోక్షానకుఁ**
**బోవల ననేటివాఁడు బూరుగుపై చిలుకా** ॥ఇటు॥

**భావ పరిమళం :**

ఇది పెదతిరుమలయ్య అద్భుతసృష్టి. ఏమి కవితాచాతుర్యం అని ఆశ్చర్యంతో తలమునకలౌతారు. ఓ ప్రజలారా! ఇటు నేను వుదహరించినవారికి యేవిధముగా బోధించగలము? వాళ్ళు కుటిలబుద్ధితో కుళ్ళిపోతూనే వుంటారు. నిత్యమూ పాపపుణ్యములు చేసే కర్మిష్ఠి మేడి పండులోని పురుగువంటివాడు. దుర్గుణములచే బద్ధుడైనవాడు బావిలో చిక్కుకుపోయిన కప్పలాగ అవస్థలుపడతాడు. తీరని, ఆశపోతు దీపము పురుగులాగా నశించిపోతాడు. కాకి భక్తి కలవాడు యెందుకూ కొఱగాని వాడవుతాడు. అయ్యలారా! చిత్తచాపల్యం కలవాడు మద్దెలలో దాగికొనిన యెలుకలాగా తిప్పలు పడతాడు. అతివలపై కోర్కెగలవాడు వలలోపల చిక్కిన చేపలాగా మృత్యువాతపడతాడు. కుటిలుడైన అహంకారి పొగరుబోతు పొట్టేలువలె చెడిపోతాడు. అతి కామాతురుడు వేటమృగములాగా చెడి నశిస్తాడు. స్వామీ! దేవతలమధ్య అంతరము నెంచువాడు తేనెలోబడ్డ ఈగవలె చెడిపోతాడు. శ్రీహరిని భావించి కాననివాడు కొంగ జపం చేస్తూనే వుంటాడు. శ్రీవేంకటేశుని సేవించక ముక్తికోరేవాడు బూరుగుచెట్టుమీద చిలుకలాగా చెడిపోతాడు.

★ **అసోదకాడు** – ఆశపోతు ★ **బైశికొక్కెర** – ఒంటికాలి కొంగ





సంఖ్య : 119   సంపుటము : 15   పుట: 75   రాగం : నాట

**27 నానామహిమల శ్రీనారసింహము**
**పూని మమ్ము రక్షించీ పొగడెద నిదిగో** ॥పల్లవి॥

**కొండవంటి వేదాద్రిగుహలలో సింహము**
**దండి భవనాశి యేటిదరి సింహము**
**అండ నారుశాస్త్రముల అడవిలో సింహము**
**నిండి అహోబలముపై నిక్కిచూచీ నదిగో** ॥నానా॥

**దిట్ట యోగీంద్రుల మతితెరమఱఁగు సింహము**
**జట్టిగొన్న శ్రీసతితో జంటసింహము**
**పట్టి దైత్యుల వేఁటాడే బలుదీము సింహము**
**మెట్టి అహోబలముపై మెఱసీఁ దా నదిగో** ॥నానా॥

**పలుదేవతల వెనుబలమైన సింహము**
**కెలసి కంబాన బెనఁగిన సింహము**
**అలరి శ్రీవేంకటేశుఁ డైనట్టి సింహము**
**కొలువై అహోబలాన గురుతాయ నిదిగో** ॥నానా॥

**భావ పరిమళం :**

నేడు నృసింహజయంతి. ఈ పర్వదినాన పెదతిరుమలయ్య పాడిన ఈ అహోబల నారసింహస్వామి కీర్తన వివరించటం నాసుకృతమే మరి. నానా మహిమలు కలిగిన ఈ అహోబల శ్రీనారసింహుడు, యిదిగో మమ్మల్ని రక్షించుట కొఱకు మన యెదురుగనెవున్నాడు. ఈతనిని కీర్తించెదము గాక! ఎదురుకొండ, అయిన వేదాద్రి యొక్క గుహలో ఈ సింహము వెలసియున్నది. భవనాశి నదీ తీరమున ఈ సింహము వున్నది. క్రూరమైన స్వభావముగల ఈ అడవి సింహము ఆరుశాస్త్రములలోను దిట్ట సుమా! అదిగో నిక్కి చూస్తున్న ఈ సింహమే అహోబలముపై వెలసినాడు. ఈ సింహము దిట్టఅయిన యోగీంద్రుల మానసములనే తెఱచాటున ప్రత్యక్షమగువాడు. జత అయిన శ్రీలక్ష్మిని, తొడపైన నిడుకొనిన సింహమీదేవుడే. హిరణ్యకశిపుని రాక్షసపుత్రులను పట్టి వధించినదీ సింహమే. అదిగో ఈ అహోబలం కొండను మెట్టి మెఱసిపోతున్న సింహమును కనులారా చూడండి ఈ సింహము అనేకులైన దేవతలందరికీ వెన్నెముకవలె బలమును చేకూర్చువాడు. స్తంభమునుంచి ఆవిర్భవించి, పెనగి హిరణ్యకశిపుని వధించినదీ సింహమే. తిరుమల శ్రీవేంకటేశ్వరుడైనది కూడా ఈ సింహమే. ఇదిగో అహోబలమునకు గుర్తుగా కొలువైన సింహము, యీ నారసింహుడే.

★ **కెలసి** – ఉగ్రుడై ★ **జట్టిగొన్న**– వశపరచుకొనిన

సంఖ్య : 156 సంపుటము : 15 పుట: 104 రాగం : సాళంగనాట

32 ఈతని కెదురులేరు యెక్కడ చూచిన నిదె
చేతనే ప్రతాపముతో చెలరేఁగీ నితఁడు ॥పల్లవి॥

దిక్కులు సాధించుటకు దేవదేవోత్తముఁడదె
యెక్కెను తేరుమీఁద యెచ్చరికతో
చక్కాడి దనుజులను సమరములు గెలిచి
యిక్కువతో వీథివీథి నేఁగీ నిదివో ॥ఈతని॥

సకలాయుధములునుఁ జక్రము చేతులఁబట్టి
వెకలియై శంఖము వేవేగ నాడించె
వికలులై రాక్షసులు వీఁగి లోఁగి హతులైరి
అకలంకుఁ డీ హరి అన్నిటాను మించెను ॥ఈతని॥

విజయధ్వజము నదె వీఁడె శ్రీవేంకటేశుఁడు
భజన నలమేలుమంగ పలుమారు మెచ్చెనదె
త్రిజగములు నితఁడె దిక్కై కాచీనిదె
గజబిజ లింక నుడుగరో రాక్షసులు ॥ఈతని॥

**భావ పరిమళం :**

దేవదేవోత్తముడైన శ్రీహరి తేరు (రథము) సాగిపోతున్నది. పెదతిరుమలయ్య పరవశంతో ఈ కీర్తననందుకొన్నారు. ఈ తిరుమలేశునికెదురు లేదు. ఎక్కడచూచినా ఈతని మహిమయే. ఇతడు తన ప్రతాపముతో చెలరేగిపోతున్నాడు, అని అంటున్నారు. దేవదేవోత్తముడైన ఈ స్వామి అన్ని దిక్కులను గెలిచినాడు. అందుకని తన తేరుపై వూరేగుచున్నాడు. ఈయన దనుజులను డొక్కచించి డోళ్ళు కట్టినాడు. వారిపై గెలిచి నేడు, దర్పముతో సుస్థిరముగా వీధివీధి వూరేగుతున్నాడు. ఈ నారాయణుడు తన సమస్త ఆయుధములను కూడబెట్టుకొని చక్రాయుధుడై శంఖమును అనేక ధ్వనులతో పూరించుచూ శీఘ్రముగా పోవుచున్నాడు. వికలులై భీతిల్లిన రాక్షసులు వీగిపోయి లొంగిపోయారు. నిష్కళంకుడైన శ్రీహరి అన్నిటిలో మించిపోయాడు. అదిగో ఆకనిపిస్తున్నదే విజయధ్వజము. వీడే శ్రీవేంకటేశ్వరుడు. ఆయనను భజించే అలమేలుమంగ ఆయనను యెన్నోవిధములుగా పొగడుతూ మెచ్చుకుంటున్నది. త్రిజగములలోను దిక్కులను రక్షించేవాడీ స్వామియే. ఓ రాక్షసులారా! గజిబిజిగా మీరంతా పారిపోండి.

★ **అకలంకుడు** - నిష్కళంకుడు ★ **ఇక్కువ** - స్థిరముగా





సంఖ్య : 324 సంపుటము : 15 పుట: 218 రాగం : ముఖారి

29 ప్రయాసపడవద్దు బయలు వెదకవద్దు
క్రియ యెఱిఁగినఁజాలు గెలుతు మిందుననే ॥పల్లవి॥

శ్రీపతి సులభుఁడు చింతించ నేర్చిన
దీపించు మనసు కొనితేవలదు
చేపట్టుఁగుంచము కడుజిహ్వకుఁ దిరుమంత్రము
దాపగు తులసితీర్థము నఱచేతిది ॥ప్రయాస॥

అదే వీనులపండుగ ఆచార్యోపదేశము
ముదమున నొసలనే మొక్కు లున్నవి
హృదయము నిక్షేపము యెఱిఁగితే సుజ్ఞానము
సదరము భుజములఁ జక్రలాంఛనములు ॥ప్రయాస॥

తావుగ దేహమందు ద్వాదశనామములకు
సావివోని సంకల్పమే శరణాగతి
శ్రీవేంకటేశుఁడే దిక్కు జీవులకు నెల్లాను
దేవుఁ డితఁడే మనకుఁ దెలుసుకోరో ॥ప్రయాస॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య శ్రీహరినెరుగుటకు బయట యెక్కడో వెదకనవసరంలేదు. ప్రయాసపడవద్దు. ఆ శ్రీహరిని యెట్లా ధ్యానించాలి అనే క్రియ నేఱిగిన జాలును అంటున్నారు. చింతించి (ధ్యానించి) తెలిసికొంటే, శ్రీపతి అతి సులభుడు. ఆయన భక్తుల మనస్సులలో దీపించుతూ వుంటాడు. ఆకలితోవున్నవాని నాలుకకు తిరుమంత్రం, నాలుగు ముంతల ధాన్యం. తులసితీర్థం చేతిలోపోసికొని త్రాగుటకే కాని ఆకలి తీర్చదు. నీ ఆచార్యుడు చేసిన వుపదేశము నీ వీనులకు పండుగే. నీనొసటిమీదనే శ్రీహరి మొక్కుబడియైన నామమున్నది. వైష్ణవులు భుజములపై ధరించిన శంఖుచక్రలాంఛనములు, బాహ్య శుద్ధికే. కాని హృదయములో నిక్షిప్తమైయున్న సుజ్ఞానము మాత్రము ఆ శ్రీహరి శరణాగతియే. ఈ మానవ దేహమందు పదిరెండు పుండ్రములకు తావైయున్నది. పరమమైన సంకల్పము శ్రీహరి శరణాగతి యొక్కటే. శ్రీవేంకటేశ్వరుడే జీవులకు సరియైన దిక్కు. అయ్యా! ఇది తెలిసికొనండి. దేవుడంటే ఆ తిరుమలేశుడే.

★ **కుంచము** - నాలుగు ముంతల పరిమాణము ★ **సావివోని** - కాలము తీరని

సంఖ్య : 360  సంపుటము : 15  పుట: 255  రాగం : గుజ్జరి

**30 దైవముచేసినచేఁత తప్పించరాదు**
**కావలసిన పనులు కాకమానవు** ॥పల్లవి॥

**పొంకముగానివానికి బుద్ధు లెన్నినేరిపినా**
**వంకర కొంకరేకాని వశముగాఁడు**
**సంకుఁ బూసదెచ్చి యెంత సానఁబట్టి తోమినాను**
**సుంకించి ముత్యముతోడి సూటికి రాదు** ॥దైవము॥

**యెలమితోఁ గురూపి నెంత సింగారించినాను**
**అలయికలేకాని అందముగాదు**
**మలసియిత్తడి దెచ్చి మాడలుగాఁ జేసితేను**
**కలసహజమేకాని కనకము గాదు** ॥దైవము॥

**యిరవుగా నిగ్గడికి నెంత పెండ్లిసేసినాను**
**పొరపొచ్చెమె కాని పొందఁగరాదు**
**సరుగ శ్రీవేంకటేశ్వరుదాసుఁడై తేఁ గాని**
**సరినేమిటా జ్ఞానము సమకొనరాదు** ॥దైవము॥

**భావ పరిమళం :**

చక్కటి జ్ఞానబోధ చేస్తున్నారు పెద్దతిరుమలయ్య. దేవుడు చేసిన చేతలు బహు చిత్రవిచిత్రముగా వుంటాయి. వాటిని తప్పించుట యెవ్వరి తరమూ కాదు. మనకు ఇష్టమైనా కాకపోయినా, కావలసిన పనులు కాకమానవు కదా! మరి ఇంకా ఈ పీకులాట దేనికి చెప్పండి. మూర్ఖుడికి యెన్ని మంచి బుదులు నేర్పించినా వంకరగా ఆలోచిస్తాడు కాని, వశముకాడు. నత్తగుల్లను తీసికొనివచ్చి యెంత గొప్పగా సానబట్టినా ముత్యమవుతుందా? కురూపియైన వనితను తెచ్చి యెంత అందంగా అలంకరించినా, శ్రమే మిగులుతుంది కాని, ఆమె అందగత్తె అవుతుందా? ఇత్తడిని తెచ్చి మాడలుగా (నాణెములుగా) తయారు చేస్తే బంగారం అయిపోతుందా? కఠినాత్ముడైన మగవాడికి పెండ్లిజేస్తే ప్రతిదినమూ భార్యతో కలతలేకాని భార్యతో సక్రమంగా కాపురము చేస్తాడా? శ్రీవేంకటేశ్వరుని దాసుడుగాని వానికి జ్ఞానం సమకూడుతుందా? ఎన్నటికీ అది జరిగేపనికాదు.

★ **నిగ్గడి** – కఠినాత్ముడు ★ **సంకుబూస** – నత్తగుల్ల





సంఖ్య : 463  సంపుటము : 15  పుట: 312  రాగం : శ్రీరాగం

**31 ఘనసుఖము జీవుఁ డెఱుఁగఁడుగాక యెఱిఁగినను**
**అనవరతవిభవంబు లప్పుడే రావా** ॥పల్లవి॥

**విసుగ కెవ్వరినైన వేఁడ నేర్చిననోరు**
**దెసలకునుఁ బలుమారుఁ దెరచునోరు**
**వసుధాకళత్రుఁ దడవదుగాక తడవినను**
**యెసఁగఁ గోరికలు తన కిప్పుడే రావా** ॥ఘన॥

**ముదమంది యెవ్వరికి మొక్క నేర్చినచేయి**
**పొదిగి యధముల నడుగఁ బూనుచేయి**
**అదన హరిఁ బూజ సేయదుగాక సేసినను**
**యెదురెదురఁ గోరికలు యిప్పుడే రావా** ॥ఘన॥

**తడయ కేమిటికైనఁ దమక మందెడి మనసు**
**అడియూసకోరికల నలయు మనసు**
**వడి వేంకటేశుఁ గొలువదుగాక కొలిచినను**
**బడిబడినే చెడనిసంపద లిట్లు రావా** ॥ఘన॥

**భావ పరిమళం :**

శ్రీరంగంలో దొరికిన అన్నమయ్య కీర్తన. బహుశా పెదతిరుమలయ్య కూడా ఈ కీర్తన శ్రీరంగంలో చెప్పినారేమో. ఏదియేమైననూ ఈ కీర్తన ఒక అమృత గుళిక. ఏది అనుపమమైన గొప్ప సుఖమో జీవుడు యెరుగడు. కాని ఒక్కసారి ఆ సుఖము నెఱిగితే ఆక్షణముననే అనేకవిభవములు కలుగవా? మానవుని "నోరు" ఒకసారి యాచించడానికి అలవడితే ఇక అందరినీ యాచిస్తూనే వుంటుంది. ఎంత వసుధనార్జించినా, యెంత భార్యా సమాగమము పొందినా కోర్కె తీరదు. మన చెయ్యి వున్నది చూశారా, ఇది ఒకసారి పరులకు మ్రొక్కుటకలవాటుపడితే యెంత అధముడికైనా మొక్కి సహాయం కోరుతుంది. మనస్సు అచ్యుతుని పూజించనొల్లదు, ఒకవేళ పూజ మొదలుపెట్టినా యెదురెదురైన కోర్కెలు ఇప్పట్నించే వస్తుంటాయి. ఒక్కసారి పరవశమునకు లోనైన మనస్సు అడియాసలకు లొంగిపోయి విపరీతమైన కోర్కెలతో అలసిపోతుంది. అటువంటి మనసున్నవాడు శ్రీవేంకటేశ్వరుని యెట్లా కొలవగలడు? కాని ఆ స్వామి కృపవల్ల శరణంటే సిరులు వురికి రావా?

★ **కళత్రము** – భార్య ★ **బడిబడినే** – వెనువెంటనే

సంఖ్య : 153 సంపుటము : 15 పుట: 102 రాగం : శంకరాభరణం

**36** **ఇందునందునెంచ భేద మెంతైనఁగలదు**
**చిందరవందరగాక చేతికి లోనయ్యీనా** ॥పల్లవి॥

**దేవునిగొలుచుఁవాడు దేవునికి కొఱగాక**
**యీవల సంసారుల కేమిబాఁతి**
**కావరపుమనుజుల కని కొలిచేవారికి**
**దైవికము విచారించ తలఁపున్నదా** ॥ఇందు॥

**పరము గోరేటివాఁడు పరమునకె కొఱగా**
**కిరవై యింద్రియముల కేమిబాఁతి**
**వొరసి భోగములలో నోలలాడేవానికి**
**అరిది మోక్షసుఖము లాసపడనున్నదా** ॥ఇందు॥

**పనిగొన్న భక్తివాఁడు భక్తికి కొఱగాక**
**యెనసి కర్మవిధుల కేమిబాఁతి**
**మని శ్రీవేంకటేశుమాయఁ జిక్కినవానికి**
**తనిసి భవబంధముల దాఁటఁగఁ జోటున్నదా** ॥ఇందు॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య కీర్తనలలో పల్లవి అర్ధముకావటం బహుకష్టం. ఇందులోను అందులోను (రక్తిలోను, విరక్తిలోను) యెంతైనా భేదమున్నది. మనిషి దేనినాశిస్తాడో దాన్ని పొందలేడు. ఇంకొక 'బాఁతి' (భ్రాంతి)లో పడి చీకాకు పొందుతుంటాడు. అటువంటప్పుడు వాడి జీవితం చిందరవందర కాక, యేమౌతుంది? శ్రీవేంకటేశ్వరుడి మాయవల్ల వీడు ఈ బాఁతిలోనుంచి బయటపడలేడు. పరమాత్ముడు కల్పించే 'బాఁతి' (భ్రాంతి) యెంత విచిత్రమైనదో వినండి. దేవుని గొలిచేటివాడు అట్లా కొలవక సంసార తాపత్రయంలో పడతాడు. కావరముతో మిడిసిపడే ధనికులైన నరులను కొల్చేవాడికి దైవాన్ని కొలిచే ధ్యాసే వుండదు. మోక్షం కావాలని ఆరాటపడేవాడు ఇంద్రియాలభ్రాంతిలో పడి మోక్షానికి కొఱగాక పోతాడు. నిరంతరం భోగలాలసలో చిక్కినవానికి మోక్ష సుఖము కావాలనిపించదు. భక్తి కావాలి అని కోరుకునేవాడు భక్తికి కొఱగాకుండాపోయి కర్మవిధుల చిక్కి భ్రాంతిలో అలమటిస్తుంటాడు. శ్రీవేంకటేశ్వరుని మాయలో చిక్కుకుపోయినవాడు భవబంధాలలో చిక్కుకొని అలమటిస్తుంటాడు. శరణు శరణు ఏడుకొండలవాడా! అంటే... నే దారి.

★ **తనిసి**– తృప్తిపడి ★ **ఒరసి** – ఒత్తుకుపోయి





సంఖ్య : 382 సంపుటము : 15 పుట: 257 రాగం : గుజ్జరి

**33** **అంతరంగములో నున్న హరియే గతిగాక**
**చింతించి మొక్కితేఁ దానే చేకొని రక్షించును** ॥పల్లవి॥

**పుట్టించిన కర్మమే పోషించకుండునట**
**బెట్టుగా మనసే మరపించునట**
**పట్టయిన దేహమే బతిమాలింపించునట**
**చుట్టము లెవ్వరు యెంచిచూచినఁ బ్రాణికిని** ॥అంత॥

**పక్కన విత్తినభూమి పంట పండకుండునట**
**యెక్కడా మాయే భ్రమయింపించునట**
**అక్కరతోఁ జేసిన పుణ్యమే కట్టివేసునట**
**దిక్కుదెస యెవ్వరు యీ దేహిఁ గరుణించను** ॥అంత॥

**ఆసలఁబెట్టే పాయమే అటమట మౌనట**
**చేసే సంసార మజ్ఞానిఁ జేయునట**
**వేసారక యింతకూ శ్రీవేంకటేశుఁ డేలికట**
**మోసపుచ్చేవా రెవ్వరు ముదమే జీవునికి** ॥అంత॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో పరమాత్మ వింత పద్ధతులేవో వివరిస్తున్నారు. ఆయన (పరమాత్మ) చేసే మాయ యెవరిపైన? ఆయన బిడ్డలమైన మనపైననే. మన బిడ్డల్ని మనం బాధిస్తామా? కానీ పరమాత్మ మన మనస్సును ఆటలాడించి చెడు, మంచి పనులు చేయించి వాటిననుభవించడానికి అనేక జన్మలనిచ్చి తమాషా చూస్తుంటాడు. అదే మాయ... మరి దారేమిటి? అంతరంగమెల్లా నిండియున్న శ్రీహరిని గతియని చింతించి మ్రొక్కుటయే. అప్పుడు ఆయనే చేకొని రక్షించును. మనని పుట్టించిన కర్మ – పోషించదు. కానీ మనస్సు మాత్రం మరిపిస్తుంటుంది. దేహము వచ్చిన దగ్గరనుంచి అందరినీ బ్రతిమిలాడుతూ బ్రతుకుతాడు. ఎంచి చూస్తే వీడికి నిజమైన చుట్టాలెవ్వరు? ప్రాణిభ్రమలోనే వుంటాడు. నాటిన విత్తనం దున్ననిచోట వేస్తే మొలకెత్తుతుందా? ఎక్కడ చూచినా విష్ణుమాయయే. అవసరం కొలది చేసే పుణ్యకార్యాలు జన్మలనిస్తాయి. మరి ఈ జీవునికి దిక్కు యెవ్వరయ్యా? ఇదిట్లా వుంటే వయస్సు చేసే పని... వింత ఆశలు పుట్టించి సంసారం అనే అజ్ఞానంలో పడవేసి అలమటింపజేస్తుంది. వీటన్నిటికి యేలికైన శ్రీవేంకటేశ్వరుడు కరుణించి, రక్షించాలి. ఇంత ఈ జీవుణ్ణి మోసపుచ్చుతున్నదెవరు? ఇంకెవరు నామాలవాడు.

★ **వేసారక** – విసుగుచెందక ★ **అటమటము** – వంచన

సంఖ్య : 127 సంపుటము : 15 పుట: 84 రాగం : భూపాళం

**34** **కాయ పండుసేయఁబోతే కదు పులుసేఁగాక**
**యేయెడ తీపుగాదు యిటువంటిదే** ॥**పల్లవి**॥

**కోపమెల్లా నొకవంక కూడవేసి మతికదా**
**పైపై హరిఁదలఁప పాత్రుఁ డయ్యేది**
**కైపుగాక రుచులపై కాంక్షమాని మతికదా**
**వోపి లోకముల సద్ద నొల్లకుండేది** ॥**కాయ**॥

**పంచేంద్రియముల నెల్ల పారఁదోలి మతికదా**
**వుంచపువిరక్తి కెల్ల వొడిగట్టేది**
**కొంచెపుకోరికెల్ల కోరకుండి మతికదా**
**వంచి హరిదాసులలో వహి కెక్కేదీ** ॥**కాయ**॥

**వేవేలు పనులెల్ల విడిచిన మతికదా**
**శ్రీవేంకటేశ్వరునిఁ జింతించేది**
**భావించి యితని దాసపరికరమై కదా**
**త్రోవచూచి మోక్షము తుద కెక్కేది** ॥**కాయ**॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తననాస్వాదించండి. కాయ కాలక్రమేణా పండు అయితే మధురంగా వుంటుంది. కాని వెంటనే పండు అయితే, అది పులుపుగానే వుంటుంది కదా! తీపి యెట్లవుతుంది? మొదలంటా కోపాన్ని కూల్చివేస్తేనేకదా! పరమాత్మను ధ్యానింపగలిగేది. రుచులమీద కాంక్షపోతేనే కదా! లోకములో హరిదాసుల లక్ష్యం నెరవేరేది. పంచేంద్రియములను పారద్రోలితేనే కదా! మనస్సులో విరక్తి భావము పొడచూపుతుంది. కొనలు కనబడేట్లు పెరిగిన కోరికలను కోసివేస్తేనే కదా! దాసవర్గము ప్రసిద్ధికెక్కేది. అనేక రకములైన వ్యాపకాలను విడిచిపెడితేనే కదా! శ్రీవేంకటేశ్వరునిపై ధ్యాస కలిగి ఆయన గురించి చింతించేది. భావించి ఈతని దాసులకు పరికరమైనప్పుడు కదా! ముక్తిని పొందే బాటలో చిట్టచివరి దశకు చేరేది!!

★ **వహి** – ప్రసిద్ధి ★ **వంచి** – వినయంతో
★ **సద్ద** – లక్ష్యము ★ **తుదికెక్కేది** – చివరకు చేరేది





సంఖ్య : 195 సంపుటము : 15 పుట: 130 రాగం : దేవగాంధారి

**35** **ఓపికగలవారికి వొడినుండునవి రెండు**
**పైపైఁ జేకొనేటివారి భాగ్యము కొలఁదులు** ॥**పల్లవి**॥

**సేసినంతపుణ్యము సృష్టిలోనివారి కెల్ల**
**ఆసల బహుఫలము హరిదాస్యము**
**త్రాసువంటిది కర్మము దైవముపై భక్తియైతే**
**బాసదప్పక పండిన పంటవంటిది** ॥**ఓపిక**॥

**గడించినంతే ధనము కైకొనేటివారి కెల్ల**
**అదరి విజ్ఞానధన మక్షయం**
**సుడివంటిది సంపద చుట్టఁబెట్టుచునుండు**
**అడచి నిరాశ బ్రహ్మానందమువంటిది** ॥**ఓపిక**॥

**ధర నాడినంతే మాట తగు నక్షరజ్ఞులకు**
**హరినామోచ్చారణ మక్షయం**
**యిరవై శ్రీవేంకటేశుఁ డిందుల కధిదేవత**
**నిరతి నితనికృప నిధానమువంటిది** ॥**ఓపిక**॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య కీర్తనలలో కూడా పల్లవి నర్మగర్భంగా అగోచరంగా వుంటుంది. ఈ కీర్తన పల్లవి చూడండి. ఓపికగలవారికి మాత్రమే ఆ రెండూ వొడిలో వుంటాయట. ఏ రెండూ? ఏమో ఆలోచించండి. ఏదైనా పైపైనే స్వీకరించేవారికి భాగ్యం కూడా అల్పముగానే వుంటుంది, అంటున్నారు. ఆ రెండూ యేమిటంటే ఇహము–పరము. ఈ సృష్టిలో పుణ్యం యెంత వస్తుంది? చేసినంత మట్టుకే కదా! మరి గొప్ప ఫలితం యిచ్చేదేమిటి? పరమాత్మ దాస్యము. చేసిన కర్మ త్రాసులో తూచినట్లు చేసికొన్నవారికి చేసికొన్నంత ఫలితాన్నే ఇస్తుంది. కానీ దేవునిపై పరమభక్తి బాగా పండిన పంట వంటిది. మనిషికి యెంత ధనము వుంటుంది? వాడు గడించినంత. అంతేకదా! కాని విజ్ఞానధనము (భగవత్ జ్ఞానము) మాత్రం అక్షయమైన ధనసంపద. మనిషికి నిరాశ (ఆశ లేకపోవుట) బ్రహ్మానందమును కలిగిస్తుంది. కానీ సంపదమీద వ్యామోహం సుడిగుండంలో పడవేస్తుంది. అక్షరజ్ఞునికి అనగా చదువు నేర్చినవాడు మితభాషివలెనుండాలి. హరినామోచ్చరణ అక్షయమైనదిగా చేయాలి. శ్రీవేంకటేశ్వరుడు సమస్త దేవతలకు అధినాథుడు ఆయన కృపయే నిధానము వంటిది.

★ **అక్షరజ్ఞుడు** – చదువనేర్చనివాడు ★ **ఓపిక** – ఓర్పు

సంఖ్య : 9 సంపుటము : 10 పుట: 5 రాగం : మలహరి

**40 హిత విదె తెలుసుకొమ్మీ**

**సతతముఁ జాటితిని ॥పల్లవి॥**

**సేయవోయిజిహ్వా యీ శ్రీహరి నుతియెపుడూ**
**రోయవోయి నీవు యీరుచులయందలి వేడుకా ॥హిత॥**

**కోరవోయి మనసా యిఁక గోవిందునిచింతా**
**చేరకువోయి నీవు యీ చెడుగుఁ గామాదులను ॥హిత॥**

**విడువకువోయి దేహి శ్రీవెంకటగిరినాథుని**
**వుడుగవోయి నీవు యీవులుకుఁ దొల్లిటిచేఁతలు. ॥హిత॥**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెబుతున్న ఈ చిన్ని సంకీర్తనలో మరువరాని జ్ఞానబోధ జేస్తూ మానవుని జిహ్వా (నాలుక)ను, మనస్సును, ఆత్మను హెచ్చరిస్తున్నారు. శ్రీవేంకటనాథుని విడువవద్దని మందలిస్తున్నారు. ఓరీ! దేహి! నీకు శరీరమునిచ్చి పరమాత్మ ఈసారియైనా ముక్తిని సాధించరా అంటే నీవు పెడదారిబడుతున్నావు. నీవు ఆ భ్రమలకు లోనుగాకుము. నేను చెప్పబోయేదే హితవు (మంచిమాట) తెలుసుకోవోయి. ఇదివరలా నేనెప్పుడు చెప్పే మాట ఇది. ఓ జిహ్వా! నీవు ఇన్ని వేర్వేరు రుచుల యావలోబడి శ్రీహరి నామసంకీర్తన గాలికి వదలివేశావు. ఇంకా నీకు రోతపుట్టుటలేదా? ఓ మనస్సా! నీవు సదా గోవింద నామోచ్ఛరణ సేయుము. అదే కోరుకోవో. నిన్ను భ్రష్టుని చేయటానికి కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలనే ఆర్గురు శత్రువులను మిత్రుల వేషంలో పంపాడు శ్రీహరి. తస్మాత్ జాగ్రత్త! నీవు వాళ్ళ స్నేహం చేయకుము. ఓయి దేహి! శ్రీవేంకటేశ్వరుని పాదపద్మాలను విడిచిపెట్టకు. నీవు తొలినాటి చేష్టలు, వులుకు వదలిపెట్టు.

★ **ఉలుకు** – భయాందోళన ★ **ఉడుగవొ** – తగ్గించుకో





సంఖ్య : 210 సంపుటము : 15 పుట: 140 రాగం : గౌళ

**37 ఘనసంసారుల కెల్ల కర్మమై పొడచూపు**
**ననిచి యింతకు గురి నరహరి వొక్కఁడు ॥పల్లవి॥**

**యెలమిఁ బుణ్యములెల్ల యింద్రలోకమై తోఁచు**
**నలుండ పాపములే నరకలోకమై తోఁచు**
**పొలసి రెండు సరియైతే భూలోకమై తోఁచు**
**కలవాఁ డొక్కఁడే గుఱి కమలావిభుఁడు ॥ఘన॥**

**పరగ రాజసులకు బ్రహ్మయై పొడచూపు**
**గరిమ తామసులకు కఱకంఠుఁడై యుండు**
**సిరుల సాత్వికులకు శ్రీకాంతుఁడై మించు**
**నిరవై నవాఁడు శ్రీహరి యొక్కఁడే ॥ఘన॥**

**ఆయ మెఱిఁగినవారి కంతరాత్మయై యుండు**
**చాయ గన్న వారికి జగమెల్లనై తోఁచు**
**చేయఁగన్న వారికి శ్రీవేంకటేశుఁడై తోఁచు**
**యేయెడ వారికి గుఱి యీ దేవుఁ డొక్కఁడే ॥ఘన॥**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో భువిలో సంసారులకు కర్మవలె పొడచూపుతున్న ఈ పీకులాట నరహరి కల్పితమేకాని వేరొకటి కాదు. ఆయన చేయబట్టే మానవులు మాయలో చిక్కుకుపోతున్నారు. ఇంద్రలోకమంటే యేమిటి పుణ్యులు పొందే ఆనందం. నరకమంటే, పాపులు పొందే దుఃఖం. ఈ రెండూ సమానమైతే భూలోకం చేరక తప్పదు. మళ్ళీ ఈ మూడూ సంప్రాప్తింపజేసే వాడెవరు? సర్వలోక పాలకుడైన శ్రీహరియే. మనందరి మనస్సులలో నిలిచి ఆశ్రీహరే వుంటాడు. కానీ రాజసగుణముగలవారికి ఆ దైవము బ్రహ్మగా భావింపజేస్తాడు. తామసులు అదే దైవాన్ని రుద్రుడు అంటున్నారు. సాత్త్వికులు దైవాన్ని లక్ష్మీపతిగా భావిస్తారు. కానీ వీరందరికీ మూలమైనవాడు శ్రీహరిమాత్రమే. అచ్చమైన కిటుకు తెలిసినవారికి ఆ శ్రీహరే అంతరాత్మగా మనలో వున్నాడు. తత్త్వము తెలిసినవారికి ఈ జగమే శ్రీహరి. ధ్యానించుట తెలిసినవారికి శ్రీహరే, వేంకటేశ్వరుడు. ఇటువంటి వారికి వేఱొందు దైవముపై గురివుండదు.

★ **కఱకంఠుడు** – రుద్రుడు ★ **పొలసి** – అతిశయించి

సంఖ్య : 40    సంపుటము : 10   పుట: 23    రాగం : ఆహరినాట

**38 ఇందరు నేల దూరేరు హితవే నీవు సేయఁగా**
**ముందు ముందె తమ్ముఁ గర్మములు సేయు మంటివా** ॥పల్లవి॥

**తెలిసి నిన్నుఁ గొలువ దేహ మిచ్చితివి గాక**
**బలిమినె మాయలలోఁ బడు మంటివా**
**మలసి నిన్నుఁ దలఁచ మన సిచ్చితివి గాక**
**కొలగట్టి విషయాలఁ గోరు మంటివా** ॥ఇందరు॥

**నగుతా నిన్నుఁ బొగడ నాలు కిచ్చితివి గాక**
**అగడుగా నూరమాఁట లాడు మంటివా**
**సొగసి నిన్నుఁ జూడఁగాఁ జూపు లిచ్చితివి గాక**
**వగవగలతో నూరివారిఁ జూడు మంటివా** ॥ఇందరు॥

**శ్రీవేంకటనాథ నిన్నుఁ జేరు మ నంటివి గాక**
**జీవులను మనుజులాఁ జేరు మంటివా**
**భావించి నీదాసులనె భజించు మంటివి గాక**
**దావతి లంపటాలలోఁ దడఁబడు మంటివా.** ॥ఇందరు॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తన వినండి, పరవశించండి. ఓ తిరుమలరాయా! నీవు జగత్పితవు. అందరికీ మేలు చేయుటయే నీ స్వభావం. కాని అజ్ఞానులైన మానవులు నిన్ను నిందిస్తుంటారు. తొలినాళ్ళలో గర్వోన్మత్తులైన జీవులు అందరూ నిన్ను తప్పుపడతారు. ఎంత మూర్ఖులు!! జీవులకి నీవు దేవుని కొలవండిరా అని దేహమునిస్తే మేము దానితో భోగాలు అనుభవిస్తున్నాం. నీవు మమ్మల్ని మాయలోబడమన్నావా? మాకు మనసిచ్చి నిన్ను ధ్యానించమంటే మేము విషయలోలురమైపోయాము. అది నీ తప్పా? నీవు మాకు నాలుకనిచ్చి సంతోషంతో నిన్ను కీర్తించమంటే, మేము వూరిలోనివారిగురించి మాట్లాడి నీధ్యాసే మరచాము. మంచి కళ్ళను మాకిచ్చి దర్శించి తరించమంటే మేము వూరివారిని పగ, ద్వేషాలతో చూస్తున్నాము. నీవెన్నడన్నా మాకు పరులను ద్వేషించమని చెప్పావా? ఓ శ్రీవేంకటనాథా! నీవు మమ్మల్ని పరమాత్మను చేరండిరా అంటే మేము ధనికులను, బలవంతులను ఆశ్రయిస్తున్నాం! నీవు మమ్మల్ని నీదాసులభజన చేయమంటే మేము అనేక లంపటాలతో తడబడుతున్నాము.

★ **కొలగట్టి** – పాపపుచింతతో ★ **దావతిలంపటాలు** – దుఃఖకారకమైన బంధాలు





సంఖ్య : 10    సంపుటము : 10   పుట: 6    రాగం : గుజ్జరి

**39 ఎంతలే దిది యెంచిన**
**సంతోషించని సంసారంబు** ॥పల్లవి॥

**యేలకొ నేఁ డీదేహి**
**ఆలరి భోగము లడిగీఁగాక**
**చాలించఁగఁ జాలఁడు**
**కోలుముందు హరిఁ గొలువఁగరాదా** ॥ఎంత॥

**యెందైనను యీమనసు**
**పందదనంబునఁ బారీఁగాక**
**ముందరికోరిక మునుఁగదు**
**కందువ శ్రీవిభుఁ గానఁగరాదా.** ॥ఎంత॥

**విడువనితగు లీవేడుక**
**తొడిఁబడ నెందైన దొరసీఁగాక**
**కడగని శ్రీవెంకటనాథు**
**బడిబడిఁ దిరుగుచు బ్రదుకఁగరాదా.** ॥ఎంత॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెబుతున్న ఈ కీర్తనలో చక్కని వైరాగ్యాన్ని బోధిస్తున్నారు. ఎంచి చూస్తే ఇది యెంత చేయలేదు!! ఈ సంసారములో సంతోషించటానికి ఇందులో యేమన్నా వున్నదా? ఈ దేహి వున్నాడే, నేడే వీడెందుకని అల్లరిపెట్టే భోగాలను యాచిస్తున్నాడు? వీటిని చాలించలేకున్నాడు ఇవన్నీ యెందుకు, చాలా ముందుగానే శ్రీహరిని కీర్తించరాదా? ఇక మానవుని మనస్సు వుందే, దేహిని భ్రష్టుని చేసేదే ఇది. ఎందైనా మనిషిని పిఱికివాణ్ణి చేసి, అన్నిటికి లొంగిపోయేట్లుగా చేస్తుంది. కోరికలను యెదిరించి అదుపుచేసే శక్తి దీనికి లేదు. పోనీ, సామర్థ్యంతో శ్రీవిభుని కొలువవచ్చును కదా! మనిషి కోరుకునే ఈ వేడుకలున్నాయే, అవి వదలరాని బంధనాలను కలుగజేస్తాయి. మనిషి చలించిపోయి దేనితోనో కలిసిపోతాడు. చివరకు శ్రీవేంకటేశ్వరుని దర్శించి, ఆయన కూడికూడి తిరిగి బ్రతికితే అప్పుడు బ్రతికిపోతాడు.

★ **కోలుముందు** – చాలాముందుగానే ★ **పందదనము** – పిఱికితనము
★ **తొడిబడ** – చలించిపోయి ★ **దొరసీగాక** – కలిసిపోతాడు

సంఖ్య : 53 సంపుటము : 10 పుట: 30 రాగం : సామంతం

**44 తోఁటకూరదొంగలాల తొయ్యలులాల**
**నాఁటకపు మీమోహము నమ్మ నెట్టువచ్చును ॥పల్లవి॥**

**పాపపుణ్యపు టోఁదాలపాలుసేసి జీవులను**
**చూపులనె భ్రమయించె సుద్దులు మీవి**
**దాపుదండై శ్రీవిభుఁడు తానె కాచెఁగాక**
**యేపున రిత్తవారి మీ రెంతంత సేయరు ॥తోట॥**

**కీడు మే లనె వురులఁ గీలించి మనుజులఁ**
**బాడితోనె యెంచెటిభావము మీది**
**యీడేరించి నాగురుఁడు యిందిరేశుఁ జూపెఁగాక**
**యీడనె రుత్తవారి మీ రెంతంతసేయరు ॥తోట॥**

**చావుఁ బుట్టుగు లనెడి సముద్రాలఁ బడఁదోసి**
**జీవులను విసిగించేచిత్తము మీకు**
**శ్రీవెంకటనాథుఁడె చేపట్టి మమ్మేలెఁగాక**
**వేవేగనఁ బేదలచే వెట్టి యెంతగొనరు. ॥తోట॥**

**భావ పరిమళం :**

చినతిరుమలాచార్యులవారు చెప్పిన ఈ చక్కటి కీర్తన నాకర్థమైన విధంగా వివరిస్తున్నాను. తోటకూరదొంగ అంత తేలికగా పట్టుబడడు. కాని, ఒక రోజు దిరొకిపోయి చావుదెబ్బలు తింటాడు. అటువంటి పురుషుల్లారా, స్త్రీల్లారా మీరు చూపించే మోహములన్నీ నాటకములే. మిమ్మల్ని నమ్ముటెట్లు? పాపపుణ్యాలను గాలికి వదలివైచి జీవులను భ్రమపెట్టుటలో ఆరితేరినవారు మీరు. శ్రీవిభుడేమో దిక్కూమొక్కూ అయి కాపాడకబోతే, మేము సొమ్మసిల్లేట్లుగా, మీరెంతెంత చేయరు? ఓ స్త్రీ పురుషులారా కీడు, మేలు అనే వురితాళ్ళను తగిలించి మానవులను వేధించే భావము మీది. ఆరితేరిన మా గురువు గారు శ్రీహరిని మాకు చూపించారు. ఆయనే లేకపోతే మీరు మాకెంతంత అపకారం చేయరు? జీవులను చావు పుట్టుకలనే సముద్రాలలో పడత్రోసేసి విసిగించే చిత్తమా! శ్రీవేంకటేశుడే మమ్మల్ని చేపట్టి కాపాడినాడు. అతివేగంగా పోయి ఇంకెవరితోనన్నా వెట్టి చేయించుకోండి.

★ **కీలించి** – తగిలించి ★ **రు(రి)త్తవారి** – వ్యర్థమైపోయి





సంఖ్య : 60 సంపుటము : 10 పుట: 34 రాగం : వరాళి

**41 గాడిదెపిల్లకోమలికమె కలిగినది**
**వేడుకపడు సంసారమె విసిగించు వెనక ॥పల్లవి॥**

**అగపడుసంపదమీఁదట నాసలు కడుఁ బుట్టు**
**వగ నది భరియింప వసమె కాదయ్య**
**మొగమె చూడఁగ నాపై ముదమునఁ గనుపట్టు**
**పొగులఁగఁ గరచెటికాట్లు పులికంటె బెట్టు ॥గాడిదె॥**

**విడువని భోగంబులపై వేడుక కడుఁ బుట్టు**
**తడఁబడులంపట మైతే తలఁచనె రాదయ్య**
**తొడ(డి?)మెను మాఁగినపండైతే తోఁచుఁ జూచినను**
**వడియఁబడి గొడ్డంటికి వసమె కాదెపుడు ॥గాడిదె॥**

**మోవఁగ విషయంబులపై మోహము కడుఁ బుట్టు**
**శ్రీవెంకటనాథా అది చెప్పఁగ రాదయ్య**
**ఆవలఁ జూడఁగఁ జల్లనై వుండుఁ గాని**
**తేవలఁ గూఁకటవేళ్లు తెగఁబారును మిగులా. ॥గాడిదె॥**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య ఈ కీర్తనలో గొప్ప సత్యాన్ని వెల్లడిస్తున్నారు. గాడిదపిల్ల పుట్టిన తొలినాళ్ళలో చాలా కోమలంగా వుంటుంది. కాలం గడుస్తున్నకొద్దీ ఆ కోమలత్వం పోయి మొరటుతనం వస్తుంది. అట్లే సంసారం కొత్తలో రంజుగా వుంటుంది. ఆ తరువాత రాను, రానూ అది యెంత లంపటమో తెలిసి విసుగు పుడుతుంది. ఈ సంసారంలో వున్న దుర్గుణమేమంటే సంపదలమీద ఆశకలిగి కుట్టిపడేస్తుంది. దానివల్ల కలిగే వేదన భరించటం మనవశమౌతుందా? ఈ సంసారం మొగము చూస్తే ముందు సంతోషంగానే వుండి మురిపిస్తుంది. కానీ ఇది కరిచేటి కాట్లు పులిపంజా దెబ్బలకంటే ఘోరం. విసుగుపుట్టని భోగాలు క్రొత్తలో వేడుకగానే వుంటాయి. కాని పోను పోను అవేలంపటాలు అయిపోయి తడబడునట్లు చేస్తాయి. వాటిని తలచక పోవటమే మంచిది. పండు మాగితే దానంతటదే వూడుతుంది. ఇక గొడ్లుదాన్ని వుండనిస్తాయా? మనుష్యులు విషయాసక్తులవుట అతి సహజము. ఓ శ్రీవేంకటేశ్వరా! దానిగురించి చెప్పుటే సాధ్యంకాదు చల్లని నీడనిచ్చే చెట్టు వేళ్ళు యెంత బలంగా నాటుకొంటాయంటే... దాన్ని పెకలించడం అసాధ్యం.

★ **పొగులు** – పరితపించు ★ **తేవల** – ఉత్సుకించి

సంఖ్య : 12 సంపుటము : 10 పుట: 7 రాగం : లలిత

**42** చెప్పే నా మాట విను చిత్తమా
చిప్పిలు నెండమావుల చెరువులు నున్నవా ॥పల్లవి॥

వెగటైనవిషయాల వేడుకపడకు మవి
జిగురుఁగండెలు సుమ్మీ చిత్తమా
పొగరుమూఁపుఁదనాలఁ బొరలకు మవియెల్ల
తగులు విరిపందెల దారివంటివి ॥చెప్పే॥

బలిమినె యాసలబారిఁ బడకు మవి
చిలుకల వోఁదా లోచిత్తమా
తలఁచిచూచితేనె తప్పులుఁ దారులె
కలలోని రతులయాఁకట వంటివి ॥చెప్పే॥

మేరమీరెకోరికల మిసిమి చూడకు మవి
జీరుకుబండ లోయిచిత్తమా
చేరువనె కాచెటి శ్రీవెంకటనాథుఁ గని
గారవాన బ్రదుకుమీ కల్పవృక్ష మతఁడు. ॥చెప్పే॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య ఈ కీర్తనలో తన చిత్తాన్ని మందలిస్తున్నారు. కల్పవృక్షమువంటి ఏడుకొండలవానిని ఆశ్రయించు, గౌరవంగా బ్రతుకు అని హెచ్చరిస్తున్నారు. ఓ చిత్తమా! నేను చెప్పే నామాటలు వినుము. ఎండమావుల్లో నిజమైన చెరువులుంటాయా? జిగురు బాగా అంటుకొన్న జొన్నకండెలలో రుచి వుంటుందా? అట్లాగే ఓ చిత్తమా, వెగటై విషయాలకు లోలుడుకావద్దు. చిత్తమా! నీవు పొగరుమోతుతనముతో పొరలవద్దు. పూలపందిళ్ళదారివలె అవి నిన్ను భ్రమింపజేస్తాయి. ఓ మనసా! బలవత్తరమైన ఆశలబారిపడవద్దు. అవి చిలుక పంజరాలవంటివి సుమా! తలచి చూస్తే, తప్పుడు మార్గాలన్నీ కలలో రతిక్రీడవలె నిరుపయోగమైన అనుభవాన్ని గడింపజేస్తాయి. ఓ మనసా! హద్దులేని కోరికలకి లొంగితే పెద్ద జారుడు బండలాగా జారి అధఃపాతాళానికి పోతావు. నీ చేరువనే కాపాడుటకు శ్రీవేంకటేశ్వరుడు వున్నాడు ఆయనను శరణని సుఖంగా వుండు.

★ **జీరుకుబండ** – జారుడు బండ ★ **జిగురు గండెలు** – బంకగావున్న కంకులు





సంఖ్య : 11 సంపుటము : 10 పుట: 7 రాగం : బౌళి

**43** బ్రహ్మఁగన్నవాఁడు పసిబిడ్డ
బ్రహ్మమైనవాఁడు పసిబిడ్డ ॥పల్లవి॥

వగపులేక చంపవచ్చిన బూతకి
పగసాధించినవాఁడు పసిబిడ్డ
పగటునఁ దనమీఁదఁ బారవచ్చినబండి
పగులఁ దన్నినవాఁడు పసిబిడ్డా ॥బ్రహ్మ॥

గుట్టున నావులకొరకు వేలనె కొండ
పట్టి యెత్తినవాఁడు పసిబిడ్డా
జెట్టిపోరునఁ దన్నుఁ జెనకవచ్చినవానిఁ
బట్టి చంపినవాఁడు పసిబిడ్డా ॥బ్రహ్మ॥

మిడికెటికోపపు మేనమామఁ బట్టి
పడనడిచినవాఁడు పసిబిడ్డా
కడువేగ శ్రీవెంకటనాథుఁడై గొల్ల-
పడఁతులఁ గూడినాఁడు పసిబిడ్డా. ॥బ్రహ్మ॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య మధురమైన భక్తి ద్యోతకమయ్యే కీర్తన వినిపిస్తున్నారు. ఏమి చోద్యము!! బ్రహ్మనుకన్నవాడు సర్వ సృష్ఠికి పితామహుడు కదా! మరి అతడు పసిబిడ్డడా? తానే పరబ్రహ్మ స్వరూపుడైనవాడు పసిబిడ్డడా? ఏమి విష్ణుమాయ!! తానే అపకారమూ చేయకపోయినా చంపవచ్చిన పూతన చనుబాలు పీల్చి చంపినవాడు పసిబిడ్డడా! తన మీద బారవచ్చిన బండిరూపపు శకటాసురుని ఒక్కతన్నుతో ముక్కలు ముక్కలు చేసినవాడు పసిబిడ్డడా! తాను కాస్తున్న ఆవులను సంరక్షించటంకోసం చిటికెనవ్రేలిమీద గోవర్ధనగిరిని పట్టి యెత్తిన వాడు పసిబిడ్డడా! మల్లయుద్ధంలో బాలుడని చూడక చంపవచ్చిన చాణూరుడనే మల్లుని మట్టి కరిపించినవాడు పసిబిడ్డడా!! కోపముతో మిడిసిపడుతున్న తన మేనమామ కంసుని క్రిందపడవేసి వుత్తచేతులతో చంపినవాడు పసిబిడ్డడా! పరాత్పరుడైన శ్రీవేంకటనాథుడై రేపల్లెగొల్ల పడుచులను కూడినవాడు పసిబిడ్డడా!! ఆయన జగదీశ్వరుడని మీరు యెప్పటికి గ్రహిస్తారయ్యా?

★ **మిడికేటి** – ఎగిరిపడు ★ **జెట్టిపోరు** – మల్లయుద్ధం

సంఖ్య : 47    సంపుటము : 10  పుట: 27    రాగం : లలిత

**48 జగదీశ్వరుని లీలాచక్రములోపలనుండి**
**మగుడ దాసుఁడుగాక మాయ దాఁట వసమా** ॥పల్లవి॥

**తనువు నాదెయనఁగ తనకు స్వతంత్రమేది**
**తనువులో తాను హలి(రి?) తనువెకాన**
**మనసులో యీసుద్ది మరినమ్మితేఁ జాలు**
**వెనకముందరలకు విచారమేలేదు** ॥జగదీ॥

**సొమ్ములు నావియనఁగ సోధించఁ దానెవ్వఁడు**
**సొమ్ములునుఁ దాను హరిసొమ్ములెకాన**
**సమ్మతి నీతలఁపె సహజమై కలిగితే**
**నెమ్మదిఁదా నిన్నిటా నిశ్చింతుఁడౌను** ॥జగదీ॥

**బంటులు నావారనఁగఁ బరికించ నెవ్వఁడు**
**బంటులునుఁ డా(దా?)ను హరిబంట్లెకాన**
**నంటున శ్రీవెంకటనాథునిఁ గొలిచితేను**
**కంటకములెల్లాఁ బాసి ఘనుఁడె తానౌను.** ॥జగదీ॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య వినిపిస్తున్న ఈ కీర్తనలో సర్వ జీవులూ జగదీశ్వరుని లీలాచక్రములో, తిరిగేవారే. ఆయన దాసుడు గాక హరిమాయను దాటుట అసాధ్యము. జీవులకు ఈ తనువు నాది, అనే స్వతంత్ర్యము యెక్కడ వున్నది? తనువులోనున్న హరి తనువే కాని, ఇది జీవుల తనువెలా అవుతుంది? మనస్సులో ఈ విషయం గ్రహించగలిగితే మనకు వెనకజన్మయేది, ముందు రాబోయేదేదనే, విచారమే వుండదు. ఈ నగలు నావి అని యెవడన్నా అంటే దేవుడు నవ్వుకోడా? ఎందుకంటే ఆ నగలూ అవి ధరించిన నరుడూ కూడా హరికి చెందినవే కదా! మరి నరునివెలా అవుతాయి? దీనిని సమ్మతించి ఆ తలపు నిశ్చయం చేసికొంటే అన్నింటిలోను నిశ్చింతగా వుండవచ్చును. ఈ బంట్లు నావారు అనే మనిషికి తానే ఒక హరిబంటనే సత్యము నెందుకు చూడలేదు? మరి ఈ అజ్ఞానం యెలా పోతుంది? శ్రీవేంకటేశ్వరుని కొలిచినచో ఈ ముళ్ళబాట మాయమై ముక్తిపథమెక్కి తానే నరుడు ఘనుడౌతాడు.

★ **మగుడ** – మరల ★ **కంటకములు** – ముళ్ళు





సంఖ్య : 27    సంపుటము : 10  పుట: 15   రాగం:నారాయణదేశాక్షి

**45 ఐన దేది కాని దందులో నేది**
**నానారూపి శ్రీనాథుఁడె కాకా** ॥పల్లవి॥

**యెవ్వరి దూషించే మెవ్వరి భూషించే**
**మెవ్వరు స్వతంత్రు లిందులో**
**అవ్వల నివ్వల నంతరాత్ముఁడైన**
**యవ్వనజాక్షుని నసుట గాకా** ॥ఐన॥

**యెందుకుఁ గోపించే మెందుకు మెచ్చే**
**మెందుఁ గద్దు మే లిందులో**
**అందు నిందుఁ దానె యల్లుకొన్న**
**నందనందనునే నమ్ముట గాకా** ॥ఐన॥

**యేచోటు మంచిది యేచోటు చెడ్డది**
**యేచోటు సతమౌ నిందులో**
**కాచేటి శ్రీవెంకటనాథుఁడె**
**చేచేతఁ గాణాచై చెల్లించెఁ గాకా.** ॥ఐన॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెబుతున్న తత్త్వ బోధ అర్థం చేసికొనే ప్రయత్నం చేద్దాము. ఇందులో (ఈ జగతిలో) అయినదేది? కానిదేది? అనేక జీవుల రూపంలో ద్యోతకమౌతున్న శ్రీనాథుడు గాక వేరెవరున్నారు? మనం ఒకర్ని దూషిస్తున్నామంటే మనతో తిట్లు తింటున్నది నారాయణుడే. అలాగే సత్కరించినా అది శ్రీహరికే చేరుతుంది. ఎందుకంటే ఎవ్వరూ స్వతంత్రులు కారు. అందరితో అన్నీ చేయించేది శ్రీహరే. ఎందుకంటే మనం బ్రతికినా, చచ్చినా అంతరాత్మ శ్రీహరియే. మనం ఒకరిపై కోపిస్తాము, ఒక్కొక్కరిని మెచ్చుకొంటాము. ఎందులో మేలు జరుగుతున్నదో, యెవరికన్నా తెలుసా? వారిలోనూ, వీరిలోనూ వున్నది శ్రీహరియే అయినప్పుడు, మన పని, తెలివితక్కువ పనే కదా! మరి, ఇక ఆ నందనందనుని సేవించవచ్చును కదా! ఎక్కడ మంచి జరుగుతుంది, యెక్కడ చెడు జరుగుతుంది? ఇందులో శాశ్వతమైన నెలవు యేది? కాచేటివాడు శ్రీవేంకటేశ్వరుడు చేతిలోని, కాణాచియై ఆయనే అన్నీ చెల్లిస్తాడు.

★ **కాణాచి** – చిరకాలవాస స్థానము ★ **అల్లుకొన్న** – తీగవలె వ్యాపించు

సంఖ్య : 28 సంపుటము : 10 పుట: 16 రాగం : గుజ్జరి

**46** **చలమె చెల్లించుకొన్న సతులాల**
**సులభమా మీతోపొందు సుతులాల** ॥పల్లవి॥

**ప్రతినైన యతినైన వలలమాటలఁ బెట్టి**
**బతిమి చెరుతురుగా బంధువులాల**
**హితవరులువలెనె యింత నంత నెలయించి**
**తతిగొందురుగా ధనధాన్యములాల** ॥చలమె॥

**పెద్దనైన పిన్ననైన పెలుచుఁదనమె రేఁచి**
**కొద్దిమీరించిన కామక్రోధములాల(?)**
**అద్దొ యెంతవిరక్తు నైనా విషయాలకె**
**తిద్దితిరిగా పంచేంద్రియములాల** ॥చలమె॥

**మునినైన ఋషినైన మోహమె పెంచి మరపి**
**మొనసితిరిగా యిల్లు ముంగిళ్లాల**
**ఘనుఁడైన శ్రీవెంకటనాథుపాదములు**
**చనవునఁ జూపితి రాచార్యులవారా.** ॥చలమె॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య అద్భుతమైన ఈ కీర్తనలో మానవునికి తన సతీసుతులతో కలిగే తిప్పలను అభివర్ణిస్తున్నారు. తమ పంతములనే నెగ్గించుకొనే పత్నీమణులారా! పుత్రరత్నాల్లారా! మీతోపొందు పెట్టుకొని బ్రతుకుట అంతసులువైన వ్యవహారమా? ఓ బంధువుల్లారా! మీరు వ్రతముతోనున్న వానినైన, యతినైన మీ మాయ మాటలతో చెడగొట్టుతారు. ఓ ధన ధాన్యములారా! మీరు హితమొనరించేవారిలా నటిస్తూ, తీరని బాధను కలిగిస్తారు. ఓ కామక్రోధములారా! మీరు పెద్దలనైనా, పిన్నలనైనా విరసత్వంతో చెలరేగిపోవునట్లు చేస్తారు. ఓ పంచేంద్రియములారా! అదిగో... మీరెంత విరక్తుడినైనా విషయలోలుని చేస్తారు. ఓ గృహప్రాంగణములారా! పూని మీరు మునీశ్వరులనైనా, ఋషిపుంగవులనైనా మోహమున ముంచి భ్రష్టులను చేస్తారు. కాని నన్ను ఉద్ధరించే ఆచార్యుల్లారా! మీరు చనవుతో నాకు శ్రీవేంకటేశుని పాదములను చూపించారు. ధన్యోస్మి!

★ **మొనసితిరి** – పూనుకొంటిరి ★ **బతిమి** – భక్తి





సంఖ్య : 48 సంపుటము : 10 పుట: 27 రాగం : శుద్ధవసంతం

**47** **మేలేమి కీడేమి మించిన నీరూపమె**
**వాలాయించి తెలిసినవానికి** ॥పల్లవి॥

**యినుమేమి పసిఁడేమి యెంచిచూచితె**
**మనసు దెలిసిన నిర్మలునికి**
**ఘనమేమి కిరుదేమి కలవెల్లా నీ**
**తనువుగఁ దెలిసిన తత్వజ్ఞానికి** ॥మేలే॥

**పగయేమి చెలిమేమి పలుమారు నిన్ను**
**పొగడుచునుండెటి పుణ్యునికి**
**వగపేమి వేడుకేమి వరుసతో నిన్ను**
**వెగటులేక కొలిచే వివేకికి** ॥మేలే॥

**చేరువేమి దవ్వేమి శ్రీవెంకటనాథ నిన్ను**
**కూరిమిఁ గొలిచిన సద్గుణునికి**
**భారమేమి పాటేమి పరమాత్మా నిన్ను**
**సారమతిఁ దెలిసిన సర్వజ్ఞునికిని.** ॥మేలే॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెబుతున్న చక్కని కీర్తనలో అద్భుత సత్యాన్ని వివరిస్తున్నారు. ప్రభూ! నీ రూపాన్ని తత్త్వాన్ని నిరంతరం తెలిసిన వారికి మేలేమిటి, కీడేమిటి? వారికి సర్వమూ జగన్నాథుడే. పరమాత్మ మనసు తెలుసుకొన్నవానికి ఇనుమేమిటి, బంగారమేమిటి! రెండూ వానికి సమానమే. ప్రతి వస్తువూ విశ్వరూపుడవైన, నీ తనువే అని తెలిసిన తత్త్వజ్ఞానికి గొప్పయేమి, హీనమేమిటి? ఓ దేవదేవా! నిన్ను కీర్తించుటే పనిగా గల పుణ్యాత్మునికి, పగయేమిటి, చెలిమియేమిటి? అతడు భావాతీతుడు కదా! ఏ మనోవైకల్యమూ లేక నిన్నే కొలిచెడి వివేకికి దుఃఖమేమిటి, సంతోషమేమిటి. వాడు జీవన్ముక్తుడు. ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్ను ప్రేమతో సేవించే సద్గుణునికి నీకు దగ్గరగా వున్నా, దూరంగావున్నా ఒక్కటే; యెందుకంటే నీవు వాడి హృదయంలోనే వున్నావు. ఓ పరమాత్మా! నిన్ను దెలిసిన సర్వజ్ఞునికి శ్రమేమిటి, ఆపదయేమిటి స్వామీ! వాడే సర్వశ్రేష్ఠుడు.

★ **వాలాయించి** – నిరంతరము ★ **కిరు(ఱు)దు** – హీనము
★ **సారమతి** – శ్రేష్ఠుడు ★ **పాటు** – ఆపద

సంఖ్య : 39     సంపుటము : 10   పుట: 22     రాగం : లలిత

**52 తాళపాకన్నమాచార్య దైవమవు నీవు మాకు**
**వేళమె శ్రీహరిఁ గనేవెర వానతిచ్చితివి ||పల్లవి||**

**గురుఁడవు నీవెసుమ్మీ కుమతి నైననాకు**
**సరవి బ్రహ్మోపదేశము సేసితి**
**పరమబంధుఁడ వైనా పరికింప నీవెసుమ్మీ**
**వరుస నేఁ జెడకుండ వహించుకొంటివి ||తాళ||**

**తల్లివైన నీవెసుమ్మీ తగిన విషయాలలో**
**పల్లదానఁ బడకుండా బ్రదికించితి**
**అల్లుకొని తోడునీడవైనా నీవెసుమ్మీ**
**చిల్లరమాయలలోనఁ జెడకుండాఁ జేసితి ||తాళ||**

**దాతవు నీవెసుమ్మీ తగుశ్రీవెంకటనాథు**
**నాతలఁపులో నిలిపి నమ్మఁ జేసితి**
**యేతలఁ జూచినా నాకు నేడుగడయు నీవె**
**ఆతల నీతల నన్ను నాదుకొని కాచితి. ||తాళ||**

**భావ పరిమళం :**

తనతాతగారైన అన్నమయ్య తమ పాలిట దైవమని కీర్తిస్తున్నారు చినతిరుమలయ్య. సరియైన సమయంలో శ్రీహరిని చూచే దారిచూపి ఆ దారిన బొమ్మని ఆనతిచ్చావు మేము ధన్యులము అంటున్నారు. కుమతినైన నా వంటివానికి గూడ గురువువై ధన్యత కలిగించావు. నాకు వడుగు చేసి ఓ అన్నమాచార్యా! పరమబంధుడవైనావు. నేను చెడిపోకుండా కాపాడినావు. ఓ అన్నమార్యా! నాకు తల్లివికూడా నీవేసుమా! నన్ను దుష్టుడు కాకుండా బ్రతికించావు. నన్ను అల్లుకొని తోడు నీడవై రక్షించనవాడవు నీవే సుమా! నేను చిల్లర మాయలకు గురికాకుండా కాపాడినావు. ఓ అన్నమాచార్యా నా పాలిటి గొప్పదాతవు కూడా నీవే సుమా! నా తలపులోనిలిచి ఆ శ్రీవేంకటనాథుని నమ్మునట్లు చేశావు. ఏవిధముగా జూచినా నాకు ఏడుగురు ఆప్తులు (1. గురువు 2. తల్లి 3. తండ్రి 4. పురుషుడు 5. విద్య 6. దైవము 7. దాత) కూడా నీవే. అప్పుడూ ఇప్పుడూ కూడా నన్ను ఆదుకొని రక్షించినావు.

★ **ఏడుగడ** – ఏడుగురు ఆప్తులు ★ **పల్లదాన** – దౌష్ట్యముతో





సంఖ్య : 46     సంపుటము : 10   పుట: 26     రాగం : రామక్రియ

**49 నీవుగలిగినఁ జాలు నిక్కము అన్నీఁగలవు**
**ఆవల మాయాచార్యుఁడానతిచ్చెనయ్యా ||పల్లవి||**

**యేలోకముననున్న యెడయనిసొమ్ము నీవె**
**తాలిమి యెందుఁబోనిధనము నీవె**
**కాలముకడాతరగని ధాన్యము నీవని**
**ఆలించి మాగురుఁ డిట్టె ఆనతిచ్చెనయ్యా ||నీవు||**

**యెందెందు దిరిగిన యేలికవు నీవె**
**నిందలేనియట్టి తోడునీడవు నీవె**
**ముందువెనకల నిల్లు ముంగిలియు నీవె యని**
**అందముగ దేశికుఁడె ఆనతిచ్చెనయ్యా ||నీవు||**

**యెన్నఁడుఁ గలఁగనట్టి హితుఁడవు నీవె**
**పన్నినట్టెవుండె నిచ్చపంటా నీవె**
**నన్నుఁ గాచే శ్రీవెంకటనాథుఁడ వని తాళ్లపా-**
**కన్నమయ్యంగారె నాకు నానతిచ్చిరయ్యా. ||నీవు||**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య తన తాత అన్నమయ్యను (తొలి గురువు), తన గురువు రామానుజులని, తన దైవం జగద్గురు శ్రీవేంకటేశ్వరుని ప్రస్తుతిస్తూ చెప్పిన కీర్తన ఇది. ప్రభూ! నీవొక్కడవుతోడుంటే, జగమెల్లా తోడువున్నట్లే కదా! ఈమాట స్వయంగా మా గురువే చెప్పారు. మేము యేలోకాననున్నా మాకు ఆధారమైన "సొమ్ము" నీవే. ఎక్కడైనా విలువచెడని ధనము కూడా నీవే. ఎంతకాలమైనా తరగని ధాన్యాగారము నీవేనయ్యా! శ్రద్ధగా మా మొరలను విన్న మా గురుడే దీనినానతిచ్చినాడు. స్వామీ! యెక్కడ చేరినా అచ్చోట యేలికవు నీవే. ఏ నిందాలేని చేయని తోడు నీడవూ నీవే. మా ఇంటి ముంగిట మాత్రమే కాక, వెనకాముందూ రక్షకుడవు నీవే. ఈ మాట స్వయంగా శ్రీరామానుజాచార్యులవారే ఆనతిచ్చారు. ఎన్నడూ కలతపడని మా హితుడవు నీవే. నిత్యమూ నూతనమైన చేనిపంటవు నీవే. నన్ను బాల్యంనుంచి కంటిరెప్పలా కాపాడుతున్నవాడు శ్రీవేంకటేశ్వరుడే. ఈ మాట స్వయంగా మాతాత తాళ్ళపాక అన్నమాచార్యులవారే నాకు ఆనతిచ్చారు.

★ **దేశికుడు** – రామానుజుడు ★ **కలగనట్టి** – కలతబడని

సంఖ్య : 45 సంపుటము : 10 పుట: 26 రాగం : సాళంగనాట

**50 ఎటులఁబుట్టించితో నీవెరుఁగుదువు**
**ఘటన నన్నియు నీసంకల్పమే అయ్యా** ॥పల్లవి॥

**చచ్చేవారిఁ జూచి చావుకు వెరతుఁగాన**
**రొచ్చుల సంసారముపై రోతుఁగాన**
**కచ్చుపెట్టి అదియె కాలాఁజేతాఁబెనఁగఁగ**
**మచ్చికసేయుదుఁగాని మానలేనయ్యా** ॥ఎటు॥

**బడలేవారిఁజూచి బడల నోపఁగాన**
**విడువని సంపదపై విసిగేఁగాని**
**పెడవాయ కదియె పెరుగుచురాఁగాను**
**బడిఁ దిరుగుదుఁగాని పాయలేనయ్యా** ॥ఎటు॥

**ములిగేవారిఁ జూచి ములుగ నోడుదుఁగాన**
**శిలుగుఁగోరికలఁ గోసితిఁగాని**
**కలిమితో శ్రీవెంకటనాథ నీభక్తి**
**వెలయఁ గోరుదుఁగాని విడువలేనయ్యా.** ॥ఎటు॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తనలో స్వామీ! నన్నెట్లా పుట్టించావయ్యా! ఆ సంగతి నీవెరుగుదువు. కాని నేనెరుగను. జరిగే, యే సంఘటనైనా నీ సంకల్పమువలన మాత్రమే జరుగుతుంది. మా ప్రమేయమేమీ వుండదని అంటున్నారు. నేను చచ్చినవాని శవాన్ని జూచి భయపడతాను. కాని రొచ్చులాంటి సంసారముపై రోతపడను. ఆ సంసారమేమో కాళ్ళూ చేతులతో నాతో పెనుగులాడుతుంది. చివరికి రాజీకిపడి దీనితో మచ్చికగా వుంటాను కానీ ఈ సంసారం వద్దని అనుకోను. ఈ సంసార సాగరాన్ని ఈదలేక వడిలిపోతున్న వారిని చూచి నేనూ వడిలిపోతాను. కాని విడిచి వేయవలసిన సంపద మీద విసుగుపుట్టదు, వ్యామోహం పోదు. సంపద చుట్టూ తిరుగుతూనే వుంటాను కాని దానిని వదలలేనయ్యా! ఓ దేవదేవా! ములిగిపోయేవారిని చూచి నేనూ జాలిలో ములిగిపోతానుకాని చీల్చెడి కోరికలను చీల్చివేయలేను. కలిమిని ప్రసాదించే ఓ శ్రీవేంకటేశ్వరా! నీ భక్తి నా మనస్సులో వెలయవలెనని కోరుకొంటాను కాని అది స్థిరపడుటలేదు. అయినా నీ భక్తిని విడిచివుండలేను.

★ **కచ్చుపెట్టి** – ఆశించి ★ **శి(సి)లుగు** – ఉపద్రవము





సంఖ్య : 44 సంపుటము : 10 పుట: 25 రాగం : లలిత

**51 ఆ(అ?)ందరు వికార మందుదురె**
**నిందలేని నీవు నీదాసులుదక్క** ॥పల్లవి॥

**సతుల సుతులఁ జూచి జగములోవారెల్లా**
**మతిలోన భ్రమయక మానరు**
**రతికెక్కఁగా హేయరాగరహితుఁడవై**
**సతతము గలిగినస్వామివి నీపు(వు?) దక్క** ॥ఆంద॥

**ధనధాన్యములుచూచి తగినజీవులు వాని**
**వెనువెంటఁ దిరుగక విడువరు**
**పనివూని యాశాపాశ దూరుఁడవై**
**ఘనతగలుగు శ్రీకాంతుఁడ నీవుదక్క** ॥ఆంద॥

**యిల్లుముంగిలిచూచి యీదేహులు వాని**
**నొల్ల మనుచురోసి వుడుగరు**
**వెల్లవిరిగ శ్రీవెంకటనాథుఁడవై**
**తెల్లమైనయట్టి దేవుఁడవుదక్క.** ॥ఆంద॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తనలో స్వామితో యేమంటున్నారంటే, ఈ ప్రపంచంలో అందరూ వికారములకు గురి అయ్యేవారే, ఒక్క నీ దాసులు తప్పించి. వారు మాత్రమే నిందలేనివారు. ఈ జగతిలో ప్రతివారూ సతీసుతులను చూచి గొప్ప భ్రమలో వుంటారు. అది (ఆ భ్రమను) వదలలేరు. నీవు మాత్రమే హేయరాగ గుణములకతీతుడవు. సర్వకాలముల నీవే మా పాలిట కలిగినవాడవు. ఆయా జీవులందరూ ధరణిలో ధనధాన్యముల వెంట పరుగులు తీసేవారలే. వాటిని విడచివుండలేనివారే. ఓ ప్రభూ! నీ వొక్కడవే ఆశాపాశముజేత కట్టుబడనివాడవు. ఘనత గలిగిన శ్రీకాంతుడవు. ఈ దేహులు వున్నారే, వీరు తమ జీవిత కాలమంతా నా ఇల్లూ, నా ప్రాంగణం అని ముటిసిపోతూ వుంటారు కాని, ఇవేవీ మాకు వద్దని అనుకోరు. వెల్లివిరియైన శ్రీవేంకటనాథా! నీవొక్కడివి మాత్రమే తేటతెల్లమైన దేవుడవు. అందరూ భ్రాంతి జెందేటివారే.

★ **రతికెక్కు** – ప్రసిద్ధిజెందు ★ **ఉడుగరు** – కృశించరు








రచయిత:

## అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు



| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | ఎం.టెక్. |
| ఉండేది | : | ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,<br>సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్. |
| రంధి | : | భగవన్నామ సంకీర్తన |
| నచ్చింది | : | శాస్త్రీయ సంగీతం |
| నచ్చంది | : | నక్కజిత్తులు |
| మెచ్చింది | : | సజ్జన సాంగత్యం |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |







